ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**

**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

సోమవారం, మార్చి 23, 2015,

ఇరవై మూడవ సమావేశం, సంపుటం-3, నంబరు-11,

**MONDAY, THE 23RD DAY OF MARCH, 2015,**

**TWENTY THIRD SESSION, VOLUME - 3, NO.11,**

*****

శాసన పరిషత్తు సచివాలయము,

పబ్లిక్ గార్డెన్స్,

హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**

**PUBLIC GARDENS,**

**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | ః | డా. ఎ. చక్రపాణి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | ః | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | ః | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | ః | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | ః | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు

## సోమవారం, మార్చి 23, 2015.

# అధికార నివేదిక

---

విషయ సూచిక

---

(1) ప్రశ్నోత్తరాలు
(2) ప్రత్యేక ప్రస్తావన
(3) సభా సమక్షంలో ఉంచే పత్రాలు
(4) కార్మికుల సమస్యలపై లఘు చర్చ కొనసాగింపు

---

**ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL**

**MONDAY, THE 23rd DAY OF MARCH, 2015.**

(THE HOUSE ASSEMBLED AT 10.00 A.M.)

(HON'BLE CHAIRMAN IN THE CHAIR)

* * *

(1) **ప్రశ్నోత్తరాలు ః**

MR. CHAIRMAN: Now, Question Hour.

**చేనేత కార్మికులకు సహాయం**

ప్రశ్న నెం. 8071(101)
శ్రీమతి పి. శమంతకమణి,
డా. ఎం. గేయానంద్, ఎం.ఎల్.సి.లు,

గౌరవనీయులైన వెనుకబడిన తరగతులు సంక్షేమ, చేనేత శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

(అ) గడచిన కొన్ని సంవత్సరాలలో అనంతపురము జిల్లాలో ఆత్మహత్యలు చేసుకున్న చేనేతకారుల సంఖ్య ఎంత?

(ఆ) మరణించిన కుటుంబాలకు సహాయాన్ని సమకూర్చడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

గౌరవనీయులైన వెనుకబడిన తరగతుల సంక్షేమ & చేనేత శాఖ మంత్రి (శ్రీ కొల్లు రవీంద్ర):

(అ) 2002 సంవత్సరం నుండి ఇప్పటివరకు అనంతపురము జిల్లాలో 129 మంది నేతకారులు ఆత్మహత్య చేసుకోవడం జరిగింది.

(ఆ) 10–10–2012 తేదీగల జి.ఓ.ఎం.ఎస్.నెం.140 ద్వారా మరణించిన నేతకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా నిమిత్తం రూ.1,00,000 /- లు, రైతులతో సమానంగా ఋణాలు తిరిగి చెల్లింపు నిమిత్తం ఒకే దఫాగా రూ.50,000 /- లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్నది. అనంతపురము జిల్లాలో నివేదించబడిన (129) ఆత్మహత్యలకుగాను మరణించిన నేతకారుల (85) కుటుంబాలకు ఒక్కొక్కరికి ఎక్స్‌గ్రేషియా రూ.1.50 లక్షల మొత్తాన్ని మంజూరు చేయడమయింది.

శ్రీమతి పి. శమంతకమణి ః (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, మంత్రిగారు నష్ట పరిహారం గురించి చాలా బాగా చెప్పారు. కానీ, చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడానికి గల కారణాలు, వాటిని మంత్రిగారు ప్రభుత్వం ద్వారా ఏ విధంగా కార్యక్రమాలను చేపడతారో తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

డా. ఎం. గేయానంద్ ః (ఉపాధ్యాయ నియోజక వర్గం – కడప, కర్నూలు, అనంతపురం) అధ్యక్షా, అనంతపురం జిల్లాలోని ధర్మవరం ప్రాంతంలో గడచిన 8 నెలల్లోనే 14 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. అయితే, ప్రభుత్వం వీరికి ఇచ్చే కాంపన్సేషన్ కోసం ప్రభుత్వం డిఎస్‌పి, ఆర్‌డిఓ తదితరులతో కూడిన ఒక కమిటీని వేసి, దాని ద్వారా నేత కార్మికులకు కాంపన్సేషన్ ఇవ్వడం

జరుగుతోంది. కానీ, ఆ కమిటీ సరిగ్గా పనిచేయడం లేదు.ఎఫ్.ఐ.ఆర్‌లో వ్రాసేటప్పుడు 'అప్పుల బారిన పడి' అనే మాట లేకపోయినా, ఒక చిన్న తేడా వచ్చినా కూడా చేనేత కార్మికుల కుటుంబాలకు ఆ నగదు మొత్తాన్ని కన్సిడర్ చేయడం లేదు. ఒక ప్రక్క కుటుంబంలోని వ్యక్తి చని పోయి వారు బాధలలో ఉంటే, ఆ కుటుంబ సభ్యులు ఇవన్నీ ఎలా పట్టించుకుంటారు సార్? కాబట్టి, చేనేత కార్మికులు ఎవరు చనిపోయినా కూడా వారు ఆర్థిక సంక్షోభం వల్లే చనిపోతు న్నారు. కావున కమిటీ రెగ్యులరుగా పనిచేయడానికి ప్రభుత్వం ఏమేమి చర్యలు తీసుకుంటోంది? అదేవిధంగా, అనంతపురంలోని యాడకిలో ప్రాంతంలో రంగస్వామి అనే చేనేత కార్మికుడు 2013లో చనిపోతే, కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఇంతవరకూ అతని కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఇచ్చే ఎక్స్‌గ్రేషియా విషయంలో చాలా ఆలశ్యం చేస్తున్నారు. కావున ప్రభుత్వం తక్షణమే ఆ కుటుంబానికి రావలసిన మొత్తం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. అంతేగాకుండా, డిఎస్‌పి స్థాయిలో, కలెక్టర్ స్థాయిలో కూడా నివేదికలు రావడం ఆలస్యం అవుతోంది కాబట్టి, వాటివల్ల ఆ కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందే సహాయం ఆగిపోతోంది. కావున ఇవన్నీ సక్రమంగా అమలు జరిగేలా ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటోందో తెలియజేయాలి. అలాగే రంగస్వామి కుటుంబానికి సంబంధించి ఏమైనా సహాయం చేయగలరేమో చెప్పవలసిందిగా తమద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, ఒక వృత్తిలో కానీ, ఒక పనిలో ఉండి కానీ, ఆత్మహత్యలు చేసుకునే పరంపర సుమారు 20 సంవత్సరాలుగా వచ్చిన పద్ధతి ఇది. ఇందులో చనిపోయిన తరువాత, అనేక కండీషన్లు పెట్టి, అది ఆత్మహత్య అని, అప్పుల ద్వారా వచ్చిందనే విషయాలు ఎఫ్ఐఆర్‌లో ఉంటే, ఆ తరువాత సంవత్సరానికో, ఎప్పుడో ఆ డబ్బులు చనిపోయిన వ్యక్తి కుటుంబానికి అందుతున్నాయి. అసలు ఆత్మహత్యలకు కారణభూ తమయ్యే సమస్యలు ఏమిటి? అసలు ఏ సమస్యల వలన ఆ కుటుంబాల వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారో ఒకసారి ప్రభుత్వం అవగాహన చేసుకోవాలి. భవిష్యత్తులో ఆత్మహత్యలు జరగ కుండా, ఆ సమస్యలు తొలగించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటో గౌరవ మంత్రి గారి ద్వారా తెలుసుకోగోరుతున్నాను.

శ్రీ సి. రామచంద్రయ్య : (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, ఇప్పుడు వ్యవసాయం తరువాత ఎక్కువ ఉపాధి దొరికేది చేనేత రంగంలోనే. అంత పెద్ద రంగానికి బడ్జెటులో కేవలం రూ.45కోట్లు కేటాయించారు. ఎందుకు ఆ రంగానికి తక్కువ కేటాయించారో తెలియడం లేదు. వారికి కావలసిన ముడిపదార్థాలు, అమ్మకం ధరకు పొంతన లేకుండా పోయి, వారి కూలి కూడా గిట్టుబాటు అవడం లేదు. మా ప్రాంతంలో మాధవరం, పుల్లంపేట ప్రాంతాలలో చాలా ప్రముఖ మైన చీరలు ఉండేవి. ఈరోజు వారి జీవనం చాలా నికృష్టంగా ఉంది. బడ్జెట్‌లో కేటాయించిన ఈ రూ.45కోట్లతో ఏం కార్యక్రమాలు చేద్దామనుకున్నారో తెలియజేయవలసిందిగా కోరుతున్నాను. గౌరవ ముఖ్యమంత్రిగారి దగ్గర స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఉంది. వాటి ద్వారా చేనేత కార్మికులకు సుమారు రూ.100కోట్లు అదనంగా పెంచే ప్రయత్నం ఏమైనా చేస్తారా?

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి : (పట్టభద్రుల నియోజక వర్గం – ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు) అధ్యక్షా, చేనేత కార్మికులకు సంబంధించిన ఆత్మహత్యల సందర్భంగా ఉత్పన్నమైన కొన్ని సమస్యలను మీ దృష్టికి తీసుకువస్తాను. చిత్తూరు జిల్లాలోని నగరి ప్రాంతంలో చేనేత కార్మికులకు సంబంధించిన ముడి పదార్థాలు రసాయనాలు, రంగులు, నూలు మొదలైనవి ఏవైతే

ఉన్నాయో, వాటి ధరలను ఇటీవల కాలంలో ఎక్కువగా పెంచారు. వాటిని నియంత్రించవలసిన అవసరం ఎంతైనా ఉంది. మన రాష్ట్రంలో ఇండస్ట్రియల్ ఛార్జెస్ క్రింద ఉన్న ధరలే మరమగ్గాలకు సంబంధించిన విద్యుత్తు విషయంలో కూడా అటువంటి ధరలే వేస్తున్న పరిస్థితి ఉంది. తెలంగాణ, కరీంనగర్ లాంటి జిల్లాలలో ఆ విద్యుత్తుకు కూడా సబ్సిడీ ఇస్తున్నారు. అదేవిధంగా, మన రాష్ట్రంలో కూడా చేనేత కార్మికులకు కూడా సబ్సిడీ ఇవ్వాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. వారు తయారు చేసినవాటికి సరైన ధర రాకపోవడం చాలాదురదృష్టకరం. వ్యవసాయ పరిశ్రమకు సంబంధించిన కార్మికుల వలె చేనేత కార్మికులను కూడా రాయితీలు ఇచ్చి ఆదుకోవాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అటువంటి విద్యుత్తు రాయితీలు మరమగ్గాలకు ఇస్తున్నారా? ముడిపదార్థాలకు సంబంధించిన అన్ని రకాల ధరలను తగ్గించే ప్రతిపాదన చేయాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కె.ఎస్. లక్ష్మణరావు : అధ్యక్షా, ప్రస్తుత సమస్య చాలా ముఖ్యమైనది. గుంటూరు జిల్లాలోని భట్టిప్రోలు, పేటేరు ప్రాంతాలలో చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్నారు. రెండు సంవత్సరాల క్రితం అక్కడ భారీ వర్షాలకు మగ్గాలన్నీ మునిగిపోవడం వలన ఆ కార్మికులు చాలా నష్టపోయారు. వారికి నష్టపరిహారం నిర్ణయించారు కానీ, ఇంతవరకూ ఆ సొమ్ము అందలేదు. త్వరలో వారికి నష్టపరిహారం అందేలాగా తగిన చర్యలు తీసుకోవాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు : (పట్టభద్రుల నియోజక వర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం) అధ్యక్షా, శ్రీకాకుళం జిల్లా పొందూరులో చేనేత కార్మికులు ఎంతో మంది ఉన్నారు. వారి శ్రమ అంతా ఎక్కువగా దోపిడీకే గురవుతోంది. రాష్ట్రంలోని 13 జిల్లాలలో ఇటువంటి వృత్తులలో ఉండేవారు చాలా తక్కువ మంది ఉంటారు కావున, వారి కోసం ప్రభుత్వం ఏమైనా కాంప్లెక్సులులాగా పెట్టి, వారికి పునరావాసం కల్పించి, వారి ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు వచ్చేలాగా చర్యలు తీసుకోవాలి. అలాగే, చేనేత కార్మికుల కళలు అంతరించిపోకుండా ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటే బావుంటుందని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

ఉ. **10.10**

శ్రీ బి. చెంగల్‌రాయుడు : (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, మనం కాటన్ ఉత్పత్తి చేస్తున్నాము. దాని మీద 25 శాతం సబ్సిడీ ఇచ్చి బట్టలు కొంటున్నాము. రా మెటీరియల్ అనేది మాస్టర్ వీవర్ చేతిలో పడిపోయి, వాళ్లు వీళ్లని దోచుకుంటున్నారు. ఆ విధంగా దోచుకోవడం విషయంలో సభ్యురాలు శ్రీమతి పి.శమంతకమణి గారు చెప్పిన నిజాలు గమనిస్తే, ఇప్పటివరకూ, మీరు చనిపోయినటువంటి వాళ్ల గురించే ఆలోచన చేశారు తప్పితే, what are the preventive measures that you are taking up? అని ఒక మంచి ప్రశ్న వేశారు. వారి ప్రశ్నకు మీ నుండి మంచి జవాబు రావాలని కోరుకుంటున్నాను.

ముఖ్యంగా రైతులకు సంబంధించి ఎవరైనా అప్పుల బాధతో చనిపోతే, రూ.5 లక్షలు ఇస్తామని అంటున్నారు. చేతకు, నేతకు, వ్యవసాయానికి సంబంధించి ఇంతకుముందే ఎల్‌ఓపీ గారు చెప్పినట్లు పెద్ద సంఖ్యలో ఇళ్లు ఉండేవి. వాళ్లకు కూడా పెద్ద మొత్తంలో పరిహారం ఇచ్చే విధంగా ప్రయత్నం చేయాలి. వీవింగ్‌కు సంబంధించి చూస్తే, చిత్తూరు జిల్లాలో 'నగరి' చుట్టుప్రక్కల ఉండే ఇండస్ట్రీల్లో వేస్ట్‌ని కూడా తయారు చేసి ఇతర దేశాలకు పంపిస్తున్నారు. ఇతర దేశాల నుండి

మళ్లీ మనం తెచ్చుకుంటున్నాము. వీటన్నింటినీ స్టడీ చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చి ఒక హౌస్ కమిటీ వేస్తే బాగుంటుందని కోరుకుంటున్నాను.

ఇక ఋణమాఫీ విషయానికి వస్తే, కోటయ్య గారి కమిటీ కూడా రికమెండ్ చేసింది. అలాగే, ఎలక్షన్ మ్యానిఫెస్టోలో కూడా మీరు పూర్తిగా ఋణ మాఫీ చేస్తామని చెప్పి ఉన్నారు. కోటయ్య గారి రిపోర్టు ప్రకారంగా రూ.169 కోట్లు, రూ.22,500, subject to correction, ఇస్తామని చెబుతున్నారు. ఆ ముక్క కూడా ఇదిగో ఈ తేదీ లోపల మీకు ఋణ మాఫీ చేస్తామని చెప్పొచ్చు కదా? వాళ్లది తక్కువ అమౌంట్. మంత్రి గారి నోటి గుండా ఆ మంచి మాట ఇప్పుడే చెబుతారని ఆశిస్తున్నాను.

శ్రీ కొల్లు రవీంద్ర : అధ్యక్షా, గౌరవ సభ్యులు చాలా విషయాలు చెప్పారు. ముఖ్యంగా, చేనేత కారుల ఆత్మహత్యల నివారణా చర్యల గురించి సభ్యురాలు శ్రీమతి పి. శమంతకమణి గారు అడిగారు. ఆత్మహత్య చేసుకున్న రైతులకు ప్రత్యేక ప్యాకేజీ కొరకు ప్రతి జిల్లా కలెక్టరేట్ నందు ఒక సహాయ కేంద్రం నిర్వహించబడుతోంది. ఎవరైనా ఒక చేనేత కార్మికుడు గానీ, వారి శ్రేయోభిలాషి గానీ, స్నేహితుడు గానీ, బంధువు గానీ, కుటుంబ సభ్యుడు గానీ ఎవరైనా చేనేత కార్మికుడు ఆత్మహత్యలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే అవకాశముంటే, ఆ విషయాన్ని ముందుగానే సహాయ కేంద్రానికి తెలియపరచవచ్చును. అట్టి సమాచారాన్ని అందుకున్న వెంటనే, స్థానిక చేనేత మరియు జౌళి శాఖ సహాయ సంచాలకులు, వారి యంత్రాంగం అట్టి కుటుంబంతో సంప్రదించి, అతనిపై గల ఒత్తిడిని తగ్గించడానికి ప్రయత్నం చేస్తారు. అట్టి విషయంలో ప్రస్తుత చేనేత కార్మికులకు అమలులో ఉన్నటువంటి చేనేత పథకాల క్రింద సహాయం అందించడానికి ప్రాధాన్యాన్నివ్వడం జరుగుతుంది.

అలాగే, గౌరవ సభ్యులు డా.ఎం.గేయానంద్ గారు మాట్లాడుతూ, చేనేతకారుల ఆత్మహత్యలకు సంబంధించి పరిహారం అందించాల్సిన కేసుల విచారణలో చాలా ఆలస్యం జరుగుతోందని అన్నారు. అట్టి కేసుల విచారణ కొరకు ప్రత్యేకంగా ఒక కమిటీ ఉంటుంది. ఆ కమిటీలో ఆర్డీఓ, డీఎస్పీ మరియు ఏ.డీ. హ్యాండ్లూమ్స్ సభ్యులుగా ఉంటారు. ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించి, మృతుని యొక్క వృత్తిపరమైన సమస్యలు, ఆర్థిక స్థితి, సామాజిక అసమానతలు మరియు మృతికి పురికొల్పిన ఆర్థిక అసమానతలు వంటివన్నీ పరిశీలించడం జరుగుతుంది. ఆ క్రమంలో కొద్దిగా ఆలస్యం జరుగుతోందని చెప్పడం జరుగుతుంది. ఖచ్చితంగా ఋణ బాధల తాలూకు ఆత్మహత్యలుగా నిర్ధారణకు వచ్చిన దాన్ని స్క్రీనింగ్ చేసి, వెంటనే నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అలాగే,..

డా.ఎం.గేయానంద్ : సార్, పర్టిక్యులర్‌గా నేను ఒక పేరుని మెన్షన్ చేశాను.

శ్రీ కొల్లు రవీంద్ర : 2013లో యాడికిలో రంగస్వామి అనే వ్యక్తి గురించి మీరు చెప్పడం జరిగింది. తప్పకుండా దాన్ని పరిశీలిస్తాము.

డా.ఎం.గేయానంద్ : పరిశీలించడమేమిటి సార్?

శ్రీ కొల్లు రవీంద్ర : అదేనండీ. చూసుకుని, పరిశీలించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేస్తున్నాను. అలాగే, గౌరవ సభ్యులు పవర్‌లూమ్స్ గురించి చెప్పడం జరిగింది. 5 హెచ్.పి. లోపు ఉన్నటువంటి కనెక్షన్లన్నింటికీ కూడా 50 పర్సంట్ పవర్ టారిఫ్ ఇవ్వడం జరుగుతుంది. అలాగే, ఈ రోజున యార్న్ సబ్సిడీకి సంబంధించి, 20 పర్సంట్ యార్న్ సబ్సిడీ

ఇచ్చి, 10 శాతం డైరెక్ట్ వీవర్‌కు, 10 పర్సంట్ సొసైటీకివ్వడం జరుగుతుంది. అలాగే, అన్ని రకాలుగా ఇందాకే సభ్యులు శ్రీ సి.రామచంద్రయ్య గారు చెప్పినట్లుగా, చేనేత కార్మికుల రుణమాఫీకి సంబంధించి బడ్జెట్‌లో కేటాయింపు తక్కువ జరిగిందని చెబుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో తక్కువ జరగదు. ఆ మొత్తాన్ని పెంచడానికి డిస్కషన్స్ జరుగుతున్నాయి. ఎందుకంటే, చేనేత కార్మికులకు రుణ మాఫీ విషయంలో ముఖ్యమంత్రి గారు చాలా పట్టుదలగా ఉన్నారు. మొన్న క్యాబినెట్ మీటింగ్‌లో కూడా ఈ విషయాన్ని చెప్పారు. రూ.169 కోట్లు మాత్రమే కాదు. ఇంకా పెరిగేందుకు అవకాశముంది. దాదాపు రూ.250 కోట్ల వరకు పెరిగే అవకాశముంది. ఖచ్చితంగా త్వరలోనే రైతు రుణాల మాఫీతో బాటు, చేనేత రుణాలను కూడా మాఫీ చేయడం జరుగుతుంది.

అలాగే, సరుకులు అమ్ముకునే విషయంలో కూడా ఇందాక సభ్యులు శ్రీ కె.ఎస్. లక్ష్మణ రావు గారు గానీ, శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి గారు గానీ చెప్పిన విధంగా చేనేతకారులకు రిబేట్ కూడా ఇవ్వడం జరుగుతుంది. గతంలో జరిగిన ఉద్యమాల వల్ల గానీ, ఎందువల్లనో గానీ స్టాక్స్ అన్నీ కూడా ఎక్యుములేట్ అవ్వడం జరిగింది. అవన్నీ 30 శాతం రిబేట్ ఇచ్చి కొనుగోలు చేయడం జరుగుతోంది. ఆప్కో ద్వారా పెద్ద ఎత్తున వీవర్స్ నుండి మనం స్టాక్స్ తీసుకోవడం జరుగుతోంది.

శ్రీ కె.ఎస్.లక్ష్మణ రావు : సార్, గుంటూరు జిల్లాలో భారీ వర్షాలకు మగ్గాలు దెబ్బతిన్నాయి. ఆ విషయంలో కలెక్టర్ గారి నుండి ఒక నివేదిక కూడా వచ్చింది.

శ్రీ కొల్లు రవీంద్ర : సార్, గౌరవ సభ్యులు శ్రీ కె.ఎస్. లక్ష్మణ రావు గారు చెప్పిన విధంగా, ఆ నివేదిక తెప్పించుకుని, దాని మీద వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అలాగే, మొన్ననే రాష్ట్రంలో ఉన్నటువంటి చేనేత సంఘాల నాయకులందర్నీ పిలిచి, ఒక మీటింగ్ కూడా పెట్టడం జరిగింది. వాళ్ల దగ్గర నుండి కొన్ని రిప్రజెంటేషన్లు తీసుకుని, ముఖ్యమంత్రి గారి ముందు పెట్టినప్పుడు, ముఖ్యంగా జనతా వస్త్రాల గురించి వారు మాట్లాడటం జరిగింది. ముఖ్యమంత్రి గారు చాలా సానుకూలంగా జనతా వస్త్రాలను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ రకంగా చేనేత కార్మికులను ఆదుకునేందుకు, ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నది.

శ్రీ సి. రామచంద్రయ్య : అధ్యక్షా, నేను ఈ ప్రశ్న వేసినందుకు సభ్యురాలు శ్రీమతి పి.శమంతకమణి గార్ని అభినందిస్తున్నాను. ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. చాలా మంచి ప్రశ్న సార్. ఇప్పుడు మంత్రి గారిచ్చిన సమాధానం చూస్తుంటే, ఒక మాంత్రికుడి ప్రాణం మాదిరిగా ఉంది. అక్కడ ఎవరైనా ఒక చేనేత కార్మికుడు ఇబ్బందుల్లో ఉంటే, సూసైడ్ చేసుకుంటాడన్న అభిప్రాయం అక్కడ ఉంటే, దాని గురించి వేరే వాళ్లు పోయి ఇన్‌ఫార్మ్ చేసిన వెంటనే, అక్కడున్న అసిస్టెంట్ డైరెక్టర్ (హ్యాండ్‌లూమ్స్) పోయి, ఆ ప్రెషర్‌ని తగ్గించే ప్రయత్నం చేస్తారని చెప్పారు. ఏమిటి సార్ ఇది? Is it practicable? ఎవరిది వాడు కడుక్కోలేక ఛస్తున్నాడక్కడ! వాడేదో ఇబ్బందుల్లో ఉన్నాడనే విషయం వీళ్లకు తెలియాలి, వీళ్లే వెళ్లి అక్కడ డిపార్టుమెంటుకు ఇన్‌ఫార్మ్ చేయాలి, డిపార్టుమెంటు వాళ్లు వచ్చి వాడితో మాట్లాడి ప్రెషర్ తగ్గించే ప్రయత్నం చేయాలి. ఏమిటిది!

మీరు చేనేతకారులకు ఋణమాఫీ చేస్తామని మీ ఎలక్షన్ మ్యానిఫెస్టోలో చెప్పారు. ఇది చాలా తక్కువ అమౌంట్. మీరు దీని కోసమంటూ ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదు. అదేమన్నా అంటే, ఇంకా చర్చిస్తున్నామని అంటారు. ఎన్ని రోజులు చర్చిస్తారు? మీరు బడ్జెట్‌లో ప్రొవిజన్ పెట్టి కాన్ఫిడెన్స్ అన్నా క్రియేట్ చేస్తే, ఫర్వాలేదు. ఇప్పటి వరకూ ఇస్తారన్న నమ్మకం వారిలో కొంత ఉంది. ఇప్పుడేమో ఇవ్వడం లేదు. నిజంగా దీని వల్ల చాలా ఆత్మహత్యలు జరగబోతాయి. మేము ఆ ప్రాంతాల నుండి వచ్చాము కాబట్టి చెబుతున్నాము. మీరు చర్చలు చేయండి. దాన్ని

మేమెవ్వరం కాదనము. కానీ, మీరు బడ్జెట్లో ఏ మాత్రం ఎలొకేషన్స్ ఇవ్వకుండా, మేము చేస్తున్నాము, చేస్తున్నాము అని చెప్పి, లాస్ట్‌లో ఫండ్స్ లేవనే కారణాల్నే చూపిస్తున్నారు.

శ్రీ కొల్లు రవీంద్ర ః సమస్యే లేదు అధ్యక్షా. చేనేత కార్మికుల యొక్క రక్షణ కోసం ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. ఎట్టి పరిస్థితుల్లో కూడా అన్ని చర్యలూ తీసుకుంటున్నాము. చాలా ప్రాంతాల్లో నేను వెళ్లి ప్రత్యేకంగా సందర్శించి, వాళ్లకున్న సమస్యలన్నీ తెలుసుకుంటున్నాను. అతి త్వరలో పూర్తి స్థాయిలో వాళ్లెవ్వరికీ ఇబ్బందులు కలిగించకుండా కేటాయింపులు చేస్తాము. బడ్జెట్‌లో కేటాయింపుల తక్కువ చేశారని మాట్లాడుతున్నారు. అలాంటిది ఎప్పుడూ లేదు. మేమెప్పుడూ కూడా చేనేత కార్మికుల కొరకు చిత్తశుద్ధితో, అంకితభావంతో పనిచేస్తాము.

డా.ఎం. గేయానంద్ ః సార్.. ఒక్క నిమిషం.

మిస్టర్ ఛైర్మన్ ః గేయానంద్ గారూ.. ఇంకా 9 ప్రశ్నలున్నాయి. ఇప్పటికే ఈ ప్రశ్నకు సంబంధించి 15 నిమిషాల చర్చ అయ్యింది.

డా.ఎం. గేయానంద్ ః సార్, ప్రశ్నలోనే 40 మందికి సంబంధించిన క్లెయిమ్స్ సెటిల్ చేయలేదని సమాధానం చెబుతున్నారు. అనంతపురం జిల్లాలోనే 40 మంది చేనేత కుటుంబాల వారు ఆత్మహత్యలు చేసుకుంటే, వాటికి సంబంధించి ఎటువంటి చర్యలూ ఇంతవరకు ప్రభుత్వం తీసుకోలేదనే విషయం ప్రభుత్వమిచ్చిన సమాధానంలోనే ఉంది. నా దృష్టికి వచ్చిందేమంటే, చిన్న చిన్న కారణాలతోనే క్లెయిములను రిజెక్ట్ చేస్తున్నారు. ఈ మధ్యనే 5 కేసులను రిజెక్ట్ చేశారు. డీఎస్పీ గారు విచారణలో, వీళ్లకు 20, 25 ఏళ్లుంటే, వీళ్లకి అప్పులు ఎవరిస్తారు? కాబట్టి, ఇది అప్పుల కేసు కాదని రిజెక్ట్ చేయడం, బ్యాడ్ హ్యాబిట్స్ ఉన్నాయని రిజెక్ట్ చేయడం, లేకపోతే ఫ్యామిలీ ప్రాబ్లం ఉండటం వల్ల చనిపోయారని రిజెక్ట్ చేయడం... ఇలా, ఇటీవలే ఐదారు కేసులను రిజెక్ట్ చేశారు. ఈ విధంగా కండీషన్స్ పెట్టడమనేది ఒక రకంగా వీరిని ఇబ్బంది పెట్టడమే కదా? అట్లాగే, ఆర్డీఓ, కలెక్టర్ల దగ్గర మరో ఐదారు కేసులు పెండింగులో ఉన్నాయి. నామినీ డాక్యుమెంట్లు ఇవ్వలేదని ఒకట్రెండు కేసులు పెండింగులో ఉన్నాయి. చిన్న, చిన్న కారణాల వల్ల ఈ రకంగా క్లెయిములన్నీ పెండింగులో ఉంటే ఎట్లా? వీటిని ఎప్పుడు సెటిల్ చేసి వాళ్లకిస్తారు? ఆ వివరాలు చెప్పాల్సిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ కొల్లు రవీంద్ర ః అధ్యక్షా, తప్పకుండా గౌరవ సభ్యులు డా.ఎం. గేయానంద్ గారు చెప్పిన వివరాలు మాకు అందిస్తే, తప్పకుండా వాటి మీద చర్యలు తీసుకుంటాము.

## పాలిథిన్ బ్యాగుల నిషేధం

ప్రశ్న నెం.7933(102),

శ్రీమతి టి. రత్నాబాయి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) పాలిథిన్ సంచుల వినియోగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన విషయం వాస్తవమేనా?

ఆ) చాలా జిల్లాల్లో పాలిథిన్ సంచుల వినియోగం ఇప్పటికీ కొనసాగుతున్న విషయం కూడా వాస్తవమేనా?

ఇ) ఆ సమస్యను పరిష్కరించడానికి తీసుకున్న ప్రత్యామ్నాయ చర్యల వివరాలేమిటి?

గౌరవనీయులైన పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ పి. నారాయణ):

అ) అవునండీ.

ఆ) అవునండీ.

ఇ) ప్రభుత్వం తీసుకున్న ప్రత్యామ్నాయ చర్యలు ఈ క్రింది విధంగా ఉన్నాయిః

(i) 2011 లో సెంట్రల్ గవర్నమెంట్‌లోని పర్యావరణ, అడవులు, శాస్త్ర మరియు సాంకేతిక విజ్ఞాన (పర్యావరణ) శాఖ వారిచ్చిన రూల్స్‌ని బేస్ చేసుకుని, తేదీ.20.06.2013 నాడు జీ.ఓ.ఎం.ఎస్.నెం.46 విడుదల చేయబడింది.

(ii) ఆ జీఓను అమలు పరచాలని రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లందరికీ, పురపాలక ప్రాంతీయ డైరెక్టర్-కం-అప్పిలేట్ కమీషనర్లు మరియు అన్ని పట్టణ స్థానిక మండళ్ల కమీనర్లకు ఆదేశాలను జారీ చేయడమయింది.

40 మైక్రాన్స్ మందం కన్నా తక్కువగా ఉన్న ప్లాస్టిక్‌ని తయారు చేయకూడదు, వాడకూడదని నిషేధం చేశారు. అంతేగాకుండా, ఆహార వస్తువుల నిల్వలకు, ప్యాకింగ్‌కు రీసైక్లింగ్ ప్లాస్టిక్‌ని వాడకూడదని, దేవాలయాలు, హాస్పిటల్స్, హోటల్స్, రెస్టారెంట్లు మొదలైన వాటిల్లో రీసైకిల్ అయిన ప్లాస్టిక్‌ని వాడకూడదని, టుబాకో, పాన్ మసాలా వంటి వాటిని నిల్వ చేయడానికి గానీ, ప్యాకింగ్ చేయడానికి గానీ రీసైక్లింగ్ ప్లాస్టిక్ బ్యాగులు వాడకూడదని, అదేవిధంగా ఫుడ్ స్టఫ్స్, ఫార్మాస్యూటికల్స్, డ్రింకింగ్ వాటర్ ప్యాకింగ్‌లో తెలుపు రంగు ప్లాస్టిక్ మాత్రమే వాడాలని, లేదా రంగు ప్లాస్టిక్‌ని వాటిలో వాడదల్చుకుంటే, ISI-9833, 1891 నిర్ణయించిన కండీషన్స్ ప్రకారం వాటికి లోబడి, రంగుల బ్యాగులను మాత్రమే తయారు చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

ఉ. **10.20**

అధ్యక్షా, అదే విధంగా పార్కులు, ప్లే గ్రౌండులు రిక్రియేషన్ ప్రెమిసెస్‌లు, టూరిజం సెంటర్స్ వాటర్ బాడీస్, బీచ్‌లు మొదలైన చోట్ల ప్లాస్టిక్ బ్యాగ్‌లు పడేయగూడదని చెప్పడం జరిగింది. అతిక్రమించిన వారిపై కొన్ని పెనాల్టీలను ఇంపోజ్ చేయడం జరిగింది. పెనాల్టీలు ఈ విధంగా ఉన్నాయి. కస్టమర్లు అయితే రూ.250 నుండి రూ.500లు వరకు, రిటైలర్స్ అయితే రూ.2500ల నూడి రూ.5000ల వరకు, ఉత్పత్తిదారులైతే రూ.25000ల నుండి రూ.50000ల వరకు పెనాల్టీలు వేసే విధంగా చట్టంలో పొందుపరచడం జరిగింది. ఇంతవరకు మొత్తం దాదాపు 1970 వర్క్‌షాపులను మున్సిపాలిటీల పరిధిలో అవగాహన కోసం నిర్వహించడం జరిగింది. దాదాపు 832462 pamphlets, బ్రోచర్లను అవేర్‌నెస్ కోసం డిస్ట్రిబ్యూట్ చేయడం జరిగింది. దీనికి సంబంధించి దాదాపు 232 ట్రేడర్స్ మీద పెనాల్టీ విధించడం జరిగింది. తరువాత, 80070 కిలోల ప్లాస్టిక్ బ్యాగులను సీజ్ చేసి destroy చేయడం జరిగింది. రూ. 4638000లను పెనాల్టీ రూపంలో వసూలు చేయడం జరిగింది. అతిక్రమించిన వారిపై ఈ విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతోంది.

(iii) సంబంధిత జిల్లా పర్యావరణ కమిటీలు తరచుగా సమీక్షలను నిర్వహించాలి.

(iv) మునిసిపలు అధికారులు తరచుగా దాడులను నిర్వహిస్తూ, అతిక్రమణదారులపై జరిమానాలు విధించడమయింది.

(v) నియతకాలికంగా పారిశుధ్య సిబ్బంది ద్వారా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడమవుతున్నది.

శ్రీమతి టి. రత్నాబాయి : (నామినేటెడ్) అధ్యక్షా, విచ్చలవిడిగా ప్లాస్టిక్ బ్యాగుల వాడకమనేది పర్యావరణానికి ముప్పు అనేది అందరికి తెలుసు. అప్పిలేట్ కమీషనర్లు ఉన్నారని చెబుతున్నారు. జిల్లాలలో ఎక్కడా కూడా వీటికి సంబంధించి ఎటువంటి సమావేశాలు పెట్టిన దాఖలాలు లేవు. దీనిని పటిష్టంగా అమలు చేయడానికి ఏమైనా చర్యలు తీసుకుంటారా? ఇప్పుడు మంత్రి గారు చెప్పినవన్నీ ఆదేశాలు ఇచ్చినట్లుగా చెప్పారు. కాని చాలా ఎక్కువగా ప్లాస్టిక్ వినియోగం జరుగుతోంది. కాబట్టి ఇంకా పటిష్టంగా చేయడానికి ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందా?

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, మంత్రి గారి సమాధానంలో మొదటి రెండు ప్రశ్నలకు అవునండీ అని చెప్పారు. తరువాత, చెప్పిన దానిలో ఏమేమి ఆర్డర్ చేశారు, ఏమేమి చేయాలనుకున్నారో చెప్పారు. ఎక్కడ చూచినా, మున్సిపాలిటీ పరిధిలో కాని, పట్టణాలలో, సిటీస్ నుండి గ్రామీణ ప్రాంతాల వరకు కూడా ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోంది. కూరగాయలు అమ్మేవాళ్లు కాని, సరుకులు అమ్మేవాళ్లు కాని, ఇళ్లల్లో కూడా ప్లాస్టిక్ బ్యాగులను ఉపయోగిస్తున్నారు. చివరికి, పెద్ద, పెద్ద వాళ్లల్లో జరిగే పెళ్లిళ్లకు కాని, చిన్న, చిన్న వాళ్ళ ఇళ్లల్లో జరిగే పెళ్లిళ్ల సందర్భంలో భోజనాల కోసం ప్లాస్టిక్‌తో తయారైన విస్తరాకులను వినియోగించడం జరుగుతోంది. ఈ ప్లాస్టిక్ సంచుల వల్ల మామూలుగా భూమిలో కలిసిపోయి, భూగర్భ జలాలు కలుషితమవడమే కాకుండా పశువులన్నీ కూడా ఆకలితో ఆ ప్లాస్టిక్ కవర్లను తినడం వల్ల పశువులు చనిపోవడం జరుగుతోంది. అలాగే, చాలా మంది పేదవాళ్లు, బిచ్చగాళ్లు మొదలైన వారు ఆ ప్లాస్టిక్ కవర్లలోని ఆహార పదార్థాలను తినడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో, పట్టణ ప్రాంతాలలో విచ్చలవిడిగా అమ్మే వీటిని కంట్రోల్ చేసే పరిస్థితి రాలేదు. మనం ఇప్పుడు కొత్తగా అధికారంలోకి వచ్చాం కాని, ఇది దశాబ్దాల కాలం నుండి జరుగుతోంది కాబట్టి ఒక్కసారిగా మార్పు రాదు అనడం నిజమే. కాని, ఎక్కడా కూడా ఇన్‌స్పెక్షన్లు కాని, ఆకస్మిక తనిఖీలు కాని జరగడం లేదు. అన్నింటి కన్నా మించి పెద్ద ప్రమాదం ఎక్కడ జరుగుతుందంటే.. ఇప్పుడు ఊళ్లో ఉన్నటువంటి చెత్తా, చెదారం తీసుకెళ్లి ఆ ఊరు ప్రక్కనే పోస్తుంటారు. పల్లెటూర్లలో అయితే రోడ్డు ప్రక్కనే పోస్తుంటారు. ఒక పద్ధతి అంటూ ఏమీ లేదు. చిన్న మున్సిపాలిటీలలో అయితే అంతకన్నా లేదు. పట్టణ ప్రాంతాలలో, నగరాలలో కూడా చెత్తను డంప్ చేసిన చోటకు వెళ్లి అనేకమంది వాటిల్లో ఉన్న ప్లాస్టిక్ కవర్లను ఏరుకోవడం, చిత్తు కాగితాలను ఏరుకోవడం లేకపోతే పశువులు వెళ్లి తినడం వల్ల చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. దయచేసి, ఇన్‌స్పెక్షన్లు చేయండి. ఆకస్మిక తనిఖీలు చేయండి. కేవలం మున్సిపాలిటీలలోనే కాదు అనేక చోట్ల ఈ సమస్య ఉంది. ఈ సమస్యను పరిష్కారం చేసేదానికి డంప్ చేసిన చెత్తను తగలపెట్టించండి. ఇతర దేశాలలో అయితే ఒకేచోట లాన్‌లో పెద్ద, పెద్ద దిబ్బలుగా వేసి తగులబెడుతుంటారు. ఆ విధంగా మన దగ్గర చేయడం లేదు. మున్సిపాలిటీలలో ఇంటింటికి బ్లాక్ కవర్లను సరఫరా చేసి, వాటిని వెంటనే తీసుకెళ్ళే పద్ధతి లేకపోవడం వల్ల వాటన్నింటిని మురికి కాలువలల్లో వేయడం వల్ల ఆ కాలువలన్నీ పూడుకుపోవడం వ్ల డ్రైనేజీ నిలిచిపోవడంతో దోమలు, దుర్గంధం వ్యాపిస్తున్నాయి. కొత్తగా వచ్చిన ప్రభుత్వం తీసుకున్న ఆలోచనలు చాలా బాగున్నాయి. కాని, వినడానికే కాకుండా చేతల్లో కూడా చూపించాల్సిన అవసరముందనేది మీ ద్వారా సూచిస్తున్నాను.

మరొకటి, ఫ్లెక్సీల విషయానికి వస్తే.. రాజకీయ నాయకులందరూ చాలా పెద్ద, పెద్ద ఫ్లెక్సీలను పెడుతున్నారు. రాజకీయ నాయకుల శిష్యులైతే..

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం ః (పట్టభద్రుల నియోజక వర్గం – ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు) రాజకీయ నాయకులు పుట్టింది దానిలో నుండే. ఆ ఫ్లెక్సీలు లేకపోతే రాజకీయ నాయకులు ఎప్పుడెప్పుడు జన్మించారో, ఎప్పుడెప్పుడు ఏ ఏ పదవులలో ఉన్నారో ఎలా తెలుస్తుంది.?

మిస్టర్ ఛైర్మన్ ః ఫ్లెక్సీలపై టీచర్ల దగ్గర నుండి వచ్చే సమాధానం ఇదేనా?

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం ః అధ్యక్షా, పట్టణాలలో ఫ్లెక్సీలను నిషేధిస్తే సగం ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు అవుతుంది. రాజకీయ నాయకులందరినీ తమ ఫ్లెక్సీలు లేకుండా చేస్తామని వాగ్దానం చేయమనండి. 5 నిమిషాలలో ఈ సమస్య సగం పరిష్కారమవుతుంది. ఆ విధంగా మాట్లాడకుండా ఈ విధంగా మాట్లాడితే ఏమి లాభం?

శ్రీమతి నన్నపనేని రాజకుమారి ః అధ్యక్షా, పెద్ద, పెద్ద ఫ్లెక్సీలను పెడుతున్నారు. వాటిని మరల తీసివేయడం లేదు. కంట్రోల్ లేదు. ఎంఎల్ఏలు ఏమన్నా అంటారేమోనని భయపడుతున్నారు. నాకు ఫ్లెక్సీలు పెట్టించుకునే అలవాటు లేదు. పెట్టే అలవాటు లేదు. నేను నిర్భయంగా చెబుతున్నాను. ఫ్లెక్సీలను నిషేధించాలని కోరుతున్నాను. ఆ ఫ్లెక్సీలు కూడా గాలి క్రిందకు పడినప్పుడు ప్రమాదాలు జరగడమే కాకుండా, ఆ కాగితాలను గేదెలు, పశువులు తినడంతో చాలా ప్రమాదం జరుగుతోంది. నేను ఏమంటున్నానంటే.. మంత్రి గారు చెప్పినటువంటి పద్ధతులలో ఏదైతే మంత్రి గారు హెచ్చరికలు చేస్తున్నారో ఆ హెచ్చరికలన్నింటికి ఫ్లెక్సీల రూపంలో మున్సిపాలిటీ తరఫున పెట్టించండి. మిగతా ఫ్లెక్సీలను పెట్టవద్దు, ప్రజలను ఎడ్యుకేట్ చేసేటటువంటి ఫ్లెక్సీలను పెడదామని మీరు ఆదేశాలు ఇచ్చి పెట్టించండి. మీరు ఏదైతే తీర్మానాలు చేశారో, మీరు ఏదైతే ఆరోగ్యం జాగ్రత్త అని చెబుతున్నారో మున్సిపాలిటీల తరఫున మంత్రి గారు తగు చర్యలు తీసుకొని వాటిని ఏర్పాటు చేయవలసిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ కె.యస్. లక్ష్మణరావు ః అధ్యక్షా, మంత్రి గారి సమాధానంలో 40 మైక్రాన్ల లోపు న వాటిని నిషేధించామని చెప్పారు. పరిశ్రమలకు అనుమతులు, లైసెన్స్ ఇచ్చేది ప్రభుత్వమే కాబట్టి వాటి ఉత్పత్తి కేంద్రాలలోనే వాటికి లైసెన్స్ ఇవ్వకుండా వాటి ఉత్పత్తిని నిలుపుదల చేయించాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం ః అధ్యక్షా, ప్లాస్టిక్ నిషేధం మీద, వాడకం మీద మంత్రి గారు చాలా సుదీర్ఘమైన జవాబు చెప్పారు. అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆ చర్యలు ఏ విధంగా ఫలితాలిచ్చాయనేది ఏ మున్సిపాలిటీకి వెళ్లినా చాలా స్పష్టంగా తెలుస్తోంది. అది మీకు కూడా తెలుసు. ఈ ఆధునిక యుగంలో ప్లాస్టిక్ లేకుండా వ్యవహారం జరగదు. ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటంటే.. దానిని రీ–సైక్లింగ్ చేయడమే. మీరు గమనించండి. ఇతర దేశాలకు ఎక్కడకు వెళ్లినా ఒక షాపు వెళ్లి ఒక వస్తువు కొని బ్యాగ్‌లో పెడితే it is made with the re-cycling material అని చెప్పి దాని క్రింద వ్రాసి ఉంటుంది. రీ–సైక్లింగ్‌కు అభ్యంతరాలు పెడుతున్నామని అంటున్నారు. కొన్ని పదార్థాలు చెత్త, చెదారాన్ని రీ–సైక్లింగ్ చేసి అది నష్టాన్ని కలుగుజేస్తుంది కాని ప్లాస్టిక్ వినియోగాన్ని ఆపలేము. ప్లాస్టిక్‌ను ఆపాలంటే ఆ ప్లాస్టిక్‌ను పెద్ద ఎత్తున రీ–సైక్లింగ్ చేసి ఆధునికమైన పద్ధతులను తీసుకువచ్చి ఉపయోగించినట్లయితే బయటపడ్డ ప్లాస్టిక్ కూడా ఎక్కడో ఒక చోటకు రీ–సెక్లింగ్‌కు వెళ్లిపోతుంది. ఆధునికమైన మెకానిజాన్ని అభివృద్ధి చేయకుండా ఏవో కొన్ని చర్యలను

తీసుకుంటున్నామంటే పూర్తిగా అమలు జరగదు. మరీ ముఖ్యంగా ఆరోగ్య రంగంలో ఆసుపత్రులలో వాడే ప్లాస్టిక్స్ అవి లేకుండా ఎలా జరుగుతుందో చెప్పండి. సిరెంజ్‌లు, బాటిల్స్ అన్నీ ప్లాస్టిక్‌తో తయారైనవే వచ్చాయి. మందుల సీసాలన్నీ ప్లాస్టిక్‌వే వచ్చాయి. ఆరోగ్య రంగంలో ప్లాస్టిక్ లేకుండా జరగదు. అది అసంభవం. అటు ప్లాస్టిక్‌ను తగ్గించాలంటే కచ్చితంగా పెద్ద ఎత్తున రీ-సైక్లింగ్‌ను ఆధునిక పద్ధతులలో తీసుకువస్తేనే సాధ్యమవుతుంది. ఆ వైపు నుండి ఒక్క సిటీలో ఎక్కడైనా ఒకచోట నుండి మీరు ప్రారంభించే ప్రయత్నం చేయండి.

మిస్టర్ ఛైర్మన్ః (మంత్రి గారిని ఉద్దేశించి) ఇది చాలా డిబేట్ అవుతోంది. వాస్తవంగా వేసవి కాలంలో మేము చదువుకునే రోజుల్లో ఇంటికి పోతే కుండల్లో నీళ్లు పెట్టే వారు. ఇప్పుడేమో ఇళ్లల్లో ప్లాస్టిక్ కవర్లలో పెడుతున్నారు. ఎందుకంటే.. ఫ్రిజ్‌లో పెడితే కొద్దిసేపట్లో చల్లగా అవుతుందని ప్లాస్టిక్ కవర్లలో పెడుతున్నారు. సిస్టమే మారిపోయింది. సిస్టం కరెక్ట్ కావాలి. లావు కవర్లు కావాలని రత్నాభాయి గారు చెప్పారు. మొన్న ఒక మిత్రుడు మంచి నీళ్లు ఇలా త్రాగి అలా పారవేశాడు. ఏమి అలా పారవేశావని అడిగితే.. use and throw అన్నారు కదా యూజ్ చేసి త్రో చేశాను అని అన్నాడు. సిస్టమే మారి పోయింది. దీని గురించి ఆలోచించండి. ఎవరినో ఒకరిని అనుకోవడానికి లేదు. నారాయణ గారూ.. మీరు ఈ మధ్యన foreign వెళ్లి వచ్చారు. నేను కూడా foreign వెళ్లి వచ్చాను. వాళ్లు ఏమంటారో తెలుసా? ఏమిటి ఈ డస్ట్. ఇంట్లో ఉన్న డస్ట్‌నంతటిని తీసుకొని వచ్చి బయట పోస్తారా? What is this? విదేశాలలో ప్రతి వ్యక్తి దీని గురించి ఆలోచన చేస్తారు. నేను చూశాను కదా. ఏదైనా తింటే ఒక కవర్‌లో పెట్టుకొని ఆ కవర్‌ను తీసుకెళ్లి ఒక బ్యాగ్‌లో పడేస్తారు. మనమేమో తినేసి రోడ్డు మీదనే పడేస్తాము. అవునా? కాదా? దీనిలో ఏ ఒక్కరిని తప్పు పట్టలేము. చాలా గంభీరమైన సమస్య ఇది. దీని పరిష్కారం కోసం సమాజంలో ఒక విప్లవాత్మకమైన మార్పు రావాలి.

శ్రీ సి. రామచంద్రయ్య ః అధ్యక్షా, రాజకీయనాయకులే కాదు, సన్యాసులు, జియ్యర్ స్వాములు మొదలైన వారివి కూడా పెద్ద, పెద్ద ఫ్లెక్సీలు పెడుతున్నారు.

మిస్టర్ ఛైర్మన్ ః వాళ్లను కూడా మనమే మార్చి వేశాము. కాబట్టి ఈ సమస్య మీద తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరముంది.

డా. పి. నారాయణ ః అధ్యక్షా, ప్లాస్టిక్ బ్యాగులను తయారు చేయడానికి లెడ్, క్యాండిమిల్, మెర్క్యురీ వాడతారు. వాస్తంగా, ఇవన్నీ విషపదార్థాలు. 40 మైక్రాన్ల మందం కన్నా తక్కువ ఉంచే అవి తేలికగా కరిగిపోయి అవి నీటిలోను, భూమిలోకి చేరడం వల్ల క్యాన్సర్ వంటి రోగాలు రావడం జరుగుతోంది. అందువల్ల 40 మైక్రాన్ల మందం కన్నా తక్కువ ఉన్న బ్యాగులను నిషేధించడం జరిగింది. less than 40 కాకుండా మిగతావి ఉండవచ్చు. అందువల్ల ఇప్పుడు బయటకనపడే ప్లాస్టిక్ బ్యాగులన్నీ 40 మైక్రాన్ల కన్నా ఎక్కువ మందం కలిగినవి. less than 40 microns బ్యాగులను ఎవరైతే తయారుచేస్తున్నారో వాళ్ల మీద రెయిడ్ చేసి పట్టుకోవడం జరుగుతోంది. ఇంకా చేయవలసింది చాలా ఉంది. ఇప్పటివరకు 13 మున్సిపాలిటీలలో దీనిని నిక్కచ్చిగా దీనిని అమలుపరటడం జరిగింది. Further గా కూడా ఇంప్లిమెంట్ చేస్తాము. శాశ్వత పరిష్కారం కోసం సభ్యులు అడిగిన దానికి.. రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్య కాలంలో ఇతర దేశాలలో వారు ఎలా చేస్తున్నారో దానిని అధ్యయనం చేశాము. వేస్ట్ నుండి పవర్ జనరేషన్ చేస్తున్నారు. ఈరోజు సింగపూర్‌లో నాలుగు యూనిట్లున్నాయి. 7500 టన్నులు వస్తుంది. అదే విధంగా టోక్యోను తీసుకుంటే.. అక్కడ దాదాపు 90 లక్షల జనాభా ఉంది. అక్కడ 23 వార్డులుంటే 21 వార్డులలో

యూనిట్లు పెట్టారు. Even 200 టన్నులకు కూడా పెట్టారు. అంతకుముందు అయితే ఈ వేస్ట్ నుండి తయారు చేసే పవర్ ప్లాంట్లను ఎక్కడో ఊరి చివర్లో పెట్టేవారు. లేటెస్ట్‌గా ఇప్పుడు నగరంలోనే ఇళ్ల మధ్య పెట్టారు. నేను వాటిని స్వయంగా పరిశీలించి వచ్చాను. వాటికి గ్లోబల్ టెండర్లను పిలుస్తున్నాము. 13 జిల్లాలలో 13 యూనిట్లను 6 నెలల లోపు టెండర్లను పిలిచి ఫైనలైజ్ చేసి ఒకటిన్న సంవత్సరాల లోపు ఈ యూనిట్లను ఏర్పాటుచేయడం జరుగుతుంది. ఈ టెక్నాలజీలో చెత్తమొత్తం బర్న్ అయిపోతుంది. ఆ బర్న్ అవడంలో కూడా దాని వల్ల further implications రాకుండా టెక్నాలజీ ఉంది. ఆ టెక్నాలజీని ఇంప్లిమెంట్ చేయబోతున్నాము.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి ః అధ్యక్షా, పర్యావరణానికి ముప్పు తెచ్చే ప్లెక్సీల నిషేధం గురించి చెప్పలేదు. ప్లెక్సీలపై నిషేధం గురించి చెప్పమని అందరం అడిగాము.

డా. పి. నారాయణ ః అధ్యక్షా, ప్లెక్సీల విషయం కోర్టులో ఉంది. కోర్టు తీర్పు రాగానే వాటిపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుంది.

## విశాఖలో నగర అభివృద్ధి ప్రణాళిక

ప్రశ్న నెం.7918(103)

సర్వశ్రీ ఎం.వి.యస్. శర్మ, డా. ఎం. గేయానంద్, ఎం.ఎల్.సి.లు

గౌరవనీయులైన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) విశాఖపట్టణం నగరం (అనకాపల్లి, భీమిలి కలుపుకొని) కొరకు నగర అభివృద్ధి ప్రణాళిక (సిడిపి) ను తయారు చేయడమయిందా?

ఆ) అయితే, సిడిపి అమలుచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి జివిఎంసికి అదనపు గ్రాంటు అందుతుందా?

గౌరవనీయులైన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి (డా. పి. నారాయణ) ః

అ) మహాశయా, కేంద్ర ప్రభుత్వంచే నియమించబడిన క్రిసిల్ రిస్క్ మరియు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సొల్యూషన్స్ లిమిటెడ్ అనకాపల్లి, భీమిలితో కలుపుకొని జివిఎంసి కోసం నగర అభివృద్ధి ప్రణాళిక (సిడిపి) ను రూపొందించి 2015, ఫిబ్రవరిలో జివిఎంసికి సమర్పించింది.

ఆ రిపోర్టును జివిఎంసి అధికారులు పరిశీలిస్తున్నారు. ఎందుకంటే దానిని thorough గా పరిశీలించమని క్రిసిల్ వారు నివేదికలో పేర్కొనడం జరిగింది. అయితే వాళ్లు ఇచ్చిన రిపోర్టులో 2041 సంవత్సరం వరకు ఎలా జివిఎంసి అభివృద్ధి చేయాలనే దాని మీద ఒక ప్లాన్ ఇచ్చారు. అయితే, వాళ్లు ఇచ్చిన దానిలో ఖర్చు అయ్యే మొత్తం దాదాపు రూ.27166కోట్లుగా పేర్కొన్నారు. దానిలో కూడా మొదట దశ షార్ట్ టర్మ్ అని 2021వ సంవత్సరం వరకు అంటే రాబోయే 6వ సంవత్సరాలలో రూ.13888 కోట్లు ఖర్చు పెట్టాలని, 2041 వ సంవత్సరం వరకు అంటే ఆ తరువాత 20 సంవత్సరాలలో రూ.13279 కోట్లు ఖర్చు పెట్టాలని నివేదిక ఇచ్చారు. అయితే, ఏ ఏ డిపార్ట్‌మెంట్లు, ఏ ఏ ప్రభుత్వ శాఖలు ఎంతెంత ఖర్చు పెట్టాలో కూడా చెప్పారు. దాని ప్రకారం.. జివిఎంసీ 35 శాతం, ఉడా 1 శాతం, ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ 0.4 శాతం, ట్రాన్స్‌పోర్టు అండ్ అలైడ్

39 శాతం , టూరిజం 4 శాతం, ఎనర్జీ డిపార్ట్‌మెంట్ 0.1 శాతం , ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ 0.8 శాతం, హెల్త్ డిపార్ట్‌మెంట్ 1 శాతం, అటవీ శాఖ 0.5 శాతం, మెట్రో రైలు అండ్ రిలేటెడ్ 18 శాతం ఖర్చు పెట్టాలని తెలిపారు. అయితే, జివిఎంసీ వారు ఈ డిపార్ట్‌మెంట్స్‌తో చర్చలు జరుపుతున్నారు. వాళ్లందరితో చర్చలు జరిపి ఒక అవగాహన వచ్చిన తరువాత రెండు నెలల్లో ఈ రిపోర్టును కేంద్ర ప్రభుత్వానికి పంపించి దీని మీద తగు నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది.

ఆ) జివిఎంసి సిడిపిని పరిశీలించి తదుపరి చర్య తీసుకోవడానికి ముందు క్రిసిల్‌కు తుది ఆమోదం లేఖ ఇవ్వవలసి ఉంది. తుది ఆమోదం తరువాత మాత్రమే వివరాలు తెలుస్తాయి.

డా.ఎం. గేయానంద్ ః అధ్యక్షా, క్రిసిల్ వాళ్లు పెద్ద రిపోర్టు ఇచ్చారు. వారికి అభినందనలు తెలుపుతున్నాను. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఇతర నగరాల అభివృద్ధికి సంబంధించి ఉదాహరణకు అనంతపురంను తీసుకుంటే అక్కడ చిన్న, చిన్న సౌకర్యాలు కూడా లేని పరిస్థితి ఉంది. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని గత రెండు, మూడు సంవత్సరాలుగా చెబుతున్నారు. ఈ ప్రభుత్వం కూడా చెబుతోంది. దాని గురించి ఒక మాట చెప్పవలసిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

డా. పి. నారాయణ ః అధ్యక్షా, సభ్యులు అడిగిన దానికి .. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ చాలా తక్కువ నగరాలలో ఉంది. దాని మీద డిపిఆర్‌ను తయారుచేయించాము. వాటన్నింటిని కేంద్ర ప్రభుత్వానికి పంపడం కూడా జరిగింది. కేంద్ర ప్రభుత్వం వాస్తవంగా ఇప్పుడు వాటికి సిస్టం మారుస్తుంది. దానికి ఇంకా ఫైనలైజ్ చేయలేదు. ఈ నెలఖారు లోపు వాళ్లు ఫైనలైజ్ చేసిన తరువాత దాని మీద పరుస్యూ చేస్తాం. మూడు రోజుల క్రితమే కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు గారు నెల్లూరు వచ్చినప్పుడు ఈ విషయమై నేను డిస్కస్ చేశాను. 31, మార్చి అయిపోయిన తరువాత మీరు రండి, దాని గురించి పరిశీలిస్తామని చెప్పారు. కచ్చితంగా పరిశీలించి వీలైనంత తొందరలో చేయడానికి ప్రయత్నం చేస్తాము.

శ్రీ బొడ్డు నాగేశ్వరరావు ః (పట్టభద్రుల నియోజక వర్గం – కృష్ణా, గుంటూరు) అధ్యక్షా, ఈరోజు అభివృద్ధిలో మున్సిపాలిటీలన్నింటికి కూడా మొత్తం ఉద్యోగ, ఉపాధ్యాయులందరికి 010 పద్దు ద్వారా జీతాలిస్తున్నారు. అలాగే, విజయవాడ, విశాఖపట్టణాలకు సంబంధించి ముఖ్యంగా విజయవాడ నగరంలో పనిచేస్తున్న ఉద్యోగులకు వారి జీతాలను 010 ద్వారా ఇస్తే కచ్చితంగా కార్పోరేషన్‌కు వచ్చే ఆదాయానికి నగర అభివృద్ధికి ఖర్చు పెట్టే అవకాశం ఉంది. ఆ విషయం ప్రభుత్వం పరిశీలనలో ఉందా అని మీ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను. దీని మీద సమాధానం చెప్పవలసిందిగా కోరుతున్నాను.

డా. పి. నారాయణ ః అధ్యక్షా, ప్రస్తుతం ఆ విషయం పరిశీలనలో లేదు.

శ్రీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి ః ఏమిటి సార్, అంత కఠినంగా సమాధానం చెప్పారు. విజయవాడ, విశాఖపట్టణం మున్సిపల్ కార్పోరేషన్లకు సంబంధించి బడ్జెట్ సమస్య అది.

డా. ఎం. గేయానంద్ ః సర్, నిన్న ఇదే విషయం చెప్పి ఉంటే..

డా. పి. నారాయణ ః అధ్యక్షా, జి.వి.ఎం.సీ కూడా ప్రభుత్వమే. దాని నుండి ఇస్తున్నారు.

శ్రీ కె.యస్. లక్ష్మణరావు : అధ్యక్షా, గత నాలుగు రోజుల నుండి మీరు విజయవాడలో ఉన్నప్పుడు ఈ మాట చెప్పవలసింది.

శ్రీ బొడ్డు నాగేశ్వరరావు : అధ్యక్షా, గత సమావేశాలలో కూడా ఇదే విషయమై అడిగినప్పుడు పరిశీలిస్తామని చెప్పారు.

డా. పి. నారాయణ : అధ్యక్షా, వాస్తవంగా మున్సిపల్ స్కూల్స్ విషయమై మాత్రమే సభ్యులు అడిగారు. నేను ఓవరాల్‌గా మున్సిపాల్టీల గురించి చెప్పాను. ఎందుకంటే.. ఆ మున్సిపాలిటీలను '010' క్రింద చేయమన్నారు. అయితే దానిలో కొన్ని రూల్స్ ఉన్నాయి. ఆ రూల్స్ ప్రకారం 10 లక్షల జనాభా కన్నా ఎక్కువగా ఉన్నట్లు చూపించి కేంద్ర ప్రభుత్వం నుండి జీవీఎంసీ వాళ్లు చాలా ప్రాజెక్టులు తెచ్చుకున్నారు. దానిలో ఉన్న రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ వల్ల దానిని ఉంచడం జరిగింది. దాని గురించి ముఖ్యమంత్రి గారికి నివేదించాం. ముఖ్యమంత్రి గారు వారి జీతాలకు సంబంధించి '010' కాకుండా కంటిన్యూ చేయమన్నారు. ముఖ్యమంత్రి గారు కొంత గ్రాంట్ ఇద్దామన్నారు. సభ్యులు ఉపాధ్యాయుల విషయం అడుగుతున్నారు.

శ్రీ బొడ్డు నాగేశ్వరరావు : అధ్యక్షా, ఉపాధ్యాయులకు సంబంధించి గత ప్రభుత్వంలోనే సాధించుకున్నాము. కిరణ్ కుమార్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఉపాధ్యాయులకు '010' పద్దు క్రింద జీతాలు ఇచ్చేటట్లు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. మేము మున్సిపల్ ఉద్యోగుల గురించి అడుగుతున్నాము.

డా. పి. నారాయణ : అధ్యక్షా, మున్సిపల్ ఉద్యోగుల జీతాలకు సంబంధించి కొంత గ్రాంట్ ఇచ్చాము. Further ఇంకొక రూ.100 కోట్లు ఇవ్వమని అడగడం జరిగింది. అది పరిశీలనలో ఉంది.

ఉ. **10.40**

## రాష్ట్రంలో విదేశీ పెట్టుబడి

ప్రశ్న నెం. 8033 (104)

శ్రీ బి. చంగల్ రాయుడు, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా?

అ) రాష్ట్రం కోసం పెట్టుబడులను ఆకర్షించడానికి మంత్రివర్యుల బృందం విదేశాలు పర్యటించిన విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, మన రాష్ట్రంలో పెట్టుబడి పెట్టడానికి ఏ దేశాలు ముందుకు వచ్చాయి?

ఇ) ఆ వివరాలేమిటి?

గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారి తరఫున పురపాలక, పట్టణ శాఖామాత్యులు (శ్రీ పి. నారాయణ):

అ) అవునండీ.

ఆ) మన రాష్ట్రంలో పెట్టుబడి పెట్టడానికి సింగపూర్, జపాన్, తైవాన్, దక్షిణ కొరియా, మలేషియా, చైనా ప్రభుత్వాలు / కంపెనీలు ఆసక్తిని కనబర్చాయి.

ఇ) వివరాలను అనుబంధంగా సభా సమక్షంలో ఉంచడమయింది.

శ్రీ పి. నారాయణ ః అధ్యక్షా, విదేశీ పర్యటనలలో భాగంగా సింగపూర్, జపాన్, లావోస్ దేశాలకు వెళ్లడం జరిగింది. సింగపూర్ ప్రభుత్వంతో రాజధాని ప్లాన్ కు సంబంధించి డిజైన్ ప్లాన్ ఇచ్చే విధంగా ఒక ఎమ్ఓయు కుదుర్చుకున్నాము. జపాన్ దేశాన్ని కూడా సందర్శించాము. అక్కడ కూడా చాలామంది పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబర్చారు. ఏదైనా ఒక పరిశ్రమ పెట్టాలంటే ఎవరైనా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తారు. వాళ్లందరితో చర్చలు జరిగాయి. వాళ్లల్లో చాలామంది సాధ్యాసాధ్యాలమీద వర్క్ చేసుకుని నెల, రెండు నెలలు, ఆరునెలల్లో మళ్లీ కాంటాక్ట్ చేస్తామని అన్నారు. దాని మీద వాళ్లు అధ్యయనం చేస్తున్నారు. వేల కోట్ల రూపాయలను పెట్టుబడిగా పెట్టే ఎవరైనా ఖచ్చితంగా మనకు లాభాలు వస్తాయా లేదా, మౌలిక వసతులు ఉన్నాయా లేదా, ప్రభుత్వం ఏం ఇస్తుంది అనేవాటిని వాళ్లు చూసుకుని నిర్ణయించుకుంటారు. టూర్‌కి వెళ్లి రాగానే పక్కరోజునే ఎమ్ఓయులు కుదుర్చుకుని పని మొదలుపెట్టడం వంటివి జరగవు. ఇప్పటివరకూ మాత్రం సింగపూర్ ప్రభుత్వంతో ఎమ్ఓయు కుదుర్చుకోవడం జరిగింది. జపాన్ వారి సుమిటోమో కార్పొరేషన్ వారు శ్రీకాకుళంలో 4 x 1000 మె.వా. పవర్ స్టేషన్ కొరకు ఒక ఎమ్ఓయు కుదుర్చుకున్నారు. అదే విధంగా సుమిటోమో కార్పొరేషన్ వారు అగ్రో మిషనరీ సెంటర్‌ను ప్రాసెస్‌ని హై టెక్నాలజీతో చేయడానికి ఎమ్ఓయు కుదుర్చుకున్నారు. అదేవిధంగా వారు ఫుడ్ ప్రాసెస్ ఇండస్ట్రీ కోసం, క్యాపిటల్ డెవలప్‌మెంట్ కోసం సహకరిస్తామని ఎమ్ఓయు కుదుర్చుకున్నారు. నీడో వాళ్లు రెన్యువబుల్ ఎనర్జీకి సంబంధించి ఎమ్ఒయు కుదుర్చుకున్నారు. జపాన్‌లోని ఫ్యూజి ఎలక్ట్రానిక్స్ వారు ఏ.పి. ప్రభుత్వంతో విజయవాడలో స్మార్ట్ గ్రిడ్ ప్రాజెక్ట్ కోసం ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకోవడం జరిగింది. మిగతావన్నీ ప్రాసెస్‌లో ఉన్నాయి.

శ్రీ కంతేటి సత్యనారాయణ రాజు ః (నామినేటెడ్) అధ్యక్షా, ఎమ్ఓయులను సభ ముందు ఉంచడానికి ఏమైనా అభ్యంతరమా మరియు వాటికి ఎంత ఖర్చు పెడుతున్నారో తెలియచేయవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ బి. చెంగల్ రాయుడు ః అధ్యక్షా, చిన్నప్పుడు నేను ఒక సినిమాకు వెడితే అందులో ఒక పాట విన్నాను. “గుడివాడ వెళ్లాను, గుంటూరు వెళ్లాను, నెల్లూరు వెళ్లాను, అక్కడక్కడ ఎక్కడికెళ్లినా ఖర్చులు తప్ప ఏమీ మిగలలేదు “ అనేది ఆ పాట సారాంశం. సింగపూర్ ప్రభుత్వం కొత్త రాజధాని నగరం కోసం బృహత్ ప్రణాళికను రూపొందిస్తున్నది అని సమాధానంలో అన్నారు. Is it the investment? అసలు అక్కడకు వెళ్లిన పనేమిటి? పెట్టుడులను ఆకర్షించడానికి వెళ్లారు. ప్రత్యేక విమానం తీసుకుని, ప్రభుత్వ ఖర్చులతో వెళ్లి ఒక్క రూపాయి పెట్టుబడి తీసుకువచ్చామని ఎక్కడా చెప్పలేదే? ఆ దేశాలవారిని కావాలంటే ఇక్కడికే పిలవండి. అవసరమైతే విజయవాడలో మీటింగ్ పెట్టండి. లేదా మాకు శిక్షణ ఇచ్చిన విధంగా గ్రాండ్ కాకతీయలో పెట్టండి. మమ్మల్ని కూడా పిలవండి. ఇన్ని దేశాలు తిరిగినా ఒక్క రూపాయి కూడా సాధించింది లేదు. ఆఖరికి “హైదరాబాదులో ఉన్న మలేషియా, కొరియా ప్రతినిధి వర్గం ఇంధన, మౌలిక సదుపాయాలు, పర్యాటక ప్రాజెక్టులతో ఆసక్తిని చూపాయి“ అని అనుబంధంలో మంత్రిగారు పేర్కొన్నారు. హైదరాబాదులో ఉండేవాటిని ముందే పిలుచుకుని మాట్లాడుకున్నారు. పది నెలలు అయిపోయింది. ఆరు దేశాలు తిరిగివచ్చారు. ప్రభుత్వ సొమ్మును మిగల్చాలని ప్రయత్నం చేయకుండా ఖర్చుపెట్టే ప్రయత్నంలో మీరున్నారు. ఒక పక్క దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నామని అంటున్నారు, ఇంకోపక్క తిరుగుళ్లు ఎక్కువైపోయాయి. దీనిని తగ్గించేపని చేయండి. ఏఏ దేశాలవాళ్లు మాటిచ్చారో వాళ్లందరినీ హైదరాబాదు పిలిచి వాళ్ల దగ్గర కమిట్‌మెంట్ తీసుకోండి.

గత ప్రభుత్వాలు కూడా కమిట్‌మెంట్స్ తీసుకుని వాళ్ల పనులు వాళ్లు సాధించుకుని మనకు నామం పెట్టి వెళ్లిపోయాయి. ఆ విధంగా జరగకుండా చూడాలని నేను తమ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ సి. రామచంద్రయ్య : సార్, 2009వ సంవత్సరంలో గుజరాత్‌లో శ్రీ నరేంద్ర మోడి గారు పెట్టుబడులు తీసుకురావాలని పెద్ద హంగామా చేసి ఒక పెద్ద మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. అప్పుడు దాదాపు 24లక్షల 80 వేల కోట్ల రూపాయలకు ఎమ్ఓయులు కుదుర్చుకోవడం జరిగింది. కానీ, ఇప్పటివరకూ రూ.68వేల కోట్లు మాత్రమే వచ్చింది. అంటే ఎమ్ఓయులు శాంక్టిటీ కాదు. ఈ ప్రభుత్వం సింగపూర్ కంపెనీకి ఏదో ఇస్తున్నది. దాని మీద ప్రజానీకానికి క్లారిటీ ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం ఏమైనా ఇంటర్నేషనల్ బిడ్డింగ్ ఏమైనా చేశారా? లేదా one to one negotiate చేశారా? అంతర్జాతీయ స్థాయిలో ఎయిర్‌పోర్టులు, టౌన్ డెవలప్‌మెంట్స్ వంటివి ఇండియన్ కంపెనీలే చేస్తున్నాయి. ఇండియన్ ఇన్‌ఫ్రా కంపెనీలు ప్రపంచ వ్యాప్తంగా మంచి పేరున్నవి ఉన్నాయి. జిఎమ్ఆర్ వాళ్లు టర్కీ , మారిషస్ ఎయిర్‌పోర్టులు కడుతున్నారు. ఆ విధంగా మన ఇండియన్ కంపెనీలు ఉన్నప్పుడు ఎందుకు handpicked గా ఒక కంపెనీకి వెళ్లడంలో అర్థమేమిటి? ప్రభుత్వం పారదర్శకంగా ఉంటే ఎవరూ వేలు పెట్టరు. ఆ విధంగా లేకుండా ప్రభుత్వానికి ఇష్టం వచ్చినవాళ్లను సెలక్ట్ చేసుకుని వాళ్లతో నెగోషియేట్ చేసుకునే హక్కు ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారు? ప్రజానీకం ఈ హక్కు ఇచ్చిందా? ప్రతి ఒక్క నిర్ణయాన్ని ప్రభుత్వం unilateral గా చేస్తున్నది. క్యాపిటల్‌ను డిసైడ్ చేశారు. కేంద్రప్రభుత్వం కమిటీ వేసి ఆరు నెలల్లో రిపోర్టు వచ్చిన తరువాత డిసైడ్ చేస్తామంటే వాళ్లు ఎక్కడ లాక్కుంటారోనని ముందే అనౌన్స్ చేసేశారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రం అమలు చేస్తామని చట్టంలో చెప్పింది. వాళ్లకు ఏం చెప్పారో గానీ, మేమే ఇంప్లిమెంట్ చేసుకుంటామని అన్నారు. మన సమస్యలే మనకు చాలా ఉన్నాయి. పునర్నిర్మాణం చేయాలంటే ఎన్ని సమస్యలున్నాయి? కేంద్రం చేసే బాధ్యతలను మీరెందుకు భుజాన వేసుకుంటారు. మీరు వదిలేయండి. ఇంటర్నేషనల్ బిడ్డింగ్ చేశారా లేదా వన్ టు వన్ చేశారా, ఎందుకు చేశారు, ఈ హక్కు ప్రభుత్వానికి ఎవరిచ్చారు అని నేను మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీ పి. నారాయణ : అధ్యక్షా, ఇప్పుడు మనం కుదుర్చుకున్న ఎమ్ఓయు కేవలం డిజైన్ మాత్రమే. అది Government to Government. ప్రైవేటు కాదు. కన్‌స్ట్రక్షన్‌కు మిగతా దానికి మాత్రం సభ్యులు చెప్పినట్లే బిడ్డర్స్‌ని పిలిచి సిస్టమాటిక్‌గా, ట్రాన్స్‌పరెంట్‌గా నూటికి నూరు శాతం చేస్తాము. డిజైన్ ఇచ్చిన తరువాత దాని ఎక్స్‌పెండిచర్ ఎస్టిమేషన్లు తెలుస్తాయి.

## ఎస్.సి, ఎస్.టి. బి. సి. హాస్టళ్లు

ప్రశ్న నెం. 8068 (105)

శ్రీమతి పి. శమంతకమణి, డా. ఎం. గేయానంద్, ఎంఎల్‌సిలు

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమ మరియు సాధికారత మరియు గిరిజన సంక్షేమం మరియు సాధికారత శాఖా మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా?

అ) రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి మరియు బిసి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న కొన్ని సంక్షేమ హాస్టళ్లను మూసివేయాలని ప్రభుత్వం ఉద్దేశిస్తున్నదా?

ఆ) అయితే, ఆ వివరాలేమిటి?

ఇ) ఆ విద్యార్థుల ప్రయోజనాలను కాపాడడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమ మరియు సాధికారత మరియు గిరిజన సంక్షేమం మరియు సాధికారత శాఖా మంత్రి గారు (శ్రీ రావెల కిషోర్ బాబు):

అ) లేదండీ, అయితే, దశలవారీగా అన్ని హాస్టళ్లను నైవాసిక పాఠశాలలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీమతి పమిడి శమంతకమణి : మంత్రిగారు మొదటి ప్రశ్నకు హాస్టల్స్‌నన్నింటినీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మారుస్తామని అన్నారు. అధ్యక్షా, నేను హాస్టల్స్‌ని మూస్తున్నారా అని అడిగాను, ఎందుకంటే ఎస్సీ, ఎస్టీలు తల్లిదండ్రులు ఆర్థికంగా వెనకబడి ఉండి తమ బిడ్డలను చదివించలేక ఆ పిల్లలను తీసుకువచ్చి హాస్టల్స్‌లో పెట్టడం జరుగుతున్నది. దినసరి కూలీకి వెళ్లి తమ కుటుంబాలను పోషించుకునే తల్లిదండ్రులు తమ పిల్లల్ని హాస్టళ్లలో పెడుతున్నారు. అటువంటి పరిస్థితుల్లో హాస్టల్స్‌ని మూయిస్తే వాళ్ల పరిస్థితి ఎలా ఉంటుంది? హాస్టళ్లను రెసిడెన్షియల్‌గా మారుస్తామన్నారు. వాటిని రెసిడెన్షియల్‌గా మార్చే వరకైనా హాస్టళ్లగా ఉంచితే బాగుంటుందని నేను కోరుతున్నాను. ఈ మధ్యనే గార్లెదిన్నె మండలం కల్లూరు గ్రామంలోని పంచాయతీలో 6000మంది జనాభా ఉన్నారు. అక్కడ మండల స్థాయిలో ఒక మోడల్ స్కూల్ కట్టగానే అక్కడున్న పిల్లలందరినీ మార్చివేశారు. దానివల్ల పిల్లలకేమీ నష్టం జరగలేదు కానీ, అక్కడున్న భవనం చాలా పెద్దది. ఆ భవనం అన్యాక్రాంతం కాకుండా అక్కడున్న ఎస్సీలకే కమ్యూనిటీ హాలుగా మార్చడానికి వీలుంటుందా అని మంత్రిగారిని నేను అడుగుతున్నాను. మొన్ననే డిఈఓ గారు మూడు, నాలుగు smart hostels, smart schools పెట్టడానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది.

ఉ.**10.50**

అక్కడ నుంచి వచ్చి కూడా దాదాపు రెండు, మూడు నెలలవుతోంది. ఎస్.సి., ఎస్.టి. విద్యార్థులను రెసిడెన్షియల్ పాఠశాలల్లో పెట్టి వారికి కార్పోరేట్ స్థాయిలో ఉన్నత విద్యనందిస్తే మేము చాలా సంతోషిస్తాము. కానీ, అంతవరకూ ఈ హాస్టళ్లను మూయించి పిల్లలను ఇళ్లకు పంపవద్దని నేను తమరిద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

డా. ఎం. గేయానంద్: అధ్యక్షా, మంత్రిగారు వారి సమాధానంలో లేదని చెప్పారు. అయితే రాష్ట్రంలో సుమారు 200 హాస్టళ్లను నేడు మూసివేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రజాసంఘాలు చెబుతున్నాయి. ఎస్.ఎఫ్.ఐ. సంస్థకు చెందినవారు నాతో ప్రత్యేకంగా ఈ విషయాన్ని ప్రస్తావించారు. అయితే, వాటిని మూసివేయడానికి కారణం, చాలినంత మంది విద్యార్థులు లేరనే పేరుతో ప్రక్కనున్న హాస్టళ్లతో ఆ హాస్టళ్లను మెర్జ్ చేస్తున్నారని చెబుతున్నారు. ఎందుకు వాటిలో పిల్లలు ఉండరు? ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న పిల్లలంతా సుమారు 80 శాతం మంది ఎస్.సి.,ఎస్.టి., బి.సి.లకు చెందిన పిల్లలే ఉన్నారు. ఎందుకు పిల్లలు రారంటే, నేడు ప్రభుత్వం రూ.17 లు చొప్పున ఇచ్చి గుడ్డుతో భోజనమంతా పెట్టాలంటే ఎలా అవుతుంది? ఆ హాస్టళ్లలో వార్డెన్‌లు సరిగా ఉండరు, సెక్యూరిటీ ఉండదు, వారిని పట్టించుకునేవారు లేరు. కాబట్టి

ఆ హాస్టళ్లకు పిల్లలు రావడం లేదు.  కాబట్టి హాస్టళ్లను సక్రమంగా నడపాలంటే వాటిని ఏ విధంగా బలోపేతం చేయాలనేది తప్పకుండా ప్రభుత్వం చూడాలి. మంత్రిగారు ఇచ్చిన సమాధానంలో “దశలవారీగా అన్ని హాస్టళ్లను నైవాసిక పాఠశాలలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించినట్లుగా” చెప్పారు. అంటే, ఏ హాస్టల్‌ను మూయకుండా అన్ని హాస్టళ్లను కూడా పాఠశాలలుగా మారుస్తామనే హామీ వారిస్తారా అని నేను తమరిద్వారా వారిని అడుగుతున్నాను.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం :  అధ్యక్షా, ఈ అంశం గురించి క్షేత్రస్థాయిలో చాలా గందరగోళం మరియు ఆందోళనకరంగా కూడా ఉంది. వారు అలా చెబుతున్నారేగానీ, మేము జిల్లాల్లో సాంఘిక సంక్షేమశాఖాధికారులతో మాట్లాడడం జరిగింది.

మిస్టర్ ఛైర్మన్: మీరు ఎస్.సి., ఎస్.టి. కమిటీలో కూడా ఉన్నారు కదా?

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : అధ్యక్షా, ఎస్.టి. జాయింట్ కమిటీలో ఉన్నాను.

మిస్టర్ ఛైర్మన్ : అక్కడ కూడా పర్స్యూ చేయండి.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం :  సరే అధ్యక్షా.  చాలా స్పష్టంగా కొన్ని హాస్టళ్లను ఐడెంటిఫై చేసి వాటిని మూసివేయాలని వారు అనుకున్నారు.  వాటిని మూసివేయడానికి కొంచెం కష్టమనిపించి జాగ్రత్తపడ్డారు. ఆ హాస్టళ్లు చాలా దయనీయస్థితిలో ఉన్నందువల్ల పిల్లలు ఆ హాస్టళ్లలో చేరడంలేదు. పిల్లలు లేనిచోట హాస్టళ్లు ఎందుకని ప్రశ్నిస్తే అది వాస్తవమని అనిపించే విధంగా ఉంటుంది. అందువల్ల హాస్టళ్లను ఆధునీకరించకుండా పిల్లలు ఆ హాస్టళ్లలో లేరని అంటే కుదరదు. ఎస్.సి.,ఎస్.టి. పిల్లులు మరియు హాస్టల్ పిల్లలపై నేను ఒక స్టడీ చేశాను.  వారు అత్యంత నిరుపేదలు.

శ్రీ రావెల కిషోర్‌బాబు : నేను కూడా ఒకప్పుడు హాస్టల్ విద్యార్థినే.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం :  నేను కూడా హాస్టల్‌లో చదువుకున్న వాడినే. మనమంతా ఆనాడు హాస్టల్‌లోనే చదువుకున్నాము. ఇప్పుడు హాస్టళ్లలో చదువుకునే పిల్లలు ఎవరంటే, ఒంటరి మహిళల పిల్లలు, కొన్ని ప్రాంతాల్లో అయితే బిక్షగాళ్లతో సమానమైన వారి పిల్లలు, సంచార జాతులకు చెందిన వారి పిల్లలు, అత్యంత నిరుపేదల పిల్లలు మాత్రమే హాస్టళ్లలో ఉండి నేడు చదువుకుంటున్నారు. నేను కూడా ఆ పాఠశాలలోనే చదువుకున్నాను. మా కుటుంబం ఏమీ అంత దయనీయస్థితిలో ఆనాడు లేదు.  పేదరికంలో మగ్గిపోతున్నవారు మాత్రమే నేడు హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్నారు. దానికి అనేక సామాజిక కారణాలున్నాయి.

మిస్టర్ ఛైర్మన్ :  ప్రభుత్వ పాఠశాలల్లో కూడా.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం :  అధ్యక్షా, పాఠశాలల్లో కూడా ఎస్.సి., ఎస్.టి.లు, బి.సి.లు మాత్రమే ఉంటున్నారు. ఓ.సి.లు చాలా తక్కువమంది ఉన్నారు.  అందువల్ల ప్రభుత్వం దయవుంచి వారికి తగినవిధంగా హాస్టళ్లను ఆధునీకరించడానికి ఏమిచేయాలో మాట్లాడమనండి.  మా బాధ ఏమిటంటే, మేము విద్యారంగానికి సంబంధించి, విద్యార్థులకు సంబంధించిన ఏ విషయమైనా వార్తాపత్రికల ద్వారా మాత్రమే తెలుసుకుంటున్నాము.  ఉదాహరణకు, వారు వీటన్నింటినీ రెసిడెన్షియల్ పాఠశాలల క్రింద మారుస్తామని చెప్పారు. ఎలా మారుస్తారో నాకు అర్థం కావడంలేదు.  50 మంది, 30 మంది లేదా 20 మంది  పిల్లలుండే వాటన్నింటినీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చితే రాష్ట్రంలో ఎన్ని రెసిడెన్షియల్ పాఠశాలలవుతాయి? అప్పుడు రాష్ట్రంలో

రెగ్యులర్ పాఠశాలలుంటాయా? మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోని పిల్లలందరికీ రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారానే విద్యనందిస్తారా? ఇక ఏ విద్యార్థినీ ఇంటికి పోనివ్వరా? నాకేమీ అర్థంకావడం లేదు.

అధ్యక్షా, మరో విషయం, కార్పోరేట్ పాఠశాలలతో సమానంగా విద్యనందిస్తామని వారు చెబుతున్నారు. ఇటువంటి మాటలు అనవద్దని నేను వారికి తమరిద్వారా మనవిచేస్తున్నాను. ప్రభుత్వ పాఠశాలల్లో గొప్పగా ఉండే వాటి గురించి చెప్పాలి. ప్రభుత్వానికి చెందిన ఫలానా గురుకుల పాఠశాల మాదిరిగా పాఠశాలలు నడుపుతామని చెప్పమనండి. ఆ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఐ.ఐ.టి. సీటు సాధించిన వారు, ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన పిల్లలు కూడా ఉన్నారు. వాటితో పోల్చుకోకుండా మాటిమాటికీ ఎవరితోనో పోలుస్తారేమిటి? నవోదయ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలతో సమానంగా అని చెప్పమనండి. భారతదేశంలోనే సి.బి.ఎస్.ఈ. సిలబస్‌లో నెం.1 ర్యాంకులో కేంద్రీయ విద్యాలయాలున్నాయి. నెం. 2 ర్యాంకులో నవోదయ పాఠశాలలున్నాయి. ఇప్పుడున్న కార్పోరేట్ పాఠశాలలేవీ కూడా ఆ ర్యాంకులతో పోలిస్తే ఏమీ లేవు. అందువల్ల మంత్రులు, ప్రతి ఒక్కరూ కూడా కార్పోరేట్‌మయం చేస్తామని అనడం కంటే ఇవన్నీ కార్పోరేట్ వారికి అప్పజెప్పేయమనండి. ఎందుకు ఈ గొడవంతా? కార్పోరేట్ పద్ధతులు, కార్పోరేట్ పాఠశాలలు, కార్పోరేట్ ఆసుపత్రులు అనడం, ఈ కార్పోరేట్ ఆసుపత్రుల్లో అసలు ఏముంది? కొంచెమైనా హృదయముందా? కాబట్టి తెలంగాణ ప్రభుత్వం ప్రయివేటు పాఠశాలల్లో ఏముందనే విషయంపై ఎస్.సి.ఈ.ఆర్.టి. ద్వారా ఒక స్టడీ చేయించింది? మనవాళ్లకు అంత ధైర్యం లేదు. ప్రయివేటు పాఠశాలల్లో ఏముందో ఆ నివేదికను తెప్పించుకుని చూడమని నేను తమరిద్వారా వారిని కోరుతున్నాను. పెద్ద పెద్ద విషయాలు చెప్పకుండా ఇప్పుడున్న హాస్టళ్లను కొంచెం అందంగా, ఆ పేద విద్యార్థినీ, విద్యార్థులకు సరిపోయేవిధంగా మార్చే చిన్నచిన్న మాటలు చెప్పాలని తమరిద్వారా నేను మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ రావెల కిషోర్‌బాబు : అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రి అయిన తర్వాత నేటి విద్యావ్యవస్థను సమూలంగా సమీక్షించి నేటి విద్యావ్యవస్థ ఏ పరిస్థితిలో ఉన్నది, నేటి విద్యావ్యవస్థలో ఎటువంటి సంస్కరణలు తీసుకురావాలి, ఎలాంటి మార్పులు తీసుకురావాలనే వాటిలో భాగంగా అటు విద్యాసంస్థలుగానీ, ఇటు విద్యాసంస్థలకు సంబంధించిన హాస్టళ్లలోగానీ సమూలమైన సంస్కరణలు తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉందని గౌరవముఖ్యమంత్రిగారు సమీక్షల ద్వారా ఒక నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఎందుకంటే, గత 10 సంవత్సరాలలో అన్ని వ్యవస్థలు సర్వనాశనం అయిపోయిన విషయాన్ని చెప్పకతప్పదు. ఎందుకు చెప్పవలసి వస్తుందంటే, చెబితే కొంతమంది బాధపడతారు. మళ్లీ అదొక సమస్య అయిపోతుంది. అన్ని వ్యవస్థలను కుప్పకూల్చినటువంటి పెద్దమనుషులు ఈ వ్యవస్థను కూడా కుప్పకూల్చారు. అదీ సమస్య. ఇటు విద్యావ్యవస్థను కూడా కుప్పకూల్చారు. హాస్టల్ వ్యవస్థను కూడా సర్వనాశనం చేశారు.

అధ్యక్షా, నేను కడప జిల్లాలో అనేక హాస్టళ్లను తనిఖీ చేసినపుడు చాలా దారుణమైన పరిస్థితులను చూశాను. ప్రొద్దుటూరు ఊరు బయట ఉన్న ఒక హాస్టల్‌ను సడన్‌గా నేను సందర్శించగానే, మధ్యాహ్నం పూట ఆ హాస్టల్‌లో 6 గురు పిల్లలు మెట్లకింద కూర్చుని క్యారమ్స్ బోర్డు ఆట ఆడుకుంటున్నారు. ఆ హస్టల్‌లో ఉండవలసిన విద్యార్థులు 100 మంది కాగా, కేవలం 6 గురు విద్యార్థులు మాత్రమే అప్పుడు హాస్టల్‌లో ఉన్నారు. ఆ విషయాన్ని అడగడానికి ప్రయత్నిస్తే అక్కడ ఆ హాస్టల్ వార్డెన్ అందుబాటులో లేదు. ఒక అమ్మాయి కొత్తగా హెచ్.డబ్ల్యు.ఓ. గా అక్కడ నియమింపబడింది. ఎవరో ఒక వాచ్‌మన్ మాత్రమే అక్కడున్నాడు. ఈలోగా ఆ హెచ్.డబ్ల్యు.ఓ. కి

తెలిసి పరిగెత్తుకుంటూ అక్కడకు రాగా, ఏమిటమ్మా పిల్లలు హాస్టల్‌లో లేరని నేను అడిగితే, ప్రక్కనున్న గ్రామాల నుంచి పిల్లలు వచ్చి, భోజనం చేసి అక్కడ ఉండకుండా మళ్లీ వెళ్లిపోతారని ఆ హెచ్.డబ్ల్యు.ఓ. నాకు సమాధానం చెప్పింది. కనీసం 6 గురు పిల్లల నుంచి గరిష్టంగా 15 లేదా 20 మంది పిల్లలకోసం ఒక పెద్ద భవనం, ఒక హెచ్.డబ్ల్యు.ఓ., ఒక కుక్, ఒక కమాటీ ఉన్నారు. ఈ విధంగా నేను రెండు, మూడు హాస్టళ్లలో చూశాను. ఒక హాస్టల్‌కు వెళితే, ఇద్దరు వార్డెన్‌లు కూడా లేరు. ఆనాడు తీవ్రంగా నేను కోపపడి, ఆ హాస్టల్‌లో ఉన్న రెండు స్టోర్ రూముల తాళాలను ప్రెస్‌వారి సమక్షంలో పగులగొట్టించి రికార్డులను చూడడం జరిగింది. మళ్లీ ఆ రికార్డులను ట్యాంపరింగ్ చేసే అవకాశం కూడా ఉంది కాబట్టి ఆ రికార్డులన్నీ ఓపెన్‌గా పెట్టించి ప్రెస్‌వారితో షూట్ చేయించాను. అటెండెన్స్‌లో కనీసం 20 శాతం కూడా ఉండడంలేదు. చాలా దారుణమైన పరిస్థితులున్నాయి. అసలు వ్యవస్థంతా కూడా ఎంత దారుణంగా, బాధాకరంగా ఉందంటే కళ్ల నుంచి నీరు వస్తోంది. ఇంత చూసిన తర్వాత గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పింది ఏమిటంటే, సర్వనాశనం అయిపోయిన ఈ వ్యవస్థలను ఏవిధంగా మళ్లీ సంస్కరించి, బాగుచేసి, గాడిలో పెట్టి, ఎస్.సి., ఎస్.టి. విద్యార్థులను అత్యున్నతమైన స్థితికి, అంటే కార్పోరేట్ విద్య అని అంటే శాసనపరిషత్తు సభ్యులకు కొంత వ్యతిరేకభావం ఉన్నట్లుంది. గౌరవ శాసనపరిషత్ సభ్యులకు నేను తెలియచేసేది ఏమిటంటే, దయచేసి అపోహలు ఏవైనా ఉంటే వారిలాంటి పెద్దలు వాటిని సరిచేయాలి. అంతేకానీ, వాటిని పెద్దవి చేయకూడదు. గత 10 సంవత్సరాలు చేసినటువంటి అవినీతి, అసమర్థ పరిపాలన వల్ల హాస్టళ్లు నాశనమైపోవడం వాస్తవమే.

అధ్యక్షా, నేడు సమాజం మారుతుందన్న విషయం మనందరికీ తెలుసు. మారుతున్న సమాజంలో విద్యాప్రమాణాలు మారుతున్నాయి. గ్లోబలైజేషన్ ప్రక్రియ ఉంది, ప్రయివేటైజేషన్ ప్రక్రియ ఉంది, కంప్యూటరైజేషన్ ప్రక్రియ ఉంది, డిజిటలైజేషన్ ప్రక్రియ కూడా జరుగుతోంది. Entire world is becoming global economic village. That is also irreversible fact. ఈ ప్రక్రియలకు తట్టుకోలేక పెద్ద పెద్ద కమ్యూనిస్టు సౌధాలే కూలిపోతున్నాయి. చైనాలాంటి దేశంలో కూడా క్యాపిటలైజేషన్‌ను వేగవంతంగా తీసుకుపోతున్నారు. నేడు భారతదేశంలో కంటే చైనా దేశం లోనే ఒక ప్రయివేటు పరిశ్రమను స్థాపించడం చాలా తేలిక.

**ఉ.11.00**

శ్రీ సి.రామచంద్రయ్య : మనం దీనిగురించి వేరుగా ఒక క్లాసు తీసుకుందాం. మీ పరిజ్ఞానమంతా మాకు చూపించకండి.

శ్రీ ఆర్.కిశోర్‌బాబు : తెలుసుకోవాల్సిన అవసరముంది కదా.

(గౌరవ సభ్యులు సర్వశ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం, కె. ఎస్.లక్ష్మణరావు, యండపల్లి శ్రీనివాసులురెడ్డి, బొడ్డు నాగేశ్వరరావు తమ తమ స్థానాలలో నిలబడి మాట్లాడసాగారు.)

(అంతరాయం)

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : మీరు చెప్పినవన్నీ ప్రభుత్వం రంగంలోనే ఉన్నాయి కాబట్టే అవి అంతపైకి వచ్చాయి.

(అంతరాయం)

శ్రీ ఆర్.కిశోర్‌బాబు : సంస్కరించాలా, వద్దా చెప్పమనండి. ఇదేమిన్యాయం.

(అంతరాయం)

మిస్టర్ ఛైర్మన్ : అందరూ కూర్చోండి.

(అంతరాయం)

శ్రీ కె.ఎస్.లక్ష్మణరావ : పొద్దుగూకులూ పదేళ్ళగురించి మాట్లాడడంకాదు. మీరేం చేస్తున్నారో చెప్పండి.

శ్రీ ఆర్.కిశోర్‌బాబు : మీరందరూ పెద్దవాళ్ళు. కాస్త ఓపిక ఉండాలి.

(అంతరాయం)

మిస్టర్ ఛైర్మన్ : మంత్రిగారూ, మీరు చేయబోయేదానిగురించి చెప్పండి. ఎందుకిదంతా.

డా. ఎం.గేయానంద్ : ఉన్న హాస్టల్స్‌ను బలోపేతం చేయడానికి మీరేం చేస్తున్నారో చెప్పండి.

శ్రీ గాదె శ్రీనివాసులునాయుడు : మంత్రిగారిని చెప్పనిస్తే పూర్తవుతుంది.

(అంతరాయం)

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : మీరు కావాలంటే హాస్టల్స్‌ను బాగుచేయండి. మాకది కావాలి. హాస్టల్స్‌కు సంబంధించి గత ప్రభుత్వంలో ఏం మాట్లాడామో ఇప్పుడు కూడా అలాగే మాట్లాడుతున్నాము. కావాలంటే రికార్డులు బయటికి తీయండి.

(అంతరాయం)

శ్రీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి : కావాలంటే గత ప్రభుత్వం మీద నెపం వేయండి. కానీ విద్యార్థులను బలిచేయకండి.

(అంతరాయం)

MR. CHAIRMAN : Please, take my advice. పదకొండు దాటిపోయింది. ప్రశ్నోత్తర సమయం పూర్తి కావలసి ఉంది. మనం చర్చను ఏ విధంగానైనా పొడిగించవచ్చు. లేక తగ్గించాలంటే తగ్గించవచ్చు. సమయ పరిమితిలోనే మనం ఏదైనా చేయాలి. మాట్లాడడానికి, చేయడానికి అనేక వేదికలున్నాయి. అలాగే అనేక సమస్యలున్నాయి. బిజినెస్‌ను ఖచ్చితంగా పాటించాలి. ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పండి చాలు.

(అంతరాయం)

శ్రీ బి.చెంగల్‌రాయుడు : (మంత్రిగారిని ఉద్దేశించి). ప్రభుత్వ ఖర్చుతో అన్ని దేశాలు తిరిగివచ్చిన మీ పక్కనున్న ఆయన ఏం చెప్పలేదు. మీరు తిరక్కుండానే ఇవన్నీ చెప్తున్నారు.

(గౌరవ సభ్యుల నవ్వులు)

శ్రీ ఆర్.కిశోర్‌బాబు : ఎక్కడైనా ప్రతిపక్షాన్ని అధికారపక్షం గొంతు నొక్కేస్తుంది. ఇక్కడేమో ప్రతిపక్షంవారు అధికారపక్షం గొంతునొక్కేస్తున్నారు.

MR. CHAIRMAN : Please, let us proceed with the business.

శ్రీ సి.రామచంద్రయ్య : మీరు సంబంధించిన సమాధానమిస్తే ఎటువంటి వివాదం రాదు. మంత్రివర్గంలో మీతోనే సమస్య వస్తోంది. దయచేసి అర్థంచేసుకోండి. మీ పరిజ్ఞానమంతా మా నెత్తిన రుద్దకండి.

శ్రీ ఆర్.కిశోర్‌బాబు : నేను చెప్పేది వాస్తవాలు.

SRI C. RAMACHANDRAIAH: Egalitarian Society, Totalitarian Society అర్థాలు తెలియనటువంటి systemsను స్టడీ చేసినవాళ్ళం ఉన్నామిక్కడ. ఇక్కడేమి చిన్నోళ్ళం లేము. కాబట్టి మీ హాఫ్ నాలెడ్జ్ అంతా తెచ్చి మా నెత్తిన రుద్దకండి. మీరు మాట్లాడేది వాస్తవమా చెప్పండి.

(అంతరాయం)

శ్రీ ఆర్.కిశోర్‌బాబు: గత ప్రభుత్వం చేసిన తప్పులకు మీరు వత్తాసు తీసుకుంటారా చెప్పండి.

శ్రీ సి.రామచంద్రయ్య: సరే మా పార్టీ ప్రజలను తృప్తికరంగా పరిపాలించలేదు. మా పార్టీ పొరపాట్లు చేసింది కాబట్టే మమ్మల్ని ఇక్కడ కూర్చోబెట్టారు. మా పార్టీలోని వ్యక్తులకు మీరు రాత్రికి రాత్రే టిక్కెట్లు ఇచ్చి మంత్రి పదవులు ఇచ్చారు. మీకు సిగ్గులేదా అని అడుగుతున్నాను.

శ్రీ ఆర్.కిశోర్‌బాబు : వాళ్ళుకూడా మా దగ్గరికి వచ్చారు.

శ్రీ సి.రామచంద్రయ్య : రాత్రికి రాత్రే తీసుకున్నారు కదండీ. మా దగ్గర్నుంచి వచ్చినవాళ్ళు పునీతులై ఉన్నారా? తెలుగుదేశంపార్టీ కార్యకర్తలను మర్డర్ చేయించినారని పబ్లిక్ మీటింగ్‌లో చెప్పిన వాళ్ళను తీసుకుని మంత్రులుగా పెట్టుకున్నారు. పదవులిచ్చారు. సిగ్గులేదా మీకు.

శ్రీ ఆర్.కిశోర్‌బాబు : మా సంస్కరణలను అంగీకరించారు. మార్పును కోరుకున్నారు.

శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు : వాళ్ళల్లో కొంచెం మంచివాళ్ళను తీసుకున్నాము.

శ్రీ సి.రామచంద్రయ్య : మంచివాళ్ళెవరో భూతద్దంపెట్టి వెతికి తీసుకున్నారు మరి.

MR CHAIRMAN : I won't allow to function the House in this way.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : సార్, సబ్జెక్టును పర్మిట్ చేయండి.

MR CHAIRMAN : Please, take my advice. Come to the main point. Still there are Five more Questions left. ప్రశ్నోత్తర సమయం అయిపోయింది. సమయం కూడా అయిపోయింది. 11.05 అయ్యింది. ఇంకా అయిదో ప్రశ్న జరుగుతోంది. మరొక అయిదు ప్రశ్నలు ఉన్నాయి. I must strict to the business. There are two more Items in the Agenda yet to be discussed. శ్రామికుల సమస్యలు, కరువుపైన ఇంకా చర్చించాల్సి ఉంది. So, I am concerned more with the time, but not with any other thing.

శ్రీ ఆర్.కిశోర్‌బాబు : అధ్యక్షా, ప్రభుత్వం తీసుకున్నటువంటి నిర్ణయాన్ని సభద్వారా ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత లేకపోతే అపోహలు, సందేహాలు, గందరగోళం సృష్టిస్తున్నారు. దానిగురించి మేము చెప్పాల్సిన అవసరం కూడా ఉంది కదా.

శ్రీ సి.రామచంద్రయ్య: ప్రతిపక్షం లేకుంటే సంతోషంగా ఉందని చెప్పిన ఘనులు మీరు. మీకు ప్రజాస్వామ్యం విలువలు ఏం తెలుసు?

(అంతరాయం)

శ్రీ ఆర్.కిశోర్‌బాబు ః ప్రతిపక్షంలో అరాచక ప్రతిపక్షం, we want constructive opposition party, but not destructive opposition party.

MR CHAIRMAN: Now, I am closing the Business.

(అంతరాయం)

శ్రీ బి.చెంగల్‌రాయుడు ః మిగిలిన అంశాలు చర్చించడానికి సాయంత్రంపూట కూడా సమావేశాలు పెట్టండి.

MR CHAIRMAN: I don't want your advice. I can't run the House like this. Now, I will take up Next Question.

శ్రీ ఆర్.కిశోర్‌బాబు ః అధ్యక్షా, ఈమధ్య నేను తొమ్మిది జిల్లాలు పర్యటించాను. అ సమయంలో రెండు, మూడుజిల్లాల్లో ఎస్.ఎఫ్.ఐ విద్యార్థులు వచ్చి గొడవచేశారు. అందువల్ల నేను క్లారిటీ ఇవ్వాల్సిన అవసరముందనే ఉద్దేశంతో ఈ సమయాన్ని ఉపయోగించుకుంటున్నాను.

మిస్టర్ ఛైర్మన్ ః అవకాశాలు చాలా ఉంటాయి. I am concerned only with the Business. You are also concerned with the Business of the House. మీకు అక్కడ శాసనసభలో బిజినెస్ ఉంది. నాకు ఇక్కడ ఉంది. Then, we have to manage the things and how best we will manage the things, it shows our efficiency.

శ్రీ ఆర్.కిశోర్‌బాబు ః అధ్యక్షా, హాస్టల్‌లో ఉన్న విద్యార్థులు ఇవాళ ప్రభుత్వ పాఠశాలల్లోనూ, ఇంకా ఇతర పాఠశాలల్లోనూ చదువుతున్నారు. అలాగే తెలుగుమీడియంలో చదువుతున్నారు. వారికి కంప్యూటర్ విద్యకానీ, డిజిటల్ విద్యకానీ లేదు. ఇప్పుడు మన టీ.వి కార్యక్రమం ద్వారా మేము ఎడ్యుకేట్ చేస్తున్నాం. హాస్టల్స్‌కు వెళ్ళడంలేదు. అందుకోసం వీళ్ళందరికీ కూడా ఆంగ్లభాషను అందించాల్సిన అవసరముంది. డిజిటల్ టెక్నాలజీతో విద్యను, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఇంక్యుబేషన్ సెంటర్స్‌ను పెడుతున్నాం. ఇంక్యుబేషన్ సెంటర్స్ అంటే చిన్నప్పటి నుంచే వాళ్ళను విద్యతోపాటు మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా టెక్నలాజికల్ ఇన్‌పుట్స్, డిజిటల్ టెక్నాలజీని ఇవ్వాలని, దీనివల్ల ఈ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్నికూడా చిన్నప్పట్నుంచే వాళ్ళకి అందిస్తే హాస్టల్ నుంచికానీ, కళాశాలనుంచికానీ వెళ్ళిన ఆ విద్యార్థులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వారుకూడా మారి సమాజంలో నిలబడతారు. లేకపోతే నష్టం జరుగుతుంది. అందుకే అన్ని హాస్టల్స్‌ను కూడా దశలవారీగా రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలనే ఉద్దేశంతో ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలకు కూడా ఇంక్యూబేషన్ సెంటర్స్‌కోసం పది లక్షల రూపాయలు మంజూరు చేశాము. ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలకు కూడా ఒక మినీ ఆడిటోరియం సౌకర్యాన్ని, అలాగే సోలార్ ఫెన్సింగ్‌తో సెక్యూరిటీని కల్పిస్తున్నాం. ఇటీవలనే preferred rice అందచేయాలని జీ.ఓ కూడా ఇవ్వడం జరిగింది.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం ః ఈ సంవత్సరం ఎన్ని హాస్టల్స్‌ను మీరు రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చబోతున్నారు? దానికి ఎంత బడ్జెట్ కేటాయించారు?

ఉ. **11.10**

శ్రీ రావెల కిషోర్ బాబు ః అధ్యక్షా, ఈ ఆర్థిక సంవత్సరానికి 25శాతం హాస్టల్స్‌లో ఉన్న విద్యార్థులను రెసిడెన్షియల్ సిస్టమ్‌లోకి మార్చడానికి ప్రభుత్వం ప్రణాళిక తయారు చేసింది. 5 నుండి 20 మంది విద్యార్థులు ఉన్న హాస్టల్స్‌ని కొనసాగించడానికి మావద్ద బడ్జెట్ లేదు.

శ్రీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి ః సార్ అసలు విషయం అలా చెప్పమనండి.

శ్రీ రావెల కిషోర్ బాబు ః 20మంది ఉన్నవాళ్లకు వార్డులు ఇవ్వమంటారా?

(అంతరాయం)

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం ః సార్, మీరు సమాధానం చెప్పేటప్పుడే 5మంది విద్యార్థులు ఉన్న హాస్టల్స్‌ని మూసివేస్తున్నామని చెప్పండి.

(అంతరాయం)

శ్రీ రావెల కిషోర్ బాబు ః వాటిని రెసిడెన్షియల్ స్కూల్స్ కిందకు తీసుకువస్తున్నాము.

(అంతరాయం)

(సర్వశ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం, డా. ఎం. గేయానంద్, శ్రీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి, శ్రీ బొడ్డు నాగేశ్వరరావు, బి. చంగల్ రాయుడు తమ తమ స్థానాలలో నిలబడి సభకు అంతరాయం కలిగించసాగారు.)

శ్రీ రావెల కిషోర్ బాబు ః అధ్యక్ష, వీరికి మార్పు అవసరం లేదు, సార్ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు మంచి విద్య తీసుకోవడం వీరికి అవసరం లేదు. అవే హాస్టల్స్ కొనసాగడం కావాలి.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం ః మాకు మార్పు అవసరమే, కానీ సమాధానం చెప్పేటప్పుడు వివరంగా వాస్తవాలు చెప్పాలి.

(అంతరాయం)

శ్రీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి ః అధ్యక్షా, ఎన్ని వేలకోట్లు కేటాయిస్తున్నారో చెప్పమనండి.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం ః ఈ విధంగా సమాధానం చెప్పడం సభను ప్రక్కదారి పట్టించడమే అవుతుంది.

(అంతరాయం)

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం ః 5,10 మంది విద్యార్థులు ఉన్న దగ్గర వాటిని నడపడం కష్టమేనని మాకు కూడా తెలుసు. కానీ మీరు ఏం చెప్పాలి? అన్నింటినీ రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మారుస్తామని చెప్పారు. అలా మార్చడం సాధ్యపడుతుందా?

శ్రీ రావెల కిషోర్ బాబు ః దశలవారీగా మారుస్తాము.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం ః 5 మంది విద్యార్థులు ఉన్నవి కూడా మారుస్తారా?

శ్రీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి ః 5,10మంది విద్యార్థులు ఉన్నవి కూడా మారుస్తారా?

శ్రీ రావెల కిషోర్ బాబు : అధ్యక్షా, దశల వారీగా హాస్టల్ విద్యార్థులందర్నీ కూడా రెసిడెన్షియల్స్‌కు మారుస్తామంటే వీళ్లకు ఏంటీ అభ్యంతరం?

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : మార్చండి, మారుస్తామంటే ఎవరు వద్దంటారు?

(అంతరాయం)

శ్రీ రావెల కిషోర్ బాబు : అధ్యక్ష, వీళ్లకు ఇంగ్లీష్ మీడియం అవసరం లేదు, కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం లేదు.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : మీరు ఇస్తామనేవి మేము వద్దని చెప్పము. హాస్టల్ విద్యార్థుల మీద మీకు ఎంత అభిమానం ఉందో అంతకంటే వెయ్యిరెట్లు అభిమానం మాకు కూడా ఉంది.

(అంతరాయం)

శ్రీ రావెల కిషోర్ బాబు : మేము తీసుకువస్తున్న మార్పును మీరు ఆహ్వానించాలి.

శ్రీ సి. రామచంద్రయ్య : మేము వ్యతిరేకిస్తే కదా? మీరు జవాబు నేరుగా ఇవ్వడం లేదు ఎందుకు? మీతోనే మాకు సమస్య వస్తోంది.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : ప్రతీ ఒక్కరినీ తీసుకువెళ్లి పెద్దపిల్లల్లో కూర్చోబెట్టే విధానాన్ని పాటిస్తున్నారు. దయచేసి మీరు అర్థం చేసుకోండి.

శ్రీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి : అధ్యక్షా, ప్రశ్నకు సంబంధించిన సరైన సమాచారం రాలేదు.

## జీడిపల్లి రిజర్వాయరు నుండి కుందుర్తి బ్రాంచ్ కెనాల్‌కు నీరు

ప్రశ్న నెం. 8158 (107)

శ్రీ మెట్టు గోవింద రెడ్డి, ఎం.ఎల్.సి.

గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) హంద్రీ-నీవా క్రింద జీడిపల్లి రిజర్వాయరు నుండి కుందుర్తి బ్రాంచి కాలువకు నీటిని సరఫరా చేసేందుకు ఏదేనీ ప్రతిపాదన ఉందా?

ఆ) అయితే, ఆ వివరాలు ఏమిటి?

గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రిగారు (శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు):

అ) అవునండీ.

ఆ) హెచ్ఎన్ఎస్ఎస్ క్రింద కుందుర్తి బ్రాంచి కాలువను నిర్మించడం ద్వారా జీడిపల్లి రిజర్వాయరు నుండి భైరవానితిప్ప ప్రాజెక్టుకు నీటిని సరఫరా చేయడానికి కళ్యాణదుర్గం నియోజకవర్గం శాసనసభ్యుల నుండి ఒక ప్రతిపాదన అందింది. ఆ ప్రతిపాదన పరిశీలన లో ఉంది.

శ్రీ మెట్టు గోవింద రెడ్డి : (స్థానిక సంస్థల నియోజక వర్గం – అనంతపురం) అధ్యక్షా, నెలరోజుల క్రితం ముఖ్యమంత్రి గారికి కళ్యాణదుర్గం, రాయదుర్గం ఎం.ఎల్.ఏలు, మేము అంతా కలిసి ఒక మెమొరాండం సమర్పించాము. జీడిపల్లి రిజర్వాయరు నుండి కుందుర్తికి 61కిలోమీటర్లు ఉంది. కాలువ ద్వారా నీటిని పంపించి డైవర్ట్స్ ద్వారా నీళ్లు పోవడానికి అవకాశం ఉంటుంది. దాదాపు 114 చెరువులు నింపి, బి.టి. ప్రాజెక్టుకు 2టీఎంసీలు నీటిని పంపేందుకు అవకాశం ఉంది. రాయదుర్గంకు చాలా నీటిసమస్య ఉంది. దీని గురించి అనంతపూర్ అధికారులను కోరగా తాము రిపోర్ట్ పంపిస్తామని,దానికి డిపిఆర్ చేయించడానికి నిధులు అవసరం అవుతాయి, వాటిని విడుదల చేస్తే చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పడం జరిగింది. 2టీఎంసీల నీటిని అందిస్తే రాయదుర్గంలో 12వేల ఎకరాలు మరో మండలంలో 8వేల ఎకరాలు పంటపండడానికి అవకాశం ఉంటుంది. మరియు 114 చెరువులను నింపుకోవడానికి అవకాశం ఉంటుంది. బోర్లులోని నీటిశాతం కూడా పెరగడానికి అవకాశం ఉంటుంది. అనంతపురం జిల్లా గురించి ముఖ్యమంత్రిగారు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటామన్నారు కాబట్టి సత్వరం చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను. ఇందుకు రూ. 212కోట్లు కేటాయిస్తే ఏమాత్రం సరిపోదు, కేవలం రైతుల కరెంట్‌బిల్లుకే రూ. 190కోట్లు సరిపోతుందని ఈ మధ్యన వార్తా పత్రికలలో వచ్చింది. దీనిని గురించి కూడా పరిశీలన చేసి, ఎక్కువ నిధులు కేటాయించి, అనంతపురం జిల్లాను ఆదుకోవాల్సిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు : అధ్యక్షా, ఈ సంవత్సరం 16.8 టిఎంసీలు హంద్రీ–నీవా కాలువ ద్వారా తీసుకువెళ్లడం ద్వారా కళ్యాణదుర్గం, రాయదుర్గం మంచినీటి చెరువులు, రైతాంగం అవసరాలు తీరుతాయని శాసనసభ సభ్యులు ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈసంవత్సరం మొదటిదశ 11.8టిఎంసీలు మనం అనంతపురం జిల్లాకు ఇచ్చాము కాబట్టి దాదాపు 43 చెరువులకు పైగా నింపడం జరిగింది. అదేవిధంగా 23వేల బోర్లుకు సరిపడా నీళ్లు పడ్డాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని, ఈ సంవత్సరం మొదటి, రెండవదశలలో మదనపల్లి, చిత్తూరు వరకూ నీళ్లు తీసుకువెళ్లాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. దానికి తగ్గ ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నాము. తప్పకుండా గౌరవసభ్యులు చెప్పిన విషయాలు నోట్ చేసుకున్నాము, తప్పకుండా ఆ ప్రాంతాలకు మంచినీళ్లు తీసుకువెళ్లడానికి చర్యలు తీసుకుంటాము.

డా. ఎం. గేయానంద్ : అధక్షా, భైరవానితిప్ప ప్రాజెక్టు రాయదుర్గం దగ్గర ఉంది. రాయదుర్గంలో ఉన్న ప్రజలందరూ కూడా తమను కర్ణాటకలోని బళ్లారిలో కలపమని అడుగుతున్నారు. ఎందుకంటే పైన కర్ణాటక నుండి భైరవానితిప్పకు నీళ్లు రావాల్సి ఉంది. కానీ అదంతా బ్లాకైపోయి ఉంది. అధికారికంగా కమిటీలు భైరవానితిప్పకు 3 నుండి 4 టిఎంసీల నీటిని కేటాయించమని రిపోర్టులు ఇచ్చాయి. కానీ నీళ్లు మాత్రం రావడం లేదు. కాబట్టి దీనికి ప్రాముఖ్యాన్ని ఇచ్చి, భైరవానితిప్పకు హంద్రీ–నీవా నుండి నీళ్లు తీసుకురావడానికి ఏం చర్యలు తీసుకుంటారో చెప్పమని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీమతి పమిడి శమంతకమణి : అధ్యక్షా, హంద్రీనీవా సుజల స్రవంతి అని ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి రామారావు గారు ఎంత మంచిపేరు పెట్టారంటే ఆ యొక్క మంచితనం అనేది ఈనాడు మన నీటిపారుదల శాఖ మంత్రి గారు నిరూపిస్తున్నారు. ఎందుకంటే ఈ హంద్రీనీవా జీడిపల్లి నుండి రిజర్వాయరుకు నీటిని తీసుకువచ్చిన తరువాత దాదాపు అన్నీ నియోజకవర్గాలు మార్చి నెల వచ్చినా సరే అన్నీ చెఱువులు మేము నింపుకోవడం జరిగింది. అన్నీ చెక్ డ్యాంలు కుడా నిండాయి. దాదాపు రెండువేల మోటార్లలో నీటిశాతం పెరిగింది. మంత్రిగారికి

ఒక చిన్న మనవి. ఈ చిత్రావతి రిజర్వాయరు నుండి పులివెందుల బ్రాంచి కెనాల్ అని ఒకటి ఉంది. అది పూర్వం నుండి పులివెందులకు నీళ్లు తీసుకోవడం జరుగుతోంది. నా స్వార్థం కోసం మీద్వారా మంత్రిగారికి ఒక చిన్న మనవి చేయదలచుకున్నాను. అనంతపురం జిల్లాలో ఎల్లనూరు అనే ఒక మండలం ఉంది. అక్కడ 1500అడుగులు బోర్లు త్రవ్వినా కూడా నీటిశాతం ఎక్కడా కూడా లేదు. కడపజిల్లా సింహాద్రిపురంకు కేవలం 5కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ చిత్రావతి నీళ్లు అక్కడికి రావడం లేదు. పులివెందుల బ్రాంచి కెనాల్ ద్వారా కూడా నీళ్లు రావడం లేదు. నేను కోరేదేమంటే చిత్రావతి నుండి గుడ్డుమర్రి వరకూ ఏరు ద్వారా నీటిని వదలండి, లేదా పులివెందుల బ్రాంచి కెనాల్ ద్వారా కల్లూరు తర్వాత షట్టర్స్ ఏమీ లేవు. అమాయికంగా ఏవిధంగా ఆలోచించి, మరి ఆనాడు ఈ యొక్క నీటిని తీసుకుపోవడం జరుగుతోంది, ఇప్పుడు షట్టర్స్ అయినా వేసి, ఎల్లనూరు మండలానికి నీరు ఇవ్వాల్సిందిగా కోరుతున్నాను. ఇప్పటివరకూ ఎంతోమందికి నీరు ఇచ్చారు, చేతులెత్తి మొక్కుతున్నాము, అదేవిధంగా ఎల్లనూరు మండలాన్ని కూడా కాపాడాల్సిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**11.20 AM**

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావుః అధ్యక్షా, పులివెందుల నియోజక వర్గం రైతులందరూ మొన్న ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువచ్చి, చీనీ చెట్లు ఎండిపోతున్నాయి, మంచినీళ్లు కావాలని అడగడం జరిగింది. దానిమీద అనంతపురం రైతాంగాన్ని ఒప్పించి పులివెందులకి నీళ్లు తీసుకువెళ్లి, అక్కడ ఉన్న వందల కోట్ల రూపాయలు విలువచేసే చీని చెట్లను బతికించాము. మంచినీళ్లు కూడా ఇచ్చాము. మళ్లీ, ముఖ్యమంత్రిగారి దగ్గరకు వచ్చి 0.5 టియంసిల నీళ్లు కావాలని అడిగారు. దాని గురించి ఆ రెండు జిల్లాల కలెక్టర్లును మానిటర్ చేసుకుని, ఇరిగేషన్ అధికారలను కో ఆర్డినేట్ చేసుకుని పులివెందులకి మళ్లీ 0.5 టియంసిల నీళ్లు ఇచ్చాము. గౌరవ సభ్యులు చెప్పిన విధంగా ప్రజలు ఎవరైతే మంచినీటి ఎద్దడి పడుతున్నారో, మళ్లీ ఒక సారి రెండు జిల్లాల కలెక్టర్లను, అధికారులతో మానిటర్ చేసుకుని, ప్రస్తుతం ఉన్న నీటితో జాగ్రత్తలు తీసుకుని మంచినీటి విషయంలో ఇటు పిఎబిఆర్ గానీ, జిల్లాలోని ట్యాంకులలో ఉన్న నీళ్లు గానీ మళ్లీ జూన్ మాసంలో వర్షాలు వచ్చే వరకు కాపాడేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుని మంచి నీటి విషయంలో పూర్తి బాధ్యతలు జిల్లా యంత్రాంగానికి అప్పజెబుతాము. ఇరిగేషన్ డిపార్టుమెంటు వాళ్లు కో-ఆర్డినేట్ చేస్తామన్నారు. ఖచ్చితంగా ఫేస్-1 హంద్రీనీవాలో ఉన్న లోపాలన్నీ సరిదిద్ది, రేపు రాబోయే రోజులలో రెండింతల నీళ్లు ఎలా తీసుకురావాలి అనే దానిపైన, ఈ 16 టియంసిల నుండి 30 నుండి 40 టియంసిల వరకు ఎలా తీసుకువెళ్లాలి అనేదానిపైన కూడా ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. దాని తగ్గట్లు ఆ కాంట్రాక్టర్లకు సంబంధించి జీ.వో.నెం.13, జీ.వో.నెం. 22 కూడా ఇవ్వడము జరిగింది. ఏజెన్సీలందరూ కూడా కాలువల మీదకెక్కి మొత్తం పనులు చేయాలి, ఈ సంవత్సరం మార్చి, ఏప్రిల్, మే నెలలలో పనులు వేగవంతం చేసి జూన్ నెలల్లో వర్షాలు వచ్చేవరకు పనులు పూర్తి చేయాలని చెప్పాము. హంద్రీనీవాలో ఈ రోజు రైతాంగం, ప్రజలు తాగునీటి విషయంలో, సాగునీటి విషయంలో, చెరువుల విషయంలో ఈ సంవత్సరం వచ్చిన ఫలితాల కన్నా రెండింతలు వచ్చే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాము.

గౌరవ సభ్యులు గేయానంద్ గారు అడిగినట్లు కూడా నీటి కేటాయింపులు ఉన్నాయి. కాకపోతే అక్కడికి ఏవిధంగా, ఎలా తీసుకువెళ్లాలి, అందుకే ఆ రెండు నియోజక వర్గాలలో మంచినీటి ఎద్దడిని తీర్చేందుకు ఏవిధంగా చర్యలు తీసుకోవాలో అలా చర్యలు తీసుకుంటాము.

## నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి సాంకేతిక సహాయం

ప్ర.శ్న. నెం. 8158 (107)

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో శాస్త్రీయ, సాంకేతిక సహాయం కోసం ఆస్ట్రియన్ పవర్ అండ్ ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీ (ఎపిఇటి) తో ఆంధ్రప్రదేశ్ జల వనరుల అభివృద్ధి సంస్థ ఒప్పందాన్ని కుదుర్చుకున్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, ఆ వివరాలు ఏమిటి?

గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు):

అ) అవునండి.

ఆ) ఆంధ్రప్రదేశ్ సేవల బట్వాడా, సాంకేతిక విజ్ఞాన, ఆధారరేఖను మెరుగుపరిచేందుకు ప్రత్యేకించిన ఆంధ్రప్రదేశ్‌లోని సర్వోత్తమ సాంకేతిక నైపుణ్యాలను వినియోగించడానికి వీలుగా తోడ్పాటును అందించేందుకు 2015, ఫిబ్రవరి 2 న ఎపిడబ్ల్యుఆర్‌డిసి మేనేజింగ్ డైరెక్టరు, ఎపిఇటి మేనేజింగ్ డైరెక్టరు ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎపిడబ్ల్యుఆర్‌డిసి, ఆస్ట్రేలియా ఎపిఇటి నోడల్ ఏజెన్సీలుగా ఉంటాయి.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : అధ్యక్షా, ఇది మంచి పని. కానీ దీనికి సంబంధించిన వివరాలు ఏమి చెప్పలేదు? ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు, ఒప్పందం కుదుర్చుకున్నారు కాబట్టే ఆ వివరాలు వచ్చాయి. ఒప్పందం కుదిరిందంటే ఎలా సార్?

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు : అధ్యక్షా, Letter of Intent of Collaboration కింద ఆస్ట్రియా ప్రభుత్వానికి సంబంధించిన నోడల్ ఏజె న్సీ, Austrian Power and Environment Technology (APET), అదేవిధంగా Andhra Pradesh Water Resource Development Corporation కింద రెండు నోడల్ ఏజెన్సీలుగా ఈ Letter of Intent for Collaboration జరిగింది. తప్పకుండా ఆ నోడల్ ఏజెన్సీ కూడా వివిధ రంగాలైన అగ్రికల్చర్‌గాని, రైల్వేలు గాని, వాటర్ ట్రీట్ మెంట్ అండ్ కన్సర్వేషన్ కానీ, ఇరిగేషన్, వాటర్ వేస్ట్ అదేవిధంగా ఈ ఎన్విరాన్‌మెంట్, హైడ్రోపవర్ మీద, హెల్త్ మీద, ఎడ్యుకేషన్ మీద రకరకాల డిపార్టుమెంట్ల మీద వాళ్లు సలహాలు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఖచ్చితంగా వాళ్లిచ్చిన సమాచారాన్ని మన ప్రభుత్వం తరుపున, మననోడల్ ఏజెన్సీ తరుపున మనం తీసుకునే చర్యలు కూడా తప్పకుండా గౌరవసభ్యులకు తెలియజేయడమైంది. ఏదైతే వాటర్ మేనే జ్ మెంట్ మీద, వేస్ట్ వాటర్ ట్రీట్ మెంట్ మీద, అదేవిధంగా ట్రైనింగ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ మీద, రిన్యూవబుల్ ఎనర్జీ మీద అదేవిధంగా గ్రీన్ హౌసెస్, స్మార్ట్ బిల్డింగ్స్ మీద కొంత సమాచారంతో ముందుకు వచ్చారు. ఖచ్చితంగా సభ్యులకు ఈ

సమాచారం తెలియజేస్తాము. భవిష్యత్తులో తీసుకునే నిర్ణయాలు ఎప్పటికప్పుడు సభకు, సభ్యులకు సమాచారం తెలియజేస్తాము.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : అధ్యక్షా, దీనికి ఏమైనా ప్రత్యేకమైన సంస్థలను పెడుతున్నారా? లేదా వేర్వేరు డిపార్టుమెంటులలో వారు వేర్వేరుగా డీల్ చేస్తారా? తెలియజేయవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు : అధ్యక్షా, మన ఆంధ్రప్రదేశ్ వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ నోడల్ ఏజెన్సీగా ఉంది. దీని ద్వారా ఏ డిపార్టుమెంటుకి ఏ సమాచారం కావాలన్నా దీని ద్వారా మిగతా డిపార్టుమెంట్లకు సమాచారం తెలియజేస్తాము.

MR. CHAIRMAN: Next question i.e. Q.No.7829 (108). Member not present. Deemed to have been answered.

## DISPOSAL OF PLASTIC WASTE IN VILLAGES

LCQ.No.7829(S)

Sri Reddivari Reddappa Reddy, M.L.C.,

Will the Honorable Minister for Panchayat Raj, Rural Water Supply & NREGS be pleased to state:

a) Whether plastic waste is being disposed off by burning it openly in villages;
b) If so, the measures taken to control the same

Minister for Panchayat Raj (Sri Ch. Ayyannapatrudu):

a) No such instructions were issued.
b) If any such instances are happened, suitable instructions would be issued to the concerned.

## డ్వాక్రా పథకాలలో అవకతవకలు

ప్రశ్న నెం. 8169 (109)

శ్రీ మెట్టుగోవింద రెడ్డి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణ, పారిశుద్ధ్య శాఖ మంత్రిగార దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) డ్వాక్రా కార్యక్రమంలో ఏవైనా అవకతవకలు చోటు చేసుకున్నాయా?
ఆ) అయితే, ఆ వివరాలు ఏమిటి ?

గౌరవనీయులైన గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణ, పారిశుద్ధ్య శాఖ మంత్రిగారు (శ్రీమతి కిమిడి మృణాళిని):

అ) లేదండీ.
ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఈ రెండు ప్రశ్నలకి సంబంధించి ఏవిధమైనటువంటి irregularities ఈ పది నెలలలో కూడా మా దృష్టికి రాలేదు. గౌరవ సభ్యులు ఏవిధమైనటువంటి irregularities చూపించినా తగు చర్యలు తప్పకుండా తీసుకుంటాము.

MR. CHAIRMAN: Next question i.e. Q.No.8149 (110). Member not present. Deemed to have been answered.

**TRAFFICKING IN WOMEN**

Starred Question No.8149

Smt. Nannapaneni Rajakumari, M.L.C.,

Will the Deputy Chief Minister (Home) be pleased to state:

a) Whether it has been brought to the notice of the Government that trafficking in Women is taking place in large scale in Vizianagaram District; and
b) If so, the details thereof and action taken to curb these activities?

Deputy Chief Minister (Home, Sri Nimmakayala China Rajappa):

a) No Sir.
In the year 2012 (2) Cases were registered and 11 victim Girls were rescued. In the year 2013 one case was registered and one victim was rescued. In the year 2014 Five cases were registered 8 victims were rescued. In the year 2015 one case was registered and 3 victims were rescued.

b) The Government is taking the following steps to curb the activities of trafficking in women:
   i) Cases are being registered promptly, investigated thoroughly and accused are being arrested immediately and remanded to Judicial Custody.
   ii) Regular visible policing is being conducted near the educational institutions and women work places, bus stands, Railway stations.
   iii) For safety of women, the Dial 100 is functioning in the state, under direct control of the DGP.
   iv) Awareness programmes are also being conducted by the police, with Women & Child Welfare Department, and Non-Governmental organizations (Prajwala) at schools, with the teachers, and the parents of the children through audios and videos and short films.
   v) Child help line 1098 is being popularized along with dial 100 facility. Any girl facing any kind of problem or any offence can dial to 1098 and there will be quick response by the Child line Team, within 60 minutes.
   vi) Vide publicity is being given through print and electronic media regarding ensuring punishments for sexual assaults on women and children.
   vii) The Government has also taken steps by introducing Nirbhaya Act for sexual assault on Women cases and POCSO Act for sexual abuse/assault on female children and it is being implemented in the districts by applying sections under Nirbhaya Act and POCSO Act (Protection of Children from Sexual Offences Act) against the accused in sexual abuse/assault on women and child respectively.
   viii) Instructions have been given to all unit officers by the DGP, AP, to form special squads in every district under the charge of Addl. SP.
   ix) Crime against Women and Sexual assaults are reviewed periodically by senior police officers and instructions are being issued in sensational cases with regard to relief and rehabilitation apart from criminal action on the accused.
   x) Abhaya Mobile App is also introduced.

MR. CHAIRMAN: Question Hour is over. Now, tea-break for 15 Minutes.

(Then the House adjourned at 11.26 am)

---

**AFTER TEA BREAK, THE HOUSE RE-ASSEMBLED AT 12.07 P.M.**

**(THE HON'BLE CHAIRMAN IS IN THE CHAIR)**

* * *

MR. CHAIRMAN: Now, special mention by Mr. Changal Rayudu.

(2)**SPECIAL MENTION :**

శ్రీ బి. చెంగల్ రాయుడుః సర్, EAMCET పరీక్షలు ఈసారి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వేరుగా నిర్వహించడం వలన 15% సీట్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాళ్లకు వస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నటువంటి 15% సీట్లు ఈ రాష్ట్రానికే వస్తాయి. 15% రిజర్వేషన్స్ ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రప్రభుత్వ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చి పరీక్షలు రాయడానికి ఇబ్బందిగా ఉన్నది, వాళ్లకు తెలంగాణాలోనే ఆంధ్రప్రదేశ్ EAMCETను రాయడానికి అవకాశం కల్పించమని అడగగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దానికి అనుమతి ఇచ్చింది. సెంట్రల్ యూనివర్సిటీ, సెంట్రల్ స్కూల్స్‌లో పెట్టుకొనడానికి అవకాశం కల్పించారు. తెలంగాణ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ పరీక్షలకు అటెండ్ అవ్వడానికి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లకుండా తెలంగాణలోనే పరీక్షలు రాసుకోవడానికి వెసులుబాటు కలిగింది. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నటువంటి వారికి ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు తెలంగాణాలో పరీక్షలు రాయడానికి అలాంటి ప్రయత్నం ఇంతవరకు జరగలేదు. జరగనిదానివల్ల మన విద్యార్థులంతా ఇక్కడకు వచ్చి పరీక్షలు రాయవలసి వస్తుంది. శ్రీకాకుళం వాళ్లు జనరల్‌గా మెడిసిన్‌లో 1వ ర్యాంకు నుంచి 100వ ర్యాంకువరకు ఇక్కడనే ఉస్మానియా, గాంధీలో చేరుతారు. ఇంతకుముందు సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు కూడా ఇదేవిధంగా జరిగేది.

ఛైర్మన్ ః మీరు ఇచ్చిన పిటీషన్‌లో మీరు ఎలాబరేట్‌గా చెప్పారు. But, the petition is only half page.

శ్రీ బి.చెంగల్ రాయుడుః జనరల్‌గా ఇచ్చేటప్పుడు తక్కువగా ఇచ్చి చెప్పేటప్పుడు ఎక్కువగా చెబుతాము. The preparation is less and the presentation is more that is our motto. దానినే కదా ఎగువ సభ అని అంటారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి....

MR. CHAIRMAN: This petition will go to the Government and they should follow what is written.

SRI B. CHANGAL RAYUDU: Sir, it is not a petition. It is a special mention. I request the Government to put a letter to the Government of Telangana for allocation of centres in the State of Andhra Pradesh itself.

MR. CHAIRMAN: Right Sir, very good.

డా. పి. నారాయణః గౌరవ సభ్యులు చెప్పిన అంశాలను నేను నోట్ చేసుకున్నాను.

మ. **12.10**

MR. CHAIRMAN: Now, Item No.II. All the papers listed in the agenda are deemed to have been laid on the Table of the House.

**(3) PAPERS TO BE LAID ON THE TABLE:**

A copy of the Annual Report of the Andhra Pradesh Power Finance Corporation Limited for the year 2013-14, as required under Section 619-A of the Companies Act, 1956.

(4) కార్మికుల సమస్యలపై లఘు చర్చ

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : అధ్యక్షా, నేను గతంలో ఈ సబ్జక్టుపైన మాట్లాడిన దానికి కొనసాగింపుగా క్లుప్తంగా మీ ముందు చెప్పదలచుకున్నాను. సభలో అమాత్యవర్యులు కూడా ఉన్నారు కాబట్టి, నేను అంశాల వారీగా మాట్లాడి తక్కువ సమయంలోనే పూర్తి చేయడానికి ప్రయత్నిస్తాను. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు వలస వెళుతున్న కార్మికులకు సంబంధించిన లెక్కలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దగ్గర ఏమైనా ఉన్నాయా? ఉంటే, వారికి ఈ వలస కార్మిక చట్టాలు వర్తించేటట్లుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి అనే అంశం పైన ఇంతవరకూ ప్రభుత్వం తరఫు నుంచి ఏ విధమైనటువంటి చర్యలుగాని, దానికి సంబంధించిన కమిటీలు కానీ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం హైదరాబాదులో కూడా మన రాష్ట్రం నుంచి వచ్చి, ఇక్కడ పనిచేసుకునే వారు కూడా వలస కార్మికుల క్రిందకు వచ్చే పరిస్థితి ఉంది కాబట్టి, దీని గురించి కూడా ప్రత్యేకించి ఆలోచన చేయవలసిన అవసరం ఉందని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరు తున్నాను.

ఇటీవల నేను అనేక పత్రికలు చూసినప్పుడు, మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ముఖ్యంగా తూర్పుగోదావరి జిల్లాల నుంచి విదేశాలకు, మిడిల్ ఈస్ట్ దేశాలకు, గల్ఫ్ కంట్రీలకు ఎక్కువమంది మహిళలు హౌస్‌మేడ్స్‌గా వెడుతున్నారు. అలాగే, అన్‌స్కిల్డుగా ఉన్న లేబర్ ఈ దేశాలకు వెడుతున్న టువంటి పరిస్థితులలో చాలా ఏజన్సీలు వీరి దగ్గర డబ్బులు తీసుకుని, సరైన సౌకర్యాలు ఇవ్వ కుండా, విదేశాలకు వెళ్ళినా వారి పాస్‌పోర్టులు ఇవ్వకుండా వారి దగ్గరే పెట్టుకుని, నానా హింసలు పెడుతున్నారు. అనేక వందలమంది జైళ్ళల్లో కూడా ఉంటున్నారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాలలో, విదేశాలలో నానా అగచాట్లు పడుతున్న వలస కార్మికులు ఎవరైతే ఉన్నారో, వారిని రక్షించడానికి, వారి హక్కులు సాధించుకోవడానికి, వారిని ఇక్కడకు తీసుకురావడానికి, జైళ్ళల్లో మగ్గుతున్న వారిని కాపాడేందుకు మన ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకోలేదు. కాబట్టి, వీరిపైన కూడా ప్రభుత్వం దృష్టి సారించాలని తమ ద్వారా మనవిచేస్తున్నాను.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చట్టం ప్రకారం మన దగ్గర కొన్ని కమిటీలు ఉండవలసిన అవసరం ఉంది. అందులో లేబర్ అడ్వైజరీ కమిటీ, ఇంప్లిమెంటేషన్ అండ్ ఎవాల్యుయేషన్ కమిటీ, మిని మమ్ వేజెస్ యాక్టు ఎడ్వైజరీ బోర్డు, కాంట్రాక్టు లేబర్ ఎబాలిషన్ అండ్ రెగ్యులేషన్ చట్టం క్రింద పరిశీలించేందుకు, ప్రభుత్వానికి డైరెక్షన్స్ ఇచ్చేందుకు ఒక కమిటీ ఉండాలి, అలాగే, సిమెంటు, స్టీల్, షుగర్, టెక్స్‌టైల్, జ్యూట్ మొదలైన పరిశ్రమలకు సంబంధించి ట్రైపార్టియేట్ కమిటీలు ఉండేవి. వాటన్నింటిని పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఈ కమిటీలను ఏర్పాటు చేయకపోవడం వల్ల, ఈ రకమైనటువంటి ఇండస్ట్రియల్ హార్మోనీని మెయింటైన్ చేయడంలో కానీ, లేదా ఎంప్లాయర్, ఎంప్లాయీలకి ఉన్నటువంటి సమస్యలను ఈక్విటబుల్‌గా చర్చించి, ప్రభుత్వానికి సలహా చెప్పేటటువంటి అవకాశం ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా లేకుండా పోయింది. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలని తమ ద్వారా కోరుతున్నాను.

ఛైల్డ్ లేబర్ మనకు పెద్ద మైనస్‌గా తయారయింది. ఎవరైతే పాఠశాలలకు వెళ్ళని ఏజ్ గ్రూప్‌లు ఉండే ప్రతి పిల్లా, పిల్లాడిని కూడా ఛైల్డ్ లేబర్‌గా పరిగణించాలనేది అంతర్జాతీయంగా ఉన్నటువంటి సూత్రమే అది. ఆ ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జనాభా లెక్కల ప్రకారం సుమారు 14 సంవత్సరములలోపు పిల్లలు ఎంతమంది ఉన్నారు? ఎంతమంది పిల్లలు బడి బయట

ఉన్నారు? వారందరిని బడికి తీసుకురావడమే కాకుండా, వారు చైల్డ్ లేబర్‌గా ఇటుకబట్టీలు, హోటళ్ళు, క్వారీలు ఎక్కడ చూసినా పనిచేస్తున్న పిల్లలందరినీ, ఏ విధంగా ఆ పనుల నుంచి విముక్తి చేసి, ఎలా బడికి పంపించాలనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలి. గతంలో లేబర్ డిపార్టుమెంటు, విద్యాశాఖ, ఆయా జిల్లా కలెక్టర్లతో ఒక కమిటీని వేసి, వాటికి కొన్ని నిధులను కూడా ఏర్పాటు చేయాలి. అవసరమైతే, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ యొక్క సహకారాన్ని కూడా పొంది, పై అంశంపై కృషి చేయడం జరిగింది. దీనిని కొనసాగించేందుకు మరిన్ని చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

అలాగే, అసంఘటిత రంగ కార్మికుల ఉద్యోగ భద్రత, సాంఘిక భద్రత, వారి సంక్షేమానికి సంబంధించి కేంద్రప్రభుత్వం చట్టాలు తీసుకురావడం జరిగింది. ఆ మార్గాలలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా చట్టాలు తీసుకువచ్చి, అందుకు తగ్గట్లుగా అనార్గనైజ్ సెక్టారులో ఉన్నవారికి ఏ విధమైన మెరుగుదల చేయలేదు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంకా వెనుకబడే ఉన్నది. గతంలో ఉన్న ప్రభుత్వం, ఇప్పుడున్న ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదు.

ప్రస్తుతం నూతన ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చిన పరిస్థితులలో స్కీం వర్కర్స్ అనే పేరుతో శాశ్వతమైన పనులలో అంటే ఐసిడిఎస్ క్రింద పనిచేసే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు లేదా ఆశా వర్కర్లుగా పనిచేసే ఆశా కార్మికులు ఇంకా అనేక లక్షల మంది మహిళలు పనిచేస్తున్నారు. ముఖ్యంగా పథకాలలో పనిచేస్తున్న హెల్త్ వాలంటీర్లు, ఎడ్యుకేషన్ వాలంటీర్లు మొదలైన వారికి రకరకాల పేర్లు పెట్టి, చట్ట ప్రకారంగా కార్మికులకు ఉండే హక్కులు గానీ, ఫ్యాక్టరీల చట్టాలు కానీ, ఇండస్ట్రియల్ డిస్ప్యూట్సు చట్టాలు కానీ, లేదా కాంపెన్సేషన్, ఈఎస్ఐ, పిఎఫ్, మొదలైనవి వర్తించకుండా, వీరిని దోచుకోవడమనేది గత ప్రభుత్వంలో సుమారు 2, 3 దశాబ్దాలుగా జరుగు తోంది. వారికి రావలసిన గౌరవ వేతనం, పారితోషికం మొదలైనటువంటి వాటిల్లో కూడా వివక్షత ఉంటోంది. వీటివలన వారిలో తీవ్రమైన అసంతృప్తి, పోరాటాలు జరుగుతున్న నేపథ్యంలో ఇందులో any economic activity, service activity, welfare activity ప్రభుత్వం తరఫున, ఉద్యోగుల తర ఫున, సంస్థల తరఫున పనిచేస్తున్న వారందరినీ వర్కర్లుగా గుర్తించాలనేది ఇంటర్నేషనల్ ఫండ మెంటల్ రూల్ సార్. కానీ, ఇక్కడ స్వయం కార్మికులని, గౌరవ కార్మికులని అంటున్నారు. వీరికి కనీస వేతన చట్టాలలో కానీ, కార్మిక చట్టాలలో కానీ, ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ చట్టంలో కానీ లేదా ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించేటటువంటి సివిల్ సర్వీస్ రూల్సు కానీ ఇవేవీ వర్తించకుండా ఉండేట ట్లుగా వారికి దోపిడీ నిరాటంకంగా కొనసాగుతున్నది. ప్రభుత్వమే ఈ రకమైనటువంటి దోపిడీకి పాల్పడుతున్న నేపథ్యంలో ప్రైవేటు సెక్టారులోని దోపిడీని ప్రశ్నించేందుకు ప్రభుత్వానికి మోరల్ రైట్ కూడా పోయే పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో ఈ స్కిల్డ్ వర్కర్లకి వివిధ శాఖలలో, వివిధ వర్గాలలో ఉన్న వారిని గుర్తించేదానికి వర్కర్ల యొక్క డెఫినిషన్ వర్తించేందుకు ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని నేను కోరుతున్నాను.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్ని మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలు, ఎన్ని ఫ్యాక్టరీలు ఉన్నాయి? అందులో పెద్ద తరహా, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి? మొదలైన వాటికి సంబంధించిన లిస్టు ఉన్నది. అయితే, వీటన్నింటిలో ఎన్ని కంపెనీలలో ట్రేడ్ యూనియన్లు, కలెక్టివ్ బార్గెనింగ్ ఉన్నది? ఎన్నిటిలో జీతాలు as per the stipulated norms ఉన్నాయి? ఎన్నింటిలో పిఎఫ్, ఈఎస్ఐ, కవరేజ్ ఉన్నదనే సమాచారం రాష్ట్రప్రభుత్వం దగ్గర కూడా లేకపోవడం చాలా విచా రకరం. అసలు కార్మికులను ఎట్టికి వదిలిపెట్టిన పరిస్థితి తార్కాణం అవుతుంది. తమ ద్వారా 2, 3 ఉదాహరణలను ప్రభుత్వం దృష్టికి తీసుకురాదలచుకున్నాను.

మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 60 స్పిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. వీటిల్లో సుమారు 2, 3 స్పిన్నింగ్ మిల్లులలో మాత్రమే కార్మిక సంఘాలు ఉన్నాయి. మిగతా కంపెనీలలో కార్మిక సంఘాలని అలౌ చేయడం లేదు. అలా అలౌ చేయకుండా ఉండే వాటికి రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి పూర్తి సహకారం యాజమాన్యాలకు దొరుకుతున్న ఫలితంగా దోపిడీ ఎక్కువ జరుగుతోంది. అలాగే, సిమెంటు పరిశ్రమలలో కూడా భారీ, చిన్న పరిశ్రమలలో కూడా కార్మిక సంఘాలను అలౌ చేసే పరిస్థితి లేకుండా ఉంది. అలాగే, కార్మికుల యొక్క డెమొక్రటిక్ రైట్‌ను ప్రపంచ వ్యాప్తంగా గుర్తించబడే హక్కుని మనం అమలు చేసే క్రమంలో ఈ ప్రభుత్వం కార్మికుల పక్షాన నిలబడు తుందా? యాజమాన్యం పక్షాన నిలబడుతుందా అంటే, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 7, 8 నెలల్లోనే స్పష్టమైన ఉదాహరణలతో యాజమాన్యాల ప్రక్కన నిలబడి, కార్మికులతో వ్యతిరేకిస్తున్నది. ఈ విధానాన్ని మార్చుకునేదానికి కార్మిక సంఘాలతో చర్చించి, అందుకు తగ్గ విధివిధానాలను రూపొందించాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మ. **12.20**

శ్రీ పి.జె. చంద్రశేఖర రావుః అలాగే, గత సమావేశాల్లో ఈ సబ్జెక్టు మీద చాలా సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. ఆ చర్చలకు పర్యవసానంగా, మేము ఈ విషయాలన్నీ నోట్ చేసుకుంటాము, తప్పనిసరిగా రెండు, మూడు నెలల్లోపు పాయింట్స్ అన్నింటినీ పరిష్కారం చేస్తాము, అందర్నీ కాన్ఫిడెన్స్‌లోకి తీసుకుంటాము, అన్ని కార్మిక సంఘాలను పిలిచి మాట్లాడి ఈ విషయంలో ఆదర్శవంతమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ని రూపుదిద్దుతామని గౌరవ కార్మిక శాఖామంత్రి గారు గత సమావేశాల్లో హామీనిచ్చారు. కానీ, ఇన్ని నెలలు గడిచిపోయినా, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నది. పరిస్థితులు మరింత విషమించి, మరింత దుర్భరమైన పరిస్థితికి నెట్టివేయబడుతున్న క్రమంలో గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ యొక్క లేబర్ పాలసీ ఏమిటనేది మనం చూస్తే, యాజమాన్యాలకు ఏ విధమైన సౌకర్యాలు కల్పించాలి, కార్మికుల వాయిస్‌ని ఏవిధంగా నొక్కివేయాలి, యాజమాన్యాల దోపిడీకి అడ్డంకులేమన్నా ఉంటే, వాటిని ఎట్లా తొలగించాలన్న దిశగా ఈ ప్రభుత్వం ఆలోచించడం దుర్భరమైన విషయం. కార్మికుల పక్షాన నిలబడవలసినటువంటి నైతికమైన, ప్రజాస్వామికమైన చట్టబద్ధమైన బాధ్యత ఈ ప్రభుత్వానికున్నది. ఈ ప్రభుత్వం ఆ బాధ్యతల్ని నిర్వహించడంలో నిర్లక్ష్యంగా ఉన్నా, పట్టించుకోకపోయినా, దాని ప్రతిఫలాలు మన ఉత్పత్తి మీద, సంపద మీద, రాష్ట్ర అభివృద్ధి మీద పడుతుంది. నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినటువంటి నేపథ్యంలో, ఇది ప్రజల యొక్క ఆంధ్రప్రదేశ్‌గా ఉండాలి. ఈ ప్రజలందరూ అనంటే, కష్ట జీవుల సుఖశాంతులకు పెట్టింది పేరుగా ఉండాల్సినచోట్ల, దోపిడీకి, నిర్లక్ష్యానికి, కార్మిక వ్యతిరేకతకు ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా, ఒక బ్రాండ్ సొసైటీగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రూపొందిస్తున్నటువంటి ఈ ప్రభుత్వ విధానాలను మార్చుకోవాల్సిన అవసరముందని నేను ఈ సందర్భంగా మనవి చేస్తూ, నాకు ఈ అవకాశమిచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడుః అధ్యక్షా, అన్ని రంగాల్లోనూ ఈ కార్మికులు అందజేయుచున్న సేవల్ని నిర్వచించలేము, వెలకట్టలేము. ఎందుకంటే, కార్మికులనే వారు లేనట్లయితే, ఈ రోజు సమాజంలో మనం ఏ కార్యక్రమం కూడా చేసుకోలేని పరిస్థితుల్లో ఉంటాము. అయితే, ఇప్పటికే కార్మికులు చాలా రంగాల్లో తగ్గిపోతున్నారు. స్కిల్డ్ లేబర్ దొరకడం కూడా చాలా తగ్గిపోతోంది. ఇటువంటి సందర్భంలో గవర్నమెంట్ ప్రత్యేకంగా కొన్ని కార్యక్రమాలు తీసుకోవడం ద్వారా స్కిల్డ్ వర్కర్స్ విభాగంలోని వారిని ప్రొటెక్ట్ చేసుకోవాల్సిన అవసరముందని మీ ద్వారా తెలియజేస్తున్నాను. అయితే, దీనికి సంబంధించి గవర్నమెంట్ రిజిస్ట్రేషన్ ద్వారా ఎంతమంది

వర్కర్లు ఈ రకమైనటువంటి రంగాల్లో పనిచేస్తున్నారన్నది అసెస్మెంట్ చేస్తున్నామని నివేదికల్లో పేర్కొనడం జరిగింది. అదేవిధంగా అన్ని రంగాల్లో కూడా, ఎవరైతే వీళ్లు పనిచేస్తున్నారో, వాళ్ల వివరాలు, వారి తాలూకు స్థితిగతులు, వాళ్లు అక్కడ పడుతున్న ఇబ్బందులు, మంచి చెడ్డలన్నింటినీ ప్రభుత్వం సెపరేట్ నెట్‌వర్క్ ద్వారా ఏదైతే మన కార్మిక శాఖ ఉందో, దాని ద్వారా మరి కొంచెం బలోపేతం చేసి, ఎటువంటి వివాదాలకు తావు లేకుండా, ఈ కార్మికుల వెల్ఫేర్‌కు సంబంధించి అన్ని రకాల చర్యలూ తీసుకునే కార్యక్రమం చేయాలి. ఎందుకంటే, ఒక కంపెనీలో ఉత్పత్తి రావాలన్నా, ఆ కంపెనీ డెవలప్ అయ్యి, నలుగురికి ఉపాధి కల్పించాలన్నా అది లాభాల బాటలో నడిస్తే తప్ప, ఆ కంపెనీలు నడిచే పరిస్థితి లేదు. నష్టానికి ఏ కంపెనీ నడిపించే స్తోమత ఉండదు. ఇటువంటి సందర్భంలో కార్మికులకు కూడా దాంట్లో భాగస్వామ్యం కల్పించే విధంగా, వచ్చిన లాభాల్లో వారి వెల్ఫేర్ కోసం కొంత కేటాయించినట్లయితే, ఆ కంపెనీ లాభాల్లో నడిస్తే అప్పుడు, వాళ్లు మాక్కూడా ఈ సంక్షేమ కార్యక్రమాలు జరుగుతాయనే నమ్మకం వారిలో కలిగి, ఇంకా ఎక్కువ ఉత్సాహంగా పని చేయడానికి అవకాశముంటుంది. ప్రతి చిన్న విషయాన్ని వివాదాల్లోకి లాక్కొచ్చి, ఆ కంపెనీ లాకౌటయ్యి, ఉత్పత్తే ఆగిపోయే దిశగా చేయకుండా ఉండటానికి, అన్ని రకాల డిమాండ్స్ పరిష్కరించుకునేందుకు ఆ నిధి సరిపోతుంది. కానీ, చాలాచోట్ల చట్టాలున్నప్పటికీ, ఆ రకంగా ఎక్కడా జరిపించడం లేదు. మంత్రి గారు మాత్రం కార్మిక వ్యవస్థపైన సద్భావంతో ఉన్నారు కాబట్టి, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసినట్లయితే, తప్పనిసరిగా చాలా కంపెనీలు ఇంకా ముందుకువచ్చి, రాష్ట్రం ముందుకు వెళ్లడానికి, మన రాష్ట్రంలో ఉత్పత్తి పెరిగి, రాష్ట్ర ఆదాయం కూడా పెరగడానికి, నిరుద్యోగ సమస్య పరిష్కారం అవ్వడానికి అన్నింటికీ కూడా అది ఎంతో దోహదపడుతుందని మీ ద్వారా కోరుతున్నాను.

అలాగే, కొత్తగా కంపెనీలు ఏర్పాటు చేసేటప్పుడు, కొంత లోన్ల రూపంలో గానీ, కొంత సహకారంగా వాటర్, ఎలక్ట్రిసిటీ, ల్యాండ్ వంటి ఫెసిలిటీస్ అన్నీ ప్రభుత్వం ఇస్తుంది. కానీ, ఆ కంపెనీ ఏర్పాటైన తరువాత, ఆ కంపెనీపై ప్రభుత్వానికి నియంత్రణ లేకపోవడం వల్ల చాలా ప్రాబ్లమ్స్ వస్తున్నాయి. చివరికి, ఆ కంపెనీవాళ్లు ఏ రకంగా తయారౌతున్నారంటే – లోకల్‌గా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే, రేపు ఉదయం లోకల్ పేరుతో కంపెనీనే ఉద్యోగులు ఇబ్బందిపెడతారనే భావనతో వాళ్లనెవ్వర్నీ స్థానికంగా ఉద్యోగాల్లోకి తీసుకునే అవకాశం కూడా లేని చాలా సందర్భాలు మా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో కనపడుతోంది. అటువంటి పరిస్థితులు లేకుండా, టాలెంట్‌కు విలువిచ్చే విధంగా, ఏదైతే అగ్రిమెంట్ అయ్యేటప్పుడు, స్థానికులకు ఉద్యోగాలిస్తామని చెప్పి, కంపెనీల వారు అగ్రిమెంట్ అవుతారో, ఆ ప్రకారంగా జరిపించేటట్లుగా ప్రత్యేక కమిటీని ఇటు ప్రభుత్వం నుండి, అటు కంపెనీ నుండి, ఇటు వర్కర్స్ నుండి నియంత్రణ చేయడానికి, సమన్వయం చేయడానికి, ఆ కంపెనీలో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా, వీళ్లు పరిష్కారం చేసి, ఆ కంపెనీ ఉత్పత్తికి ఆటంకం లేకుండా ఉండే విధంగా చేయడం కోసం ప్రత్యేకమైన కమిటీలు ఏర్పాటు చేసి, శ్రద్ధ తీసుకోవాల్సిందిగా మీ ద్వారా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మొన్న హుద్– హుద్ తుఫాన్ వచ్చినప్పుడు, మత్స్యకారులకు సంబంధించి ఎవరెవరు నష్టపోయారనే వివరాలు మత్స్యశాఖని అడిగితే, వారి దగ్గర కొని రిజిస్టర్డ్ వివరాలు మాత్రమే ఉన్నాయి తప్ప, వీధుల వెంట వెళ్లి బళ్ల మీద, తట్టలతో చేపలు తీసుకువెళ్లి అమ్ముకుని వ్యాపారం చేసే వారి వివరాలేవీ లేకపోవడం వల్ల వారు చాలా ఇబ్బందులుపడే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తున్నా అవి వారికి అందజేయలేని పరిస్థితి కనపడింది. అటువంటి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే, మనం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పెట్టుకోవాలి. మత్స్యకారులకు ఆ రకమైన

అవగాహన కూడా ప్రసార మాధ్యమాల ద్వారా కల్పించాలి. ఎందుకంటే, కొబ్బరి కాయల వ్యాపారం కావొచ్చు, కాయగూరల వ్యాపారం కావొచ్చు, రకరకాల కార్యక్రమాల ద్వారా వారు రిజిస్టర్ కాకుండానే వ్యాపారం చేస్తుంటారు. కాబట్టి, అటువంటి వారికి ఇటువంటి నష్టాలు వచ్చినప్పుడు, వారికి ప్రభుత్వ పరంగా ఎటువంటి సాయం అందిద్దామన్నా, చేద్దామన్నా కుదరని పరిస్థితి ఉంది. కాబట్టి, అటువంటి వారిని ఐడెంటిఫై చేయడం మనం తల్చుకుంటే పెద్ద కష్టం కాదు. కానీ, వాళ్లపై మనం శ్రద్ధ పెట్టకపోవడం వల్ల, మనం వాళ్లని రిజిస్ట్రేషన్లు చేయించుకునేలా చూడలేకపోతున్నామని మీ ద్వారా గౌరవ మంత్రి గారికి మనవి చేస్తున్నాను.

పెద్ద, పెద్ద కంపెనీల్లో ప్రమాదాలు తరచూ జరుగుతుంటాయి. ఆ ప్రమాదాలు జరిగినప్పుడు ప్రభుత్వ పరంగా గానీ, కంపెనీ పరంగా గానీ నష్టపరిహారాన్ని అందించి, ఆ తరువాత ఆ కార్మికుని కుటుంబాన్ని గురించి పట్టించుకునే దాఖలాలు ఉండటం లేదు. అలా కాకుండా, ఎవరైతే ప్రాణం కోల్పోయిన వారున్నారో, వాళ్లకి ప్రాణాలు తిరిగి తేలేము గానీ, క్షతగాత్రులైన వారికి ప్రభుత్వ పరంగా వారు చేయగలిగిన ఉద్యోగానికి ఉపాధి అవకాశాలు కల్పించి, ఆ కుటుంబానికి సాయం చేయడంతోబాటు, వారిని అన్ని రకాలుగా ఆదుకునే విధంగా ఒక సిస్టమ్యాటిక్ సిస్టాన్ని ఏర్పాటు చేసి, ఆ రకంగా కార్యక్రమాలు చేయాలని మీ ద్వారా కోరుతున్నాను.

కొత్త టెక్నాలజీ అందుబాటులోకి రావడం వల్ల, ఆయా కంపెనీల్లో పని చేస్తున్న వర్కర్స్‌ని తగ్గించుకునే పరిస్థితి కూడా అప్పుడప్పుడూ వస్తుంది. అలాంటప్పుడు, అక్కడ పనిచేస్తున్న వర్కర్స్‌ని ఆ కంపెనీ తగ్గించుకునేటప్పుడు, మనం ఆ కంపెనీని ఎక్సెస్ ఉంచుకోమన్నా వారు ఉంచుకోలేరు. అలాగని, తొలగించిన కుటుంబాలు రోడ్డు పాలౌతున్నాయన్నా సరైన న్యాయం అక్కడ జరగడం లేదు. అలాంటప్పుడు, ప్రభుత్వమే కల్పించుకుని, వారికి వేరేచోట జీవనోపాధి కల్పించే విధంగా ప్రభుత్వానికి ఉన్న యంత్రాంగం ద్వారా గానీ, ఆ కంపెనీలకున్న పరిచయాల ద్వారా గానీ, ఉపాధి కల్పించే బాధ్యత తీసుకోవాలని మీ ద్వారా నేను కోరుకుంటున్నాను.

అదే విధంగా చాలా చోట్ల కంపెనీల్లో లీడర్‌షిప్‌కు సంబంధించి కొన్ని యూనియన్స్ డెవలప్ అవుతాయి. కానీ, ఆ యూనియన్స్ ఆ కంపెనీకి ఆటంకమౌతున్నాయని యాజమాన్యం భావించి, రకరకాల కార్యక్రమాలతో వారికీ, వీరికీ మధ్య కక్షసాధింపు చర్యలు జరిగేలా పరిస్థితులు కల్పిస్తాయి. అలాంటి వాటిని పరిష్కరించేందుకు, మనం ప్రభుత్వ పరంగా కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయాలని ఏదైతే భావిస్తున్నామో, ఆ కమిటీ ద్వారా ఆ యూనియన్స్ అడుగుతున్నవి జెన్యూనా, కాదా, కంపెనీ నిజంగా సిస్టమ్యాటిక్‌గా వెళుతోందా, లేదా అన్నది అబ్జర్వ్ చేసినట్లయితే, ఆ యూనియన్స్ వాళ్లు కూడా కావాలని వారు తింటున్న తిండిని, వారుంటున్న వ్యవస్థని నష్టపరుచుకునే విధంగా వాళ్లుండరు కాబట్టి, దాని మీద కూడా ప్రత్యేకమైన దృష్టిపెట్టాల్సిన అవసరముంది. కొత్త కంపెనీలు రావాలి, నిరుద్యోగ సమస్య తీరాలన్నది ఎంత ముఖ్యమో, ఆ వచ్చిన ఉద్యోగాలు కాపాడే బాధ్యత కూడా ప్రభుత్వంపైన అంతే ఉంటుందని మీ ద్వారా మంత్రి గారికి మనవి చేస్తున్నాను. మొన్న అరబిందో కంపెనీలో చాలా ఇబ్బందులు వచ్చినప్పుడు, చాలా రోజులు 67 మంది రోడ్డు మీదకు వచ్చి, ఉద్యోగాల్లోకి వెళ్లకపోతే, మంత్రి గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, సంప్రదింపులు జరిపి, వారందరూ తిరిగి ఉద్యోగాల్లోకి వచ్చే విధంగా ఎంతో శ్రద్ధతో, మానవతా దృక్పథంతో పనిచేశారు.

అదేవిధంగా హుద్– హుద్ తుఫాను వల్ల చాలా కంపెనీల్లో ట్రాన్స్‌పోర్టు లేక రెండు, మూడు రోజులు ఎక్సెస్ ఓడీ డ్యూటీ చేసిన వాళ్లు ఉండిపోగా, వారికి ఎటువంటి సాయం కూడా ఆ కంపెనీల

నుండి అందించలేదు. అదేమని వారిని అడిగితే, గవర్నమెంట్ నుండి మాకు ఇవ్వమని ఆదేశాలొస్తే మేము ఇస్తామని చెప్పారు. మరి ఉత్తర్వులు అందాయో, లేదో ఇంకా స్పష్టత లేదు. ఒకవేళ సాయం అందించి, ఓవర్ టైం పే ఇచ్చుంటే సంతోషం. ఒకవేళ అందించకపోతే మాత్రం, తప్పకుండా అందించాలని నేను, మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మ. **12.30**

ప్రకృతి వైపరీత్యం వల్ల ట్రాన్స్‌పోర్టు లేక ఎవరైతే విధులకు హాజరుకాలేకపోయారో తుఫాను మూడు రోజులను వారికి ఓ.డి. ఇవ్వాలని మీ ద్వారా నేను కోరుకుంటున్నాను. ఇటువంటి విపత్తులు వచ్చినప్పుడు పనిచేసిన వారికే జీతం అని కాకుండా మానవతా దృక్పథంతో చూడాలని కోరుకుంటున్నాను. వారు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నా, వినియోగించుకోలేకపోయాము కాబట్టి వారికి ఆర్థిక ఇబ్బంది లేకుండా మానవత్వంతో ప్రభుత్వ పరంగా మరియు కంపెనీల పరంగా చేయవలసిన సహాయం చేయాలని మీ ద్వారా కోరుకుంటూ, ఈ కార్మికులకు సంబంధించి ప్రత్యేకమైన సబ్జెక్ట్‌ను తీసుకుని మన ఆలోచనలను పంచుకున్నందుకు సంతోషంగా ఉన్నది. వారికి ఏ విధంగా మేలు చేస్తే బాగుంటుందనే విషయాలపై చర్చించినందుకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేసుకుంటూ మంచి సూచనలతో కార్మిక వ్యవస్థని రక్షించడం కోసం, వారి జీవితాలు బాగుపడడం కోసం విద్యా, వైద్య, మౌలిక వసతులను కార్మిక కుటుంబాలకు కల్పించడం కోసం ప్రభుత్వం కృషి చేయాలని పెద్దలందరితో చర్చించి, మంచి సూచనలను తీసుకుని మంచి వ్యవస్థని సృష్టించాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బి. చెంగల్ రాయుడు : అధ్యక్షా, చంద్రశేఖర రావు గారు ఇచ్చిన సూచనలు, రాజ్యాంగ పరిధిలో చేయగలిగిన వాటిని త్వరితగతిన భర్తీ చేసే విధంగా కమిటీని కానిస్టిట్యూట్ చేస్తే అంతో ఇంతో ఉపయోగపడుతుందని మీ దృష్టికి తీసుకువస్తున్నాను. ఈ విషయంపై నేను కొంచెం వివరంగా మాట్లాడదామనకుంటున్నాను. ఈ దేశంలో domain expertiseకి ప్రభుత్వ పరంగా డబ్బులు ఖర్చు పెడుతున్నాము. అయితే ఎవరికి పెడుతున్నాము? డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, ప్రొఫెసర్లు, కెమికల్ ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్, సైంటిస్ట్‌లు వంటి వాళ్లకు ఖర్చుపెడుతున్నాము. కానీ, వాళ్ల దగ్గర పనిచేసే వాళ్లకు మాత్రం మనం ఏమీ ఖర్చుపెట్టలేకపోతున్నాము. డాక్టరుకు ఒక డ్రైవరు, వంటవాళ్లు ఉంటారు. ఈ మధ్య ఇండియా టుడేలో వచ్చిన ఒక సర్వే రిపోర్టును చదివాను. అందులో చాలావరకూ నిజాలే వస్తుంటాయి. ఈ domain expertise మీద ప్రభుత్వం 93 శాతం ఖర్చు పెడుతున్నది. రిజల్ట్ కేవలం 12 ½ శాతం వస్తున్నది. స్కిల్డ్ వారిపై 3 శాతం మాత్రమే ఖర్చుపెడుతున్నాము. 97 శాతం మంది మీద ఖర్చులే పెట్టడం లేదు. ఉదాహరణకు డ్రైవర్లు, టైలర్లు, వంటవాళ్లు, కార్పెంటరీ, ఎలక్ట్రీషియన్ వీరంతా అందరికీ కావల్సిన వాళ్లే. వాళ్ల ఖర్చులతోనే వాళ్లు తయారవుతున్నారు. ప్రభుత్వ ఖర్చు చాలా తక్కువగా ఉంటోంది. మనం ఎక్కువ ఖర్చుపెట్టినవాళ్లంతా ఇతర దేశాలకు వెళ్లిపోతున్నారు. Brain drain గురించి మొన్న నేను ప్రస్తావించాను. స్కిల్డ్ లేబర్ కూడా ఇతర దేశాలకు వెళ్లిపోతున్నారు. ఎందుకెడుతున్నారనేది సూటి ప్రశ్న. ఇంతకుముందు ఉన్న ప్రభుత్వాన్ని కూడా నేను ప్రశ్నించాను. భర్తను వదిలేసి భార్య, భార్యను వదిలేసి భర్త, తల్లిదండ్రులను వదిలేసి బిడ్డలు, బిడ్డలను వదిలేసి తల్లిదండ్రులు వెళ్లవలసిన పరిస్థితి ఇక్కడ ఏర్పడింది. కారణమేమిటనేది మంత్రిగారు తమ రిప్లైలో ఇస్తే బాగుంటుంది. పెళ్లి చేసుకున్న మూడో రోజే భర్త వెళ్లిపోతున్నాడు. మళ్లీ వారం రోజులకు వాళ్ల నాయన కూడా ఇతర దేశాలకు వెళ్లిపోతున్నాడు. ఇవన్నీ పల్లెల్లో జరుగుతున్నాయి. ఆర్థికంగా బాగా దెబ్బతినడమే వీటన్నింటికి కారణమని చెప్పక తప్పదు. ఇందుకు సరైన ఆలోచనా విధానం ప్రభుత్వం వద్ద లేనందువల్లనే

ఇటువంటివి జరుగుతున్నాయేమోనని నాకనిపిస్తున్నది. దీనిని దృష్టిలో పెట్టుకుని నేను ఒక చిన్న ఎక్స్‌పరిమెంట్ చేశాను. కోడూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి వెయ్యిమంది పండ్ల వ్యాపారులు, కూరగాయల వ్యాపారస్తులు, టీ కొట్టు వాళ్లను తీసుకుని ఒక ఎక్స్‌పరిమెంట్ చేశాను. కేవలం వెయ్యి రూపాయలు ఉంటే రోజుకు రెండు, మూడు వందలు సంపాదించుకుంటారు. వెయ్యి రూపాయలు వడ్డీకి తీసుకుంటే వడ్డీ ఇచ్చేవాళ్లు రూ.900లు ఇస్తారు. మరుసటి రోజు వెయ్యి రూపాయలు తీసుకుంటారు. రూ.5లక్షలను నా స్వంత పెట్టుబడిగా పెట్టి 500మందికి తలా వెయ్యి రూపాయలు ఇవ్వడం జరిగింది. సాయంత్రానికి నూరు అంటే పది రూపాయల చొప్పున కట్టాలి. ఈ కట్టే 500 x 10 = 5000 వస్తే మరో 5 మందికి ఇవ్వవచ్చు. మొత్తం చూసుకుంటే ఈ అయిదువందల మంది పూర్తయ్యేలోపు మరో 500మంది రెడీ అవుతున్నారు. వీటి మీద మనం చేయాల్సిన పని చాలా పెద్దది. బీదరికంపై మొన్న డా. ఎమ్. గేయానంద్ గారు చెబుతూ institutional development, infrastructure developmentకు ఎక్కువ నిధులు మనం ఖర్చుపెడుతున్నాము, Human development కు తక్కువ నిధులు ఖర్చుపెడుతున్నాము, ఆ గ్యాప్ చాలా పెరిగిపోతున్నది అని అన్నారు. ఇది మా ప్రభుత్వంలోనూ జరిగింది. ఈ ప్రభుత్వంలోనూ జరిగింది, కాకపోతే ఇక్కడ ఇంకొంచెం స్కేల్ పెరుగుతున్నది. ఈ పెరగడానికి గల కారణమేమిటో ప్రభుత్వమే రిప్లై ఇస్తే బాగుంటుందని నేను కోరుతున్నాను. Human Development కింద సాదాసీదా మనిషి బ్రతికేదానికి ఎలాంటి మెరుగైన వసతులు కల్పించగలుగుతున్నామో, వాని బ్రతుకు తెరువుకు ఎలాంటి సౌకర్యాలు కల్పించగలుగుతున్నామో ఆలోచించాలి. ఇవన్నీ మాట్లాడితే రాజకీయం అంటగడుతున్నారు. ఈ రాజకీయాలు అంటగట్టకుండా బీదవాడిని, దరిద్రనారాయణుడిని బయటకు తీసుకురావడానికి ఏ విధమైన చర్యలు ప్రభుత్వం చేపడుతున్నదో వివరించాలని మంత్రిగారిని కోరుతున్నాను. రాష్ట్ర విభజన జరిగిపోయింది. రెండు, మూడు ఆర్గనైజేషన్స్ మా దగ్గరకు వచ్చి వాళ్ల అకౌంట్స్ ఇవ్వడానికి సంకోచిస్తూ, మాకు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ క్లియరెన్స్ లేదని అంటున్నారు. లేబర్ డిపార్ట్‌మెంట్ విషయంలోనే వాళ్లకు క్లియరెన్స్ రావడం లేదని అంటున్నారు. ఒక్కసారి ఆర్థిక శాఖామంత్రి, కార్మిక శాఖా మంత్రి కూర్చుంటే ఆ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని నేను భావిస్తున్నాను. ఎక్కడ తిరిగినా 'లక్ష్మక్క' లేనిదే ఏ పనీ జరగదు. ఆ లక్ష్మక్క లేబర్ చుట్టూ తిరగాలని కోరుకుంటున్నాను. అసంఘటిత కార్మికుల సంఖ్య దినదినానికి పెరిగిపోతున్నది. ఆటో వాళ్లు, వీధి వ్యాపారులు, కొబ్బరికాయల వ్యాపారం వాళ్ల గురించి చెప్పారు. ఇది చాలా మైన్యూట్ విషయం. వీళ్ల గురించి ఆలోచించేటప్పుడు ప్రభుత్వ పరంగా ఏ చర్యలు తీసుకుంటున్నారనేది ముఖ్యం. ఒక ఆటోవాలా ఉన్నాడు. అతను ఎన్ని సమస్యలు ఎదుర్కొంటున్నాడో అవన్నీ లేబర్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించినవి కాకపోయినా కూడా చెప్పాలి. అతను నిద్ర లేచినదగ్గర నుండి వెయ్యి మందికి నమస్కారం పెట్టాలి. వాళ్లు right royal గా బ్రతకడానికి అవకాశాలు లేకుండా పోతున్నాయి. హైదరాబాదులో 24 చెకింగ్‌లు పెట్టారు. మన దగ్గర 18 చెకింగ్‌లు పెట్టారు. ఈ 18 చెకింగ్‌లకు గాను వారు ఎంత కప్పం కట్టాలి? అఫీషియల్‌గా ఎంత కట్టాలి, అనఫిషియల్‌గా ఎంత కట్టాలో ప్రభుత్వం వద్ద ఉన్న సోర్సు ద్వారా ఒక్కసారి స్టడీ చేయవలసిందిగా నేను మంత్రిగారిని కోరుతున్నాను. మంత్రిగారు బాధ్యతలు తీసుకున్న తరువాత కొన్ని effective measurements తీసుకున్నారు. కానీ, వారి చేతులో లేనిది వాళ్లు ఏం చేస్తారు? అధ్యక్షా, రెండు మాటలు చెబుతాను. సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలి. అందుకు కావలసిన వసతులు అన్నీ కల్పించగలిగితే, వాడు ఇల్లు కట్టుకుంటాడు.

మ.**12.40**

ఇసుకరేటు ఆకాశాన్నంటింది. సిమెంటు రేటు ఆకాశంపైన ఉన్నది. ఈ రెండూ లేనిదానివల్ల ఇల్లు కట్టుకునేదానికి వసతి లేకుండా పోయింది. ఇళ్ల నిర్మాణాలు జరగకపోవడం వల్ల లేబర్‌కు పనిలేదు. ఇటుకలు తయారుచేసేవారికి పనిలేకుండా పోయింది. కార్పెంటర్‌కు, ఎలక్ట్రీషియన్‌కు, ప్లంబర్‌కు, కూలిపని చేసుకునేవారికి  కూడా పనిలేకుండా పోయింది. ఇంతమంది శాపాలు తీసుకోవలసిన అవసరం మనకు ఉందా? దీనికి కారణం ఏమిటి? ఒక ఇల్లును కూడా వారు మంజూరుచేయకపోవడం వల్ల ఇంతమందికి కష్టాలు వచ్చాయి. సిమెంటు రేటును తగ్గించమని కోరితే పరిశీలిస్తారా? వారు అధికారంలోకి వచ్చినపుడు సిమెంటు బస్తా ధర రూ.160 లు ఉంటే, అది నేడు రూ. 360 లకు పెరిగింది. దానిపై ఏమి చర్య తీసుకున్నారు? దానిని కూడా తగ్గించలేకపోయారు. బంగ్లాదేశ్ నుంచి సిమెంటును తెప్పించుకుంటే, బస్తా రూ.100లకు దొరుకుతుంది. అటువంటిది ఏదైనా చెబితే కేంద్రప్రభుత్వం నుంచి అనుమతి కావాలంటారు.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, బంగ్లాదేశ్‌లో సిమెంటు గురించి వారు చెబుతున్నారు. జర్మనీ, జపాన్ దేశాల టెక్నాలజీ బాగుంటుందని మేము అంటుంటే వాటి గురించి వారు ఎందుకు ఆలోచించరు?

శ్రీ బి.చెంగల్ రాయుడు : అధ్యక్షా, నేను కంపారిటివ్ స్టడీ చేసి చెబుతున్నాను. ఇప్పుడు టమాటా ధర గౌలిగూడ మార్కెట్‌లో రూ. 10 లు, ఆదర్శనగర్‌లో రూ. 15 లు, శంషాబాద్‌లో రూ.5లు ఉందని పోల్చి చెప్పడం తప్పా? మంత్రిగారు సభలో ఉన్నారు కాబట్టి వారి దృష్టికి తమరిద్వారా నేను ఈ విషయాలను తీసుకువస్తున్నాను. రూ. 160 ల సిమెంటు ధరను మేము వారికి అప్పజెబితే, ఈ పొద్దు దానిని రూ. 360 లకు వారు పెంచారు. ట్రాక్టర్ ఇసుకను రూ.2 వేలకు వారు పెంచారు. ఏ ముఖం పెట్టుకుని వారు ప్రజల దగ్గరకు వెళతారు. కూలీలకు పనిలేదు, తాపీ మేస్త్రీలకు పనిలేదు, కార్పెంటర్‌లకు పనిలేదు. దీనికి సమాధానం వారు ఏమి చెబుతారు?

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, ఇంతకుముందు నుంచి వారు మాట్లాడుతున్నది ఈ ప్రభుత్వ హయాంలో జరిగిన వాటి గురించా లేక వారి ప్రభుత్వ హయాంలో జరిగిన వాటి గురించా చెప్పమనండి.

శ్రీ బి.చెంగల్ రాయుడు : అధ్యక్షా, వారి ప్రభుత్వంలోనే జరిగినవని నేను చెబుతున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, గత 10 సంవత్సరాలు వారు అధికారంలో ఉన్నారు. ఆ 10 సంవత్సరాలు వారు కార్మికులకు ఏమిచేశారో చెప్పమనండి.

శ్రీ బి.చెంగల్ రాయుడు : వారి ప్రభుత్వంలోనే ఆ ధరలు పెరిగాయని నేను సవాలు చేస్తున్నాను. మే నెల, 2014వ సంవత్సరంలో సిమెంటు బస్తా ధర రూ. 160 లు ఉండేది. అది రికార్డుల్లో కూడా ఉన్న వాస్తవం. దానిని వారు ఈనాడు రూ. 360 లకు పెంచారు. ఈ 9 నెలల కాలంలో రూ. 200 ల చొప్పున ఒక బస్తా సిమెంటు ధర పెరిగిందని నేను చెబుతూంటే, గత 10 సంవత్సరాలలో ఎంత పెరిగిందని వారు అడుగుతున్నారు. గత 10 సంవత్సరాలలో సిమెంటు బస్తా ధర రూ. 100 నుంచి రూ. 160 కు పెరిగింది. నేను ఈ సందర్భంగా గతంలో జరిగిన ఒక వాస్తవం గురించి కూడా చెప్పాలి. గతంలో సిమెంటు ధర రూ. 100 లకు తమిళనాడులో అమ్ముతుంటే, రూ. 140 లకు మన రాష్ట్రంలో అమ్మేవారు. దాని ధర తగ్గిస్తారా అని సభలో అడిగితే, తప్పనిసరిగా మేము సిమెంటు బస్తా ధరను తగ్గిస్తామని శ్రీమతి గీతారెడ్డిగారు సమాధానమిచ్చారు. రూ.140

లున్న సిమెంటు బస్తా ధరను ఎంతవరకూ తగ్గించవచ్చని కమిటీ ఛైర్మన్‌గా నేను వారందరినీ ఎంక్వైరీ చేస్తే, రూ.90 ల వరకూ తగ్గించవచ్చని వారు ఒక రిపోర్టును కూడా కమిటీకి సమర్పించారు. ఆ రిపోర్టును నేను హామీల కమిటీకి కూడా సమర్పించాను. అండర్‌గ్రౌండ్ ట్యాక్సులు పెరగడం వల్ల రూ.360లకు ఒక బస్తా సిమెంటును అమ్ముతున్నారు. ఇవన్నీ దయచేసి వారిని గుర్తుపెట్టుకోమనండి. వారు 10 జి.ఓ.లను జారీచేసి ఇసుక రేటును ఎంతవరకూ పెంచారు? ఇసుక ధరను ఒక క్యూబిక్ మీటర్‌కు రూ. 650 లకు, ఏటిలో లభించే ఒక ట్రాక్టర్ ఇసుకను రూ.2 వేలకు ఎవరు పెంచారు? ఏటిలో ఉన్న ఇసుకను వారు పండించారా? పైరు పెట్టారా? నారు నాటారా? కోత కోసినారా? దుక్కి దున్నారా? భూగర్భంలో ఉన్నవాటిపై వారికి హక్కు ఉంది కానీ భూమిపై ఉండే వాటిపై వారికి హక్కు లేదు.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: అధ్యక్షా, వారి కాలంలో బంగారం రేటు ఎంత ఉన్నదో, ఇప్పుడు ఎంత ఉన్నదో మేము కూడా చెప్పగలం. సిమెంటు ధర ఒక్కటే పట్టుకుంటే చాలదు. మిగిలిన అన్ని వస్తువుల గురించి కూడా చెప్పమనండి. నేడు పేదవాళ్లకు మరుగుదొడ్లు మరియు గృహాలు కట్టిస్తున్నది మా ప్రభుత్వమే. రూ.200 ల నుంచి రూ 500 లకు, రూ.500 ల నుంచి రూ.1500 లకు పెన్షన్లను మేమే పెంచాము.

శ్రీ సి.రామచంద్రయ్య : అధ్యక్షా, పేదవాడు ఇల్లు కట్టుకోవడానికి ఇసుక గురించి సభ్యులు మాట్లాడుతుంటే, సోదరి బంగారం గురించి మాట్లాడుతున్నారు. ఇసుక ఏట్లో దొరుకుతుంది. బంగారం అంతర్జాతీయ మార్కెట్‌లో లభిస్తుంది.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, వారి ప్రభుత్వ హయాంలో ఇసుక మాఫియా ఏ విధంగా ఉండేదో వారికి తెలియదా? వారు బాగానే చేశారు. మరి ఒక్కరు కూడా ఎందుకు గెలవలేదు?

శ్రీ సి.రామచంద్రయ్య: అధ్యక్షా, మా పెర్ఫార్మెన్స్ బాగాలేక కాదు. వారి విషప్రచారానికి జవాబు చెప్పలేక అలా జరిగింది. వారి 10 సంవత్సరాలు, మా 10 సంవత్సరాలు పెర్ఫార్మెన్స్ చూడమనండి. నేను చెప్పడం లేదు. శ్రీ చంద్రబాబునాయుడు గారు పెట్టిన ఎకనమిక్ సర్వే రిపోర్టును చూసి మాట్లాడమనండి.

శ్రీ బి.చెంగల్ రాయుడు: అధ్యక్షా, నేను 2X2 = 4 అని చెబుతున్నాను. వారికి ఓపిక ఉంటే వినమనండి. లేకపోతే 2X2 = 6 అని వారికి అవకాశం వచ్చినపుడు చెప్పమనండి.

శ్రీ నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, వారు 2X2 = 8 అని చెబుతున్నారు.

శ్రీ బి.చెంగల్ రాయుడు : అధ్యక్షా, బంగారం రేటు లండన్ మార్కెట్‌లో ఫిక్స్ అవుతుంది. గౌరవ సభ్యురాలికి ఆ విషయం తెలుసు. మన ఏట్లో లభించే ఇసుక ధరను మనం ఫిక్స్ చేస్తాము. కమిటీ సిమెంటు బస్తాను రూ.90 ల రేటుకు రికమెండ్ చేసింది. రూ.140 ల ధరకు అమ్మేటపుడు పరిశ్రమల మంత్రిగా శ్రీమతి గీతారెడ్డిగారు ఉన్నప్పుడు ఆ ధరను తగ్గిస్తామని హామీ కూడా ఇచ్చారు. హామీల కమిటీ సిమెంటు ధరను రూ.90 లకు తగ్గించాలని రికమెండ్ చేసింది. ఇప్పుడు సిమెంటు బస్తా ధర రూ.360 లు. వారు పేదవారికి ఇళ్లు ఎలాగూ ఇవ్వరు. మాకు తెలుసు. ఇసుక మరియు సిమెంటు ధర తగ్గిస్తే బీదవారు ఇళ్లను నిర్మించుకుంటారు. సుమారు 6 లక్షల గృహాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ పెండింగ్‌లో ఉన్న గృహాలు పూర్తిచేయాలంటే వారికి కనీసం 20 సంవత్సరాలు పడుతుంది.

మ. **12.50**

మీరు ఇవ్వలేరు కాబట్టి ఇళ్ళు ఇవ్వలేమని చెప్పండి వాళ్ళ తంటాలు వాళ్ళు పడతారు. లేకపోతే ఇసుక మీరే తోలుకొచ్చుకోమని చెప్పండి.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : మేము అర్హులకు ఇస్తాం. మీరు ఒక్కొక్కరికి నాలుగు ఇళ్ళ చొప్పున ఇచ్చారు.

శ్రీ బి.చెంగల్‌రాయుడు : మీరు ఎంతమందికైనా ఇళ్ళు ఇచ్చుకోండి. కానీ ఒకపక్క ఆరులక్షల మంది వరకూ పునాదులు, స్లాబులు వేసుకుని ఉన్నారు. వాళ్ళవి ముందు పూర్తిచెయ్యండి. అదీ వాళ్ళు అర్హులైతేనే ఇవ్వండి. లేకపోతే ఇవ్వద్దు.

(ఈ దశలో గౌరవ సభ్యురాలు శ్రీమతి నన్నపనేని రాజకుమారి మాట్లాడడానికి అవకాశమివ్వమని కోరసాగారు)

శ్రీ బి.చెంగల్‌రాయుడు : ముందు నన్ను పూర్తిచెయ్యనివ్వండి. దండంపెడతాను. కొంచెంసేపు మాట్లాడకుండా ఉండండి.

అధ్యక్షా, నేను ఒక్కొక్క ఇంటి గురించి మాట్లాడడానికి ప్రయత్నం చేస్తాను. గత సమావేశంలో నేను ఒక ప్రశ్నవేశాను. తూర్పుగోదావరి జిల్లాలో టపాకాయలు తయారుచేసే పరిశ్రమ కాలిపోతే దాదాపు 18మంది చనిపోయారు. ఒక ఆరు, ఏడుమంది గాయాల పాలయ్యారు. 18మందికి ఇంత డబ్బు ఇచ్చామని, ఒకటిన్నర ఎకరం పొలం ఇచ్చామని మంత్రిగారి నుండి స్పష్టమైన సమాధానం వచ్చింది. అయినా నాకున్న దర్యాప్తుచేసే అలవాటు వల్ల అక్కడున్నటువంటి మా మిత్రులకు ఒక ఫోన్‌చేసి ఆ లిస్టు పంపించి, భూములు ఎక్కడున్నాయో ఒకసారి చూసిరమ్మని వారికి చెప్పాను. పేపర్లో ఇచ్చినట్లు చూపించినా, భూములు చూపించలేదని తెలిసింది.

శ్రీ ఎన్.చినరాజప్ప : నేను ఆరోజే డైరెక్షన్ ఇవ్వడం జరిగింది. అలాగే అక్కడున్న బాధితులందరికీ వెంటనే డబ్బులు అందచేయడమేగాక, భూమి కూడా ఇవ్వడం జరిగింది. మీకు ఎవరు చెప్పారో కానీ అది తప్పు. ఖచ్చితంగా పట్టాకూడా ఇవ్వడం జరిగింది.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, గౌరవ సభ్యులు చెంగల్‌రాయుడుగారు సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆయనను కూర్చోమని చెప్పండి.

శ్రీ బి.చెంగల్‌రాయుడు : నేను సభను తప్పుదారి పట్టించేటట్లుగా ఉంటే తూర్పు గోదావరి జిల్లాలో కార్మికులు పనిచేస్తున్నచోటే వారు చనిపోతే నేను ప్రశ్న వేయాల్సిన పనేముంది. మంత్రిగారు ఇచ్చారని నేను చెప్తున్నాను. డబ్బులివ్వడం, భూములిచ్చినట్లు పత్రాలు ఇవ్వడం వాస్తవమే. కానీ ఆ కార్మికులకు భూములు చూపలేదని అన్నాను. మీరు చూపించామంటున్నారు. భూమిని స్వాధీనం చేస్తున్నట్లు కాగితంలో ఇచ్చారు కానీ, అక్కడి కార్మికులకు దానిని స్వాధీనం చేయలేదని నాకు వచ్చిన సమాచారం.

మీరేదో అన్ని దేశాలకు వెళ్ళివచ్చారు. పరిశ్రమలు పెడతామని చెప్పారు. ఎందుకంటే భారతీయ జనతాపార్టీకి, తెలుగుదేశానికి చాలా బంధం ఉంది. ఆ బంధం పెరిగి పెద్దదై తాటికాయంత అయ్యింది. నేనేమీ వద్దని చెప్పలేదు. మన్నవరం ప్రాజెక్టును యుపిఏ-1 ప్రభుత్వం ఇచ్చింది. ఈ ప్రాజెక్టుకు మనం పదివేల ఎకరాలు ఇచ్చాము. రూ.6800కోట్లు ఇస్తే రూ.200 కోట్లకు కుదించి దానిని మూసేశారు. అక్కడ కార్మికులు లేరు. భారతీయ జనతాపార్టీ

వచ్చాక మూసేశారు. దానిని మహారాష్ట్రకు తరలించారు. లక్ష మంది కార్మికులకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉపాధి కల్పిస్తామని ఈ కౌన్సిల్‌లోనే మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డిగారు స్టేట్‌మెంట్ ఇచ్చారు.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : వాళ్ళకి ఎన్ని ఎకరాలు ఇచ్చారు?

శ్రీ బి.చెంగల్‌రాయుడు : ఆరోజుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పదివేల ఎకరాలు వారికిచ్చింది. మాకు కొత్తదేమీ అక్కర్లేదు. దానిని ఇంప్లిమెంట్ చేయండి చాలు. మీ బంధాన్ని పెంచుకుని తెచ్చుకోండి. మీరు అడగలేకపోతున్నారు. మీరు ప్రభుత్వాన్ని అడగడానికికూడా సిగ్గు పడుతున్నారు.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : మేమేమీ సిగ్గుపడడంలేదు. మీరు ఇక్కడా, అక్కడా ఉండి ఏమీ తేలేదు. మేము అక్కడా, ఇక్కడా లేకపోయినా కూడా పొత్తుపెట్టుకున్నాం.

శ్రీ బి.చెంగల్‌రాయుడు : అక్కడా మీరే, ఇక్కడా మీరే ఎందుకమ్మా? అధ్యక్షా, పోతనామాత్యులవారు ఒక విషయం చెప్పారు. రేపు శ్రీరామనవమి ఉత్సవాలు జరుగుతున్నాయి కాబట్టి ఒక్కసారి ఆయన్ని గుర్తుచేసుకోవాలి.

**"అడిగెదనని కడువడిజను అడిగిన తన మగడు నుడువడని వెడనుడుగున్, వెడవెడ జడముడి తడబడ అడుగిడదు, జడిమ నడిగుడు నెడలన్"**

శ్రీ నన్నపనేని రాజకుమారి : 10,000 ఎకరాలు ఎట్లా ఇస్తారు? మీ ప్రభుత్వంలో ఎక్కడెక్కడ ఎంతిచ్చారో వివరాలన్నీ తీయండి. ఎన్నివేల ఎకరాలు ఇచ్చారో చెప్పండి. మొత్తం చెప్పండి. ఊరికే నోరుందికదా అని, పదిమంది అక్కడున్నారని మాట్లాడడంకాదు. మొత్తం ఎన్నివేల ఎకరాలు ఇచ్చారో? మీరేమో పొలం ఇచ్చారంట. మేము ఉద్యోగాలివ్వాలంట.

శ్రీ ఎం.సుధాకర్‌బాబు : ఆయన చెప్పేది వినమ్మా.

మిస్టర్ ఛైర్మన్ : సుధాకర్ మీరు కూర్చోండి. ఆయన చెప్తారు. మీరెందుకు లేస్తారు.

శ్రీ బి.చెంగల్‌రాయుడు : ప్రైవేటువాళ్ళకి ఇవ్వలేదు.

మిస్టర్ ఛైర్మన్ : మీరు చెప్పిన పద్యం నాకు అర్థమైంది. అలాగే సుమతీ శతకంలో ఒక పద్యముంది. "ఒడిగల రెండెద్దులు కట్టుకుని మడి దున్నగ బ్రతకవచ్చు మహిలో సుమతీ" అదేగదా మీరు చెప్పింది. దానికి గడబిడ చేసి గందరగోళం చేస్తున్నారు.

(అంతరాయం)

శ్రీ రుద్రరాజు పద్మరాజు : (శాసనసభ నియోజక వర్గం) శాసనమండలిలో చర్చలాగా లేదు. కవి సమ్మేళనంలాగా కనిపిస్తోంది నాకు.

శ్రీ బి.చెంగల్‌రాయుడు : కవి సమ్మేళనమైనా అర్థవంతమైన చర్చ జరగాలి. పోతనామాత్యులుగారు ఏమన్నారంటే "శ్రీ మహావిష్ణువు కొత్తగా పెళ్ళిచేసుకుని పాన్పుమీద ఉన్నాడు. ఈ పెళ్ళికొడుకు కొంగు పెళ్ళికూతురు కొంగుకి ముడిబెట్టి ఉన్నారు. అప్పుడు గజేంద్రుడు ఘోరుమని అరుస్తున్నాడు. నా భక్తుడ్ని నేను కాపాడాలని చెప్పి శ్రీ మహావిష్ణువు పరిగెత్తాడు".

మిస్టర్ ఛైర్మన్ ః దానికి సింపుల్‌గా చెప్పారు. నీవు చెప్పిన పద్యం చెప్పలేదు. "సిరికిన్ జెప్పడు, శంఖ చక్ర గదాయుధములు చేదోయి సంధింపడు" అనే పద్యం చెప్పారు.

శ్రీ బి.చెంగల్‌రాయుడు ః శ్రీ మహావిష్ణువు ఎవరికీ చెప్పకుండా పరిగెత్తేటప్పుడు, ఆయన వేగంగా వచ్చేటప్పుడు ఆయన వస్త్రాలకు, ఆ తల్లి వస్త్రాలకు ముడిపెట్టి ఉన్నందున ఆ తల్లి చీర ఊడిపోయే పరిస్థితి వచ్చింది. అప్పుడు రాసినటువంటి పద్యమిది. "అడిగెదునని కడువడిగెను" ఆ తల్లి నేను అడగలేదు నా మొగుడ్ని ఇదేందయ్యా నా చీరెతో నన్ను పరిగెత్తమని అనుకుంది. "అడిగిన తన మగడు నుడువడగని వెడనుడుగున్" తన మొగుడు భక్తుడ్ని కాపాడేదానికి పరిగెత్తుతున్నాడు. ఏమైనా అంటే ఏమంటాడో ఏమో. అయినాకూడా నేనుకానీ అడక్కపోతే ఈ చీర ఊడిపోయే పరిస్థితి ఉంది. అయినా అడగాలని నిర్ణయించుకుంది.

మిస్టర్ ఛైర్మన్ ః గజ ప్రాణావనోత్సాహియై. ఇప్పుడెవరున్నారు గజమిక్కడ.

శ్రీమతి నన్నపనేని రాజకుమారిః అధ్యక్షా, ఆ పద్యం చెప్పారు కదా. అది ఎవరికి వర్తిస్తుంది. కొంచెం వివరంగా చెప్పమనండి. పదేళ్ళు అక్కడా, ఇక్కడా అధికారంలో ఉన్నవారు వారు. మేము వచ్చి ఆరునెలలైంది. ఆరునెలల్లో అరచేతిలో వైకుంఠం మేము చూపించుకోదలచుకోలేదు. మేము చేతల్లో చూపిస్తాం. ప్రజలు మమ్మల్నిక్కడ, మిమ్మల్ని అక్కడ కూర్చోబెట్టారు. కానీ మరీ అడ్డగోలుగా మాట్లాడుతూ, వాళ్ళేదో బ్రహ్మాండంగా చేసి, మేం చెడగొడుతున్నారంటే నమ్మడానికి ప్రజలేం పిచ్చివాళ్ళుకాదు. కాబట్టి పద్యాలు, శ్లోకాలూ నేను కూడా బాగా చెప్పగలను.

శ్రీ సి.రామచంద్రయ్య ః చెప్పనీయండి. అది ఎంటర్‌టైన్‌మెంటే కానీ దానికి కూడా అభ్యంతరమెందుకు? మీరూ చెప్పండి మేము కూడా సంతోషంగా వింటాము.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి ః మరీ అంత చెప్తే ఎలా?

శ్రీ సి.రామచంద్రయ్య ః ఎట్లాగూ ఏం చెప్పినా ప్రతికలవాళ్ళు రాయరు. ఇక్కడ విలేకర్లు రాసినా అక్కడ పత్రికలో వెయ్యరు. కాబట్టి కనీసం మనం సంతోషపడదాం.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి ః మనకు ఇవాళ కాదు. శాసనమండలి వచ్చిందగ్గర్నుంచీ కూడా ఏమీ రాయరని తెలుసు. వీళ్ళు అక్కడ ప్రెస్‌గ్యాలరీలో కూర్చుంటారు. రాస్తారో లేదో, వింటారో లేదో తెలియదు. ఇంతవరకూ పత్రికలో ఎప్పుడూ రాయలేదు. అయినా రాయమని అడుగుతూనే ఉన్నాం. చాలాసార్లు విజ్ఞప్తి చేశాం. దాంట్లో రాస్తారని కాదు మనం మాట్లాడేది. హృదయంలో నుండి వచ్చే మాట ఇది.

శ్రీ యండపల్లి శ్రీనివాసులురెడ్డిః వాళ్ళు చెప్పినట్లు మనం మాట్లాడుకుంటే రాస్తారు.

మ.**1.00**

శ్రీమతి నన్నపనేని రాజకుమారి ః వాస్తవాలు కూడా బయటికి రావాలి. కానీ అవాస్తవాలు రాకూడదు కదా. అధ్యక్షా, వాళ్ళకి ప్రజలు మొన్న ఎందుకు గుణపాఠం చెప్పారంటే పదేళ్ళు అక్కడా, ఇక్కడా చూసి "అక్కరకురాని చుట్టము, మ్రొక్కిన వరమీయ్యని వేలుపు, మోహరమున తానెక్కిన బారని గుర్రము, గ్రక్కున విడవంగ వలయు గదరా సుమతీ" అని ప్రతి సమావేశంలో కూడా చెప్పేదానిని.

శ్రీ సి. రామచంద్రయ్య ః అక్కరకు రాని చుట్టము ఢిల్లీలో ఉంది.

శ్రీమతి నన్నపనేని రాజకుమారిః అక్కరకు రాని చుట్టమని ఆ ప్రభుత్వాన్ని అక్కడ కూర్చోబెట్టి మమ్మల్నీ అధికారంలోకి తీసుకొచ్చారు. మేము ఇంకా నాలుగు సంవత్సరాల నాలుగు నెలలు ఉంటాము. అప్పుడు అక్కడా, ఇక్కడా కూడా ఉంటే ప్రజలు ఆ పద్యాన్ని చదువుకుని, పెద్దలు చెప్పారు కదా అని వాళ్ళకి గుణపాఠం చెప్పి ఒక్క సీటుకూడా రాకుండా కూర్చోబెట్టారు. ప్రజలు ఎవర్ని నమ్మారో అర్థం చేసుకోండి. ఇంకా కథలు చెప్తే నమ్మరు. దేనికైనా ఒక సమయముంటుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నీ ఇచ్చేస్తారా?

శ్రీ బి.చెంగల్‌రాయుడు ః ఒక అర్థగంటసేపు ఓపిక పట్టమ్మా.

మిస్టర్ ఛైర్మన్ ః మీరు ముగించండి. మంత్రిగారి సమాధానంకూడా ఉంది.

శ్రీ సి.రామచంద్రయ్య ః అలాగైతే కరువుగురించిన చర్చ ఈ దినం చేపట్టరా?

మిస్టర్ ఛైర్మన్ ః లేబర్ సమస్యల గురించిన చర్చ పూర్తయితే ఈరోజు చేపట్టేది లేనిదీ చెప్తాను.

శ్రీ బి.చెంగల్‌రాయుడు ః అధ్యక్షా, ఇండియాటుడేలోనే ఒక సర్వే వచ్చింది. ఆ సర్వే కూడా మీరు చదవండి. భారతదేశం నిరుద్యోగ యువతను చాలా త్వరితగతంగా ఉత్పత్తి చేస్తున్నదని, ఇంతకుముందు మామూలు పట్టభద్రులుంటే, ఇప్పుడు ఇంజనీరింగ్ పట్టభద్రులు, యం.బి.ఎ పట్టభద్రులు, పోస్టు గ్రాడ్యుయేట్స్ ఇలా వివిధ పట్టభద్ర నిరుద్యోగులున్నారు. దీనికంతటికీ మూలమేంటంటే మనం 2,50,000 ఉద్యోగాలు, ఇంటికొక ఉద్యోగం చొప్పున ఇస్తామన్నాము కానీ వాటిగురించి ఎక్కడా ప్రస్తావన లేదు. కాబట్టి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా శ్రద్ధ తీసుకుని కనీసం నిరుద్యోగులకు చిరుద్యోగం కల్పించేదానికి, చిరుద్యోగం లేకపోయినా అంతో ఇంతో బువ్వ కల్పించేదానికి మీరు ప్రయత్నం చేస్తారని చెప్పారు కాబట్టి వాటిగురించి కూడా కొంచెం ఎక్కువ శ్రద్ధ చూపించమని నేను కోరుతున్నాను.

లేబర్ పాలసీ గురించి నేను ఏమి మాట్లాడినా మీకు మేలే జరుగుతుంది. కీడు జరగదు. మీరు ఇది చెయ్యలేదు కాబట్టి చెయ్యండి అని అడుగుతున్నాం. ఈ కార్మికుల వర్గానికి ఇవ్వాల్సిన వసతులగురించి ఒక్కొక్కటే చెప్తాను. ఒక అయిదు నిమిషాలు నేను మాట్లాడతాను.

మిస్టర్ ఛైర్మన్ః ఇంకా చాలామంది మాట్లాడాల్సి ఉంది. మంత్రిగారు సమాధానం కూడా ఇవ్వాల్సి ఉంది. త్వరగా ముగించండి.

శ్రీ బి.చెంగల్‌రాయుడుః అధ్యక్షా, ఈ అవకాశం కల్పించినందుకు మీకు ధన్యవాదాలు తెలుపుతూ నేను సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి ః అయిదు నిమిషాలే కదా సార్. పూర్తి చెయ్యనివ్వండి.

శ్రీ సి.రామచంద్రయ్య ః సార్, పూర్తిచెయ్యనివ్వండి.

శ్రీమతి పమిడి శమంతకమణి ః ఆయన్ను పూర్తి చెయ్యనివ్వండి సార్. అయిదు నిమిషాలే కదా.

మిస్టర్ ఛైర్మన్ ః చెంగల్‌రాయుడుగారూ, పూర్తిచెయ్యండి.

శ్రీ బి.చెంగల్‌రాయుడు ః అర్థగంట సమయమివ్వండి. నేను పూర్తిచేసేస్తాను.

MR CHAIRMAN : Then, tomorrow, we will take up Drought Subject.

శ్రీ బి.చెంగల్‌రాయుడుః అధ్యక్షా, ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ 975 కి.మీ సముద్రతీర ప్రాంతం. మత్స్యకారులయొక్క సాధకబాధకాలు చెప్పాల్సిన ఆగత్యం మనమీద ఉంది. మత్స్యకారులు అసంఘటిత కార్మికులు. ఈరోజు ఈ రాష్ట్రానికి ఎక్కువ విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నటువంటిదాంట్లో మత్స్యశాఖ ఒకటి. గతంలో నేను వెటర్నరీ విశ్వవిద్యాలయం గవర్నింగ్ బాడీలో పనిచేశాను. కాబట్టి కొన్ని టూర్లు చేసి, పరిశీలించిన అంశాలను మీ దృష్టికి తీసుకు వస్తున్నాను. చేపలు పట్టుకునేవారికి మనం ఏ రక్షణ కల్పిస్తున్నాం. హుద్ హుద్ తుఫానులో నష్టపోయినవాళ్ళు ఎవరు? హుద్ హుద్ తుఫానుతోపాటు, ఎక్కడ అలజడి లేచినా, సముద్రంలో అలజడి వచ్చినా మొట్టమొదటిసారిగా తరలించబడేవారు ఎవరు? వాళ్ళయొక్క కార్యకలాపాలు మన కార్మిక చట్టాల పరిధిలోకి వస్తాయా? రావా? వస్తే మనం తీసుకున్నటువంటి ప్రమాణాలు ఏమిటి? ఆ పూనింగ్ సీజన్‌లో అంటే చేపలు గర్భం దాలుస్తున్న రోజులలో అంటే ఏప్రిల్ నెలలో అనుకుంటాను మనం మత్స్యకారుల కుటుంబానికి 35కిలోల బియ్యం ఇచ్చేవాళ్ళం. దానిని 60కిలోలకు పెంచాలని అనుకున్నాం. ఒక నిర్ణయాత్మకమైన చర్చ జరిగినప్పుడు పరిశీలిస్తామని ఆనాటి ప్రభుత్వం చెప్పింది. అయినా ఈరోజుకి కూడా మత్స్యకారులకు సంబంధించి ఏ విధమైన చర్యలూ తీసుకోలేదు.

తుఫాను వస్తోందంటే 10కిలోమీటర్ల దూరం నుంచి ఎక్కడో ఉన్న వాళ్ళను తీసుకుపోయి దూరంగా పెట్టడానికి, నీడను కల్పించడానికి మనం ప్రయత్నాలు చేస్తున్నాం కానీ వాళ్ళ జీవన స్థితిగతుల గురించి ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. మత్స్యకారుల కుటుంబం నుంచి వచ్చిన ఒక అఖిలభారత సర్వీసు అధికారి మత్స్యకారుల గురించి చెప్పిన మాట ఉదహరిస్తాను. "ఏదో కూటికో, నోటుకో వాళ్ళకు దొరికినటువంటి మంచి చేపలన్నింటినీ వారు అమ్ముకుని, అమ్ముడుపోని, స్టోరేజి చేయలేనటువంటి చేపల్ని వాళ్ళుతిని ఇతరులకు మంచి చేపల్ని పంపిస్తున్నారు. పెద్ద పెద్ద దొరలు, విదేశీయులంతా తమ చేపలను తింటున్నారని, ముఖ్యంగా పశ్చిమబెంగాల్‌లోని వాళ్ళంతా తమ చేపలు, రొయ్యలే తింటున్నారని, అయినా తమ బిడ్డలకు మటుకు చదువు సంధ్యలూ, పాఠశాలలు సక్రమంగా లేవని, తమను రక్షించుకునే అవకాశమే లేదని" ఆ అధికారి చెప్పారు. రెండు, మూడుసార్లు మన బలశాలి ఇందిరగారు కూడా చెప్పారు. ఆమె ఇప్పుడు సభలో లేరు కానీ ఆమెచేత కూడా ఈ విషయం మాట్లాడించి ఉంటే ఇంకా బాగుండేది.

మొత్తం మత్స్యకారుల వర్గం నిర్లక్ష్యానికి గురైంది. వారి చదువు, సంధ్యల విషయంలో తగు చర్యలు తీసుకోవడంలేదు. వాళ్ళను సామూహికమైన గురుకుల పాఠశాలలకు తీసుకువచ్చి ప్రత్యేకంగా చదివించాల్సిన అవసరం, ఆగత్యం మనమీద ఉంది. వాళ్ళకు ఇస్తున్నటువంటి డీజల్‌లో కూడా కోత పెట్టేశారు. ఇది మహా అన్యాయమని చెప్పి మీ దృష్టికి నేను తీసుకువస్తున్నాను.

రైతుకు, కూలికి అవినాభావ సంబంధముంది. కూలిలేనిదే రైతు పంట పండించుకోలేరు. ఒక యాభై సెంట్లవరకైతే తానే చేసుకుని తానే బ్రతకగలుగుతాడు. ఇది కూడా అసంఘటితమైన కార్మిక వర్గానికి చెందినది. రైతుకూలీలు అనధికార వర్గాలవారే. వాళ్ళగురించి ఏమైనా ఆలోచన చేశామా? మేము యు.పి.ఏ ప్రభుత్వంలో ఎన్.జి.ఆర్.ఇ.యస్ పథకాలను తీసుకువచ్చాము. ఏదో వాళ్ళకు 50, 100, 150 రోజులు పని కల్పించే పథకం తీసుకువచ్చాం. పనిచేసినన్ని రోజులూ రోజుకు రూ.165 చొప్పున ఇచ్చేవారం. ఎండాకాలంలో రేట్లు పెంచాం. గత సంవత్సరం 34లక్షల

మందికి 100 రోజులు పనికల్పిస్తే, ఈసారి 8లక్షలమందికి కుదించేశారు. బడ్జెట్ బుక్‌లో మీరు చూడవచ్చు. నాకు అబద్ధాలు చెప్పాల్సిన ఆగత్యంకానీ, సత్యదూరమైన విషయాలు మాట్లాడాల్సిన అవసరంకానీ మాకులేదు. నూటికి నూరుపాళ్ళు సత్యాన్ని మీకు చెప్తున్నాను. బడ్జెట్‌బుక్‌లోని పేజీ నెంబర్, పేరా నెంబర్ మీకు చెప్పి ఉన్నాను. అదికూడా చూపించమంటే చూపిస్తాను. 8లక్షల మందికి కుదిస్తారా? 8లక్షల మందికి ఎన్నిరోజులు ఇచ్చారు? మనమిచ్చిన బడ్జెట్ కేటాయింపుల ప్రకారం చూస్తే 75రోజులు వస్తోంది. కేంద్రప్రభుత్వం కోత కోసింది కాబట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోత కోసింది. సార్, ఇది కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం. కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10శాతం ఖర్చును భరిస్తుంది. గత సంవత్సరం రూ.3,800కోట్లతో మనం చేపడితే ఈరోజు దానిని తగ్గించారు. వాళ్ళు ఎలా బ్రతకాలి?

తుళ్ళూరుప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక మంచి నిర్ణయం తీసుకుంది. అందుకు వారిని అభినందిస్తున్నాను. భూములు లాక్కున్నారు. భూములు ఇచ్చిన వాళ్ళ పరిస్థితి, లాక్కున్నవారి పరిస్థితి ఏం జరుగుతుందో మనమందరమూ చూస్తున్నాం. అక్కడున్నటువంటి కార్మికులకు నెలకు రూ.2500 వాళ్ళకి ఇస్తామని చెప్తున్నారు.

మిస్టర్ ఛైర్మన్ : మీరు పాయింట్ టు పాయింట్ ప్రజంటేషన్ చేయకండి.

శ్రీ బి.చెంగల్‌రాయుడు : ముగిస్తున్నాను సార్. Labour is a Labour. ఎక్కడైనా ఆ వసతి ఉంటుంది. రైతుకూలీలకు ఇదే పథకాన్ని ఈరోజు కాకపోయినా రేపైనా మీరు రాష్ట్రమంతా విస్తరింపచేస్తారా? భూమిలేని వాళ్ళ కష్టాలలో కూడా ప్రభుత్వంవారు ఆదుకుంటారా?

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : పాత ప్రభుత్వాన్ని అడుగుతున్నారాయన. పనికి ఆహార పథకంలో ఎంత న్యాయం చేశారో, ఎంత తిన్నారో, ఇప్పుడు ఆడిట్ ఎవరిమీద జరుగుతోందో, ఎందుకు తగ్గిందో, కార్మికులకు ఏం జరిగిందో మీ అంతరాత్మకి తెలుసు. అధ్యక్షా, 5, 10 నిమిషాలు మాట్లాడతానన్నారు. పావుగంట అయిపోయింది. ఇంకా చాలామంది మాట్లాడాలి.

శ్రీ బి.చెంగల్‌రాయుడు : అక్కడి స్పీకర్ కాదులే మన ఛైర్మన్.

MR CHAIRMAN: No, the Speaker is doing well.

మ.**1.10**

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, ఆ మాటల్ని రికార్డుల నుండి తొలగించాలని కోరుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : నేను already warn చేశాను.

శ్రీ బి. చెంగల్ రాయుడు : మీరు ఛైర్మన్ గారిని కంట్రోల్, డిక్టేట్ చేయకండి.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : మేము చేయడం లేదే?

SRI B. CHANGAL RAYUDU : Don't try to influence the Chair. నేను ఏం మాట్లాడకుండా కూర్చోడానికి సిద్ధంగా ఉన్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : మీరు అవాస్తవాలు మాట్లాడవద్దు. పనికి ఆహార పథకం ఏ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టారు?

శ్రీ సి. రామచంద్రయ్య : అధ్యక్షా, గౌరవసభ్యులు తమ అభిప్రాయాలు తాము చెబుతారు. ప్రతీ ఒక్క సెంటెన్స్‌కు కౌంటర్ సెంటెన్స్ చెబితే ఎలా? You are not representing the Government. The concerned Minister is also there. In each and every sentence you are intervening.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : మినిస్టర్‌గారు సమాధానమిస్తారు. కానీ అవాస్తవాలు మాట్లాడకూడదు.

శ్రీ బి. చెంగల్ రాయుడు : 2008 అసంఘటిత రంగ కార్మికుల సామాజిక భద్రత చట్టంను తక్షణం అమలు చేయగలిగితే మేలు జరుగుతుంది. Delay of justice is denial of justice. అసంఘటిత కార్మికులకు ఎంత త్వరగా న్యాయం చేయగలిగితే అంత త్వరితగతిన మేలు జరుగుతుందని సభ దృష్టికి తీసుకువస్తూ నేను సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : గౌరవసభ్యులు మాట్లాడేటప్పుడు కొన్ని సూచనలు, పాయింట్లు చెబితే ఎంతమందైనా మాట్లాడడానికి అవకాశం ఉంటుంది. మిగతా వాళ్లకు కూడా అవకాశం వస్తుంది.

మిస్టర్ ఛైర్మన్ : సుధాకర్ బాబు గారు మీరు పేరు ఇవ్వలేదు కదా?

శ్రీ ఎం. సుధాకర్ బాబు : పేరు ఇవ్వలేదు కానీ, ఒక సూచన చేయదలచుకున్నాను.

శ్రీ బి. చెంగల్ రాయుడు : సూచన ఇస్తామంటున్నారు కదా, తీసుకోండి సార్. ఆమె పేరు లేకుండానే అంతసేపు మాట్లాడింది సార్. (శ్రీమతి నన్నపనేని రాజకుమారిని ఉద్దేశించి)

మిస్టర్ ఛైర్మన్ : చెంగల్ రాయుడు మీరు చాలా సీనియర్ నాయకుడు. I can't expect this from you.

శ్రీ బి. చెంగల్ రాయుడు : అధ్యక్షా, సుధాకర్ బాబు గారు సలహా ఇస్తామన్నారు.

మిస్టర్ ఛైర్మన్ : నాకు తెలుసు కదా? నేను సుధాకర్ బాబుతో మాట్లాడుతున్నాను. నువ్వు మధ్యలో ఎందుకు కలగజేసుకుంటావు?

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : ఇప్పుడు ఛైర్మన్ గారిని మీరు డిక్టేట్ చేస్తారా? (చెంగల్ రాయుడు గారిని ఉద్దేశించి)

మిస్టర్ ఛైర్మన్ : ఇక్కడ లిస్ట్ ఉంది, I will follow the list also. సుధాకర్ బాబు గారు ఒక్క నిమిషం మాట్లాడండి.

శ్రీ ఎం. సుధాకర్ బాబు : అధ్యక్షా, గతంలో లేబర్ డిపార్టుమెంటు అంటే షాపుల వాళ్లు, మిగతావాళ్లు భయపడిపోయేవాళ్లు. గత 10,15 సంవత్సరాలనుండి లేబర్ డిపార్టుమెంటుని లెక్క చేయడం లేదు. కాలర్ ఎగరేస్తున్నారు, ఆదివారం కూడా షాపులు తెరుస్తున్నారు. ఒకప్పుడు లేబర్ డిపార్టుమెంటుని కాళ్లవేళ్లపడి బ్రతిమిలాడేవారు. హోటల్‌వాళ్లు కూడా మినిమం జీతాలు ఎంత ఇస్తున్నారో విచారణ చేసి వాళ్లకు మినిమం జీతాలు ఇప్పించేవాళ్లు. ఈ రోజు ఆ పరిస్థితి లేదు. దయచేసి పూర్వ వైభవం తీసుకురావాల్సిందిగా, కార్మికులకు భద్రత కల్పించే విధంగా ప్రతీ షాపులో, ప్రతీ హోటల్‌లో ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు వారికి వచ్చే విధంగా చేయాల్సిందిగా మంత్రిగారిని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీమతి పమిడి శమంతకమణి : అధ్యక్షా, కార్మిక వ్యవస్థ మన దినచర్యలో ఒక భాగంగా మనం అనుకోవడంలో తప్పు లేదు. ఉదయాన్నే లేవగానే ఇంటి బెల్లు కొట్టేది ఇంటి పనిమనిషి,

ఆవిడ రాకపోతే ఆరోజు ఆ ఇంటి ఇల్లాలి పరిస్థితి చాలా దారుణంగా ఉంటుంది. ఎందుకంటే ఆవిడ చేసే మొదటి పనులు ఉద్యోగానికి వెళ్లే మహిళకు చాలా కష్టంగా ఉంటుంది. వెంటనే భర్తకు మీరు హోటల్‌కు వెళ్లి బ్రేక్‌ఫాస్ట్ తీసుకురండి, ఈ లోగా నేను వంటచేసి, పిల్లలను స్కూల్‌కి పంపడానికి తయారు చేస్తాను అనే వరకూ ఆవిడ హడావుడి అంతటితో ఆగిపోదు. మరి ఈనాడు ఉదయం లేచినప్పటి నుండి సాయంకాలం పండుకునే వరకూ కూడా మన దినచర్యలు అనేక రంగాలలో ఉన్న కార్మికులను చూస్తూనే ఉన్నాము. నా బాల్యంలో గుత్తిలో ఉన్నప్పుడు మా ఇంటి ఆరుబయట పెద్ద అరుగులు ఉండేవి. అక్కడ కూర్చున్నప్పుడు కొంత మంది నిరుపేదలు తట్టగంపలలో సమ్మెట్లు, చిన్న చిన్న సుత్తులు తీసుకుని, పెద్ద మూటలో తినుబండారాలు, బియ్యము వంటివి కట్టుకుని, పిల్లల్ని చంకన ఎత్తుకుని వెళ్లేవాళ్లు. నేను మా పెద్దవాళ్లను వాళ్లు ఎక్కడికి వెళుతున్నారని అడగగా వీళ్లు అంతా రైల్వే లైన్లు వేసేటప్పుడు ఆ రైల్వే లైన్లకు కావాల్సిన కంకర్లు కొట్టడానికి క్యాంపులుగా మూడు నుండి ఐదు నెలలు వలసలుగా వెళతారు, అక్కడ కంకర కొట్టి ఆ లైన్లు వేయడానికి వీరందరినీ పురమాయిస్తారని చెప్పడం జరిగింది.

శ్రీ సింగం బసవపున్నయ్య : (శాసనసభ నియోజక వర్గం) అప్పుడు మీ వయస్సు ఎంతండి?

శ్రీమతి పమిడి శమంతకమణి : అవసరమా నీకు నా వయస్సు?(శ్రీ బసవ పున్నయ్యను ఉద్దేశించి) అధ్యక్షా, ఇలా అంటారు, మళ్లా ఏమైనా అంటే శమంతకమణి అలా అన్నారు, రాజకుమారి ఇలా అన్నారు అంటారు.

MR. CHAIRMAN : Mr. Basava Punnaiah Garu, you should have your own limits. దేనికైనా ఒక లిమిట్ ఉంటుందండి.

శ్రీమతి పమిడి శమంతకమణి : అధ్యక్షా, అదేవిధంగా హుబ్లీ, ధార్వాడకు కూడా వలస వెళ్లేవాళ్లు. హాస్పిటల్ కార్మిక పనులన్నీ కూడా వీళ్లు వలస వెళ్లి పనులు చేసి, జీవించేవాళ్లు. ఇక్కడి నుండి వెళ్లినవాళ్లు అక్కడే స్థిరపడిపోయేవాళ్ళు. గౌరవ సభ్యులు ఇందాక అసంఘటిత కార్మిక రంగం గురించి చెప్పారు. చాలామంది ఉన్నారు. వాళ్లు లెక్కలోకే రావడం లేదు. పురుషులతో సమానంగా మహిళలు కూడా కార్మికులుగా అనేక పనులలో ముందుంటున్నారు. ఇప్పుడు మనం ఏదైనా ఒక పెద్ద అపార్టుమెంటు కట్టేదగ్గరకు వెళ్లి చూస్తే ఒక చిన్న చంటిపిల్ల తల్లి ఇంత ఎండలో కూడా చెట్టుకు ఉయ్యాల కట్టి ఆ బిడ్డను ఉయ్యాలలో పండబెట్టి ఆమె వెళ్లి, ఇటుక, సిమెంటును మోస్తూ ఉండడం చూస్తాము. ఆవిధంగా పేద ప్రజలు ఆరోజు కష్టపడకపోతే, ఆ కూలి తీసుకురాకపోతే తన కుటుంబం గడవడం చాలా కష్టం. కార్మికులు లేకపోతే మన దినచర్య లేదు. ఒక్కోసారి పాత సామాన్లు, పాత పేపర్లు కొంటామని బాల కార్మికులు నాలుగు చక్రాల బండిని తోసుకుంటా పోవడం మనం చూస్తాము. ఆ అబ్బాయి వయస్సు మహా ఉండే 6 నుండి 10 సంవత్సరాల మధ్యలో ఉంటుంది. ఆ అబ్బాయి భవిష్యత్తు ఏమిటని మనం ఒక్క సారి ఆలోచన చేయాలి. ఆ రోజుకు రూ.20 సంపాదించి ఆ డబ్బుని తన తల్లికి ఇస్తే ఆ తల్లి కళ్లల్లో ఉండే సంతోషం పిల్లాడు కష్టపడ్డ కష్టార్జితానికి ఆ పిల్లవాడి తల్లి మాత్రమే కట్టగలదు. ఆరకంగా చిన్న పిల్లలు, మహిళలు, పురుషులు అనేక రంగాలలో కార్మికులుగా బ్రతుకుతున్న వాళ్లను చక్కగా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నది. చాలా మంది పెద్దలు చెప్పినట్లు, ఎరువులు, కెమికల్స్ పరిశ్రమలలో పనిచేసేవాళ్లు ఆ గాలి, ఘాటైన వాసన రోజూ పీల్చుకుని, ఊపిరితితులు పాడై, జబ్బు చేసి, ఎంతోమంది కార్మికులు మంచాన పడడం మనం చూస్తున్నాము. వాళ్లకు ఈనాడు ఈ ప్రభుత్వం చేపట్టే అనేక సంక్షేమ కార్యక్రమాలు అందుబాటులోకి తేవాలి. నా వరకైతే ఇప్పుడున్న

కార్మికులకు ఒక మంచి వరం కార్మికశాఖ మంత్రిగారు. చాలా విషయాలలో ఆయన స్పందించడం, లాకౌట్స్, సమ్మెలు జరిగినప్పుడు అక్కడకు వెళ్లి ఆయొక్క సమస్యలు తీర్చడానికి సంబంధిత ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడడానికి ఆయన ముందుంటున్నారు. నేను ఒక సలహా ఇవ్వదలచాను. ఈ కెమికల్, ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీస్‌లో పనిచేసే వాళ్లకు తప్పనిసరిగా వాళ్ల ఆరోగ్య పరిస్థితి కోసం వాళ్లకు జీవిత బీమా పథకం గాని, హెల్త్ కార్డుల విషయాలలో, వారు చనిపోతే వారి కుటుంబానికి కావాల్సిన సంక్షేమ కార్యక్రమాలేవైనా ప్రభుత్వ పథకాలు ఏర్పాటు చేయాలని నేను మనవి చేస్తున్నాను.

మ.**1.20**

ముఖ్యంగా మా అనంతపురం జిల్లాలో కదిరి ఉంది. అక్కడ చాలా మంది దళారులు అరబ్ దేశాలలో పనిచేయడానికి ఆడపిల్లలను తీసుకువెళ్తున్నారు. అక్కడికి వెళ్లి ఈ దళారుల చేతిలో పడిన వాళ్లకి సరైన పాస్‌పోర్ట్‌లు లేక అరబ్ దేశాలలో ఎక్కడ ఏపని చేయాలో తెలియకుండా ఉన్నారు. దళారులు ఆ పిల్లలను అమ్మి, వారిని అరాచక కార్యక్రమాలకు వాడుకోవడం మనం చూస్తున్నాం. ఆ తల్లిదండ్రులకు అక్కడ జరిగే విషయాలు తెలుసు. కానీ, వారి ఆకలి అనేది అటువంటిది. ఆకలితో ఏమీ బయటకు చెప్పుకోలేక, ఎక్కడ చెబితే పరువు పోతుందోనని సతమతవుతున్న తల్లిదండ్రులు అనేక మంది కదిరి ఏరియాలో ఉన్నారు. దళారుల చేతిలో పడి అక్రమంగా నిర్బంధిందించబడిన కార్మికులకు న్యాయం చేయడానికి దయచేసి ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలి. అక్కడ ఉన్న ఆడపిల్లలను చాలామందిని మనం రెడ్‌లైట్ ఏరియాలో చూస్తాము. దళారులు పిల్లలను ఏదో పనికి పంపుతామని చెప్పి, వారిని తీసుకువెళ్లి రెడ్‌లైట్ ఏరియాలో అమ్మి వాళ్లను అరాచక కార్యక్రమాలకు వాడుకోవడం చూస్తున్నాం. అటువంటి వారిపై ప్రభుత్వం వెంటనే చర్య తీసుకుని పోలీసుల ద్వారా గానీ, ఇతర ఎన్‌జివోల ద్వారాగాని ఆ పిల్లలను బయటకు తీసుకువచ్చి, జనజీవన స్రవంతిలో వారు సజావుగా బ్రతకడానికి తగుచర్య తీసుకోవాలని కోరుతున్నాను. బాల కార్మికులు, మహిళాకార్మికుల పట్ల అనేక మంచి పథకాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. నూతనంగా ఏర్పడిన ఈ ప్రభుత్వంలో యువకుడు ఉత్సాహవంతుడైన కార్మిక శాఖమంత్రి అన్ని విషయాలు కూలంకషంగా తెలిసిన వ్యక్తి కాబట్టి, ప్రతి ఒక్క విషయాన్ని మన సభ్యుల ముందు ఉంచుతున్నారు కాబట్టి వీటి మీద శ్రద్ధ తీసుకుని, కార్మికులందరికీ కూడా సంక్షేమ కార్యక్రమాలలో మన నూతన ప్రభుత్వం నూతన పథకాలతో ముందుకు రావాలని నేను మనవి చేస్తూ, కార్మికులకు మంచి ఆశాజ్యోతిగా ఉండాలని కోరుతూ ఈ అవకాశమిచ్చిన మీకు నా ధన్యవాదములు తెలియజేస్తున్నాను.

శ్రీ కింజరపు అచ్చన్నాయుడుః అధ్యక్షా, ముందుగా రాష్ట్రంలో ఉన్నటువంటి ఎలక్ట్రానిక్ మీడియా అధిపతులకు, పత్రికా అధిపతులకు శాసనమండలి ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. శాసనమండలిలో అర్థవంతమైనటువంటి చర్చలు జరుగుతున్నాయి. కానీ ఇక్కడ జరుగుతున్నటువంటి చర్చలు ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి చూపించడంలోగాని, రాయడంలో గాని నిర్లక్ష్యంగాను, అంటే దీని గురించి రాయడంలో ప్రాధాన్యతలేనటువంటి అంశంగా చూస్తున్నారు. దయ ఉంచి దీనిని కూడా పరిగణనలోనికి తీసుకుని, ఇక్కడ జరుగుతున్న చర్చలు ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తెలియజేస్తే అందరికీ మంచి జరుగుతుందని సభ్యులందరి తరుపున పత్రికా యాజమాన్యానికి ఇదొక రిక్వెస్ట్‌గా నేను కోరుతున్నాను.

(సభ్యుల చప్పట్లు)

అధ్యక్షా, ఈరోజు లఘుచర్చలో కార్మికుల సమస్యల పట్ల శ్రీ పి.జె. చంద్రశేఖర్‌గారు, సి.హెచ్.నారాయణరెడ్డిగారు, గాదె శ్రీనివాసులు నాయుడుగారు, చెంగల్‌రాయుడుగారు, శమంతకమణిగారు, సుధాకర్‌బాబుగారు కార్మికుల యొక్క సమస్యల మీద, ఎదుర్కొంటున్న ఇబ్బందుల మీద కూలంకషంగా అన్ని విషయాలు చర్చించారు, సంతోషంగా ఉంది. ప్రభుత్వం తరుపున వారిని కూడా అభినందిస్తున్నాను. ఎందుకంటే మనం రాజకీయాలు తక్కువగా మాట్లాడుకోవాలి. మనందరికీ ఒక అవకాశం వచ్చింది. ఈ రోజు సభ్యులకుగాని, పరిపాలించడానికి ప్రభుత్వంలో మాకుగాని, అందులో మంత్రిగా కూడా ఒక అవకాశం వచ్చినప్పుడు, పది మంది చెప్పిన విషయాలన్నీ కూడా తెలుసుకొని, సమర్థవంతంగా సమస్యల పరిష్కారానికి దృష్టి పెట్టాలి. అందులో నేను గొప్ప అని చెప్పుకోను. గత ప్రభుత్వాలు ఏమి చేశాయి, అంతకు ముందు ఉన్న నాయకులు ఏమి చేశారని మనం అనునిత్యం చర్చించుకుంటే సమయం వృథా అవుతుంది తప్ప, కార్మికులకుగానీ, ఏ వర్గాలకుగానీ మేలు జరుగదనే విషయాన్ని నేను ఎప్పుడూ గమనిస్తూ ఉంటాను. ఈరోజు నేను కార్మికశాఖమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత దీని మీద ఒక అవగాహన రావడానికి, ఎందుకంటే దీనిమీద పూర్తి స్థాయిలో దృష్టి పెట్టకపోతే, పదిమందితో మాట్లాడకపోతే, అవగాహన అంత తేలికగా సంపాదించే అవకాశం లేదు. నేను ఒకటి రెండు మాసాలు అన్ని విషయాల మీద కార్మికులకు న్యాయం చేయాలి, అదేవిధంగా ప్రో ఇండస్ట్రీ కూడా ఉండాలని ప్రయత్నిస్తున్నాను. ఈ రోజు ఆంధ్రప్రదేశ్ బాగుపడాలన్నా, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న నిరుద్యోగ సమస్య పరిష్కరించబడాలన్నా, మనకు ఆదాయ మార్గం పెరగాలన్నా సరే పరిశ్రమలు రావలసిన అవసరం ఉంది. దానికి మనందరం కూడా రాజకీయపార్టీలకు అతీతంగా ఆహ్వానించాలి. అయితే పరిశ్రమలు వచ్చిన తరువాత స్థానికంగా ఉన్న వారందరికీ కూడా ఉపాధి అవకాశాలు కల్పించాలి, ఉపాధి అవకాశాలు కల్పించిన తరువాత చట్ట ప్రకారం వారికి వేతనాలు అందుతున్నాయా, వారికి కావలసిన సౌకర్యాలు అందుతున్నాయా, లేదా అనేటువంటి గురుతరమైన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. దాని మీద ప్రత్యేకమైన దృష్టి పెట్టడం జరిగింది. నేను మంత్రిగా అయిన తరువాత రాష్ట్రంలో ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి, ఎన్ని పరిశ్రమలు మూతపడ్డాయి, మూత పడడానికి కారణాలు ఏమిటి, మరలా మనం ప్రయత్నం చేస్తే, పరిశ్రమలు ప్రారంభమైతే చాలామంది కార్మికులకు ఉపాధి కలుగుతుందని చెప్పి, ఫేస్-1లో దానిమీద దృష్టి పెట్టి, వీలైనంత వరకు చేశాము. నేను గొప్ప అని చెప్పుకోను, గత కొన్ని సంవత్సరాలనుంచి మూతపడిన పరిశ్రమల యాజమాన్యంతోను, కార్మిక సంఘాలతోను, కార్మికులతోను, ఒకటికి రెండు, రెండుకి మూడుసార్లు మాట్లాడి, కొన్ని పరిశ్రమలను మరల ప్రారంభించడం జరిగిందని మనవిచేస్తున్నాను. తిరిగి ప్రారంభించడంవల్ల ఈరోజు కొంతమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అవకాశాలు వచ్చాయి. ఉదాహరణకు విజయనగరం జిల్లా గరివిడిలో Ferro Alloys factory, గత రెండు మూడు సంవత్సరాలనుంచి మూతపడి ఉంది. దానికి కారణం ఏదో పెద్దసమస్య కాదు, అవగాహన లేకపోవడం. వారందరినీ ఒక దగ్గర కూర్చోబెట్టి వారి సమస్య మీద దృష్టి పెట్టకపోవడంవల్ల, ఐదు వేలమందికి ఉపాధి కల్పించిన పరిశ్రమ సుమారు రెండు, మూడు సంవత్సరాలనుంచి మూతపడిపోతే, వెంటనే మాట్లాడి దానిని తెరిపించే ప్రయత్నం చేశాము. అదేవిధంగా చింతవలసలో ఒక జూట్ మిల్లు ఉంది. సుమారుగా ఐదువేలమంది కార్మికులు దానిమీద బ్రతుకుతున్నారు. అది మూడు సంవత్సరాలనుంచి మూతపడి ఎంతోమంది ఎన్ని ప్రయత్నాలు చేసినా తెరిచే పరిస్థితి లేదు. ఈమధ్యనే దానిమీద కూడా దృష్టిపెట్టి యాజమాన్యంతో, కార్మికులతో మాట్లాడి దానిని కూడా తెరిపించాలనే ప్రయత్నం చేశాము. అదేవిధంగా సభ్యులు చంద్రశేఖర్‌గారు చెప్పినట్లుగా మన జిల్లాలో జూట్ పరిశ్రమలు ఉన్నాయి. ఆ పరిశ్రమలు ఎక్కువగా

మా విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఎక్కువగా ఉన్నాయి. కానీ టోటల్‌గా జూట్ పరిశ్రమలన్నీ కూడా లాకౌట్ చేసిన పరిస్థితిలో ఉన్నాయి. మిల్లులన్నీ కూడా మూసేశారు. దానిలో ఉన్న ఉద్యోగస్తులకి కనీసం ఉపాధి కూడా లేని పరిస్థితి. గతంలో జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉంది. వారికి కావలసిన బెనిఫిట్స్ కూడా ఇవ్వలేని పరిస్థితిలో జూట్ పరిశ్రమ ఉంది. ఈ మధ్యనే జూట్ పరిశ్రమతో సపరేట్‌గా మీటింగు పెట్టి వారికున్న ఇబ్బందులు ఏమిటి, ఆ పరిశ్రమలు తెరిచేందుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయసహకారాలు అందాలని మాట్లాడాము. వారు మళ్లీ intimeలో కార్మికులకు అన్ని రకాలుగా అవకాశాలు కల్పించాలంటే ఏ రకంగా ముందుకు వెళ్లాలనే విషయాన్ని కూలంకషంగా, పరిశ్రమవారీగా మాట్లాడి పరిష్కరించడానికి అన్ని రకాలుగా ప్రభుత్వపక్షాన చర్యలు తీసుకుంటున్నాము. అదేవిధంగా సభ్యులు చంద్రశేఖర్‌గారు, చెంగల్‌రాయుడుగారు కార్మికసంఘాలతో చాలా విషయాలు చెప్పారు. కార్మికసంఘాలతో కూడా మేము ఎప్పటికప్పుడు సమావేశమవుతున్నాము. ఒక చిన్న విషయాన్ని జటిలం చేయకుండా ముందుగానే ప్రభుత్వం దృష్టిలో పెట్టమని వారికి చెబుతున్నాము. కార్మికులకు వ్యతిరేకంగా ఏదైనా పరిశ్రమ పనిచేసినా, లేకపోతే చట్టప్రకారం రావలసిన రాయితీలు రాకపోతే ముందు ప్రభుత్వ దృష్టిలో పెట్టి, తరువాత దానిని సామరస్యంగా పరిష్కరించుకునే అవకాశం కల్పించుకుందాం. ఒకవేళ పరిష్కారం కాకపోతే ప్రభుత్వంనుంచి చట్టపరమైనటువంటి అన్ని చర్యలు ఉపయోగించి కార్మికులకు న్యాయం చేయాలని చెప్పే ప్రయత్నం చేస్తున్నాము.

మ. **1.30**

ఒక వేళ పరిష్కారం కాకపోతే ప్రభుత్వం నుంచి చట్టపరమైన అన్ని చర్యలు ఉపయోగించి కార్మికుడికి న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాము. జిల్లాలలో కార్మిక న్యాయస్థానాలకు న్యాయమూర్తులుండాలి. కానీ గత కొన్ని సంవత్సరాలనుంచి ఆ న్యాయస్థానలలో న్యాయమూర్తులు కూడా లేనటువంటి పరిస్థితి ఉన్నది. ఈ రోజు న్యాయమూర్తులను నియమించే కార్యక్రమాన్ని తీసుకున్నాము. ఈ శాఖలోఒక కొత్త పద్ధతిని తీసుకురావాలనుకుంటున్నాము. న్యాయమూర్తి దగ్గరకు వెళ్లే ముందు మినిస్టర్ దగ్గరనే, ఎందుకంటే మైన్స్ డిపార్టుమెంటు చిన్నచిన్న సమస్యలు ఉంటే మరి లాయర్లను పట్టుకొన్ని appeal చేస్తే మంత్రి దగ్గరనే చిన్న చిన్న సమస్యలను పరిష్కరించే అవకాశం కొన్ని డిపార్టుమెంటులలో ఉంది. దానిని కూడా ఈ లేబర్ డిపార్టుమెంటులో తీసుకొచ్చి చిన్నచిన్న సమస్యలను మంత్రి లెవల్‌లో పరిష్కరించి ఈ రోజు ఇండస్ట్రీని ముందుకు తీసుకువెళ్లాలనీ అన్ని రకాలుగా ప్రయత్నం చేస్తున్నాను. ఈ రోజు బాలకార్మికులు ఉన్నారు. చాలా మంది సభ్యులు మాట్లాడడం జరిగింది. గతంలో మనము బాలకార్మికులంటే ఎదో ఒక సంఖ్య చెప్పేవారు. ఈసారి ఆ విధానం కాకుండా ప్రభుత్వం మెన్ననే “బడి పిలుస్తుంది” అనే కార్యక్రమం తీసుకున్నాము. గ్రామము వారీగా, గృహాల వారీగా ఎంత మంది బాలకార్మికులు బడికి వెళ్లకుండా ఈ రోజు పనిలో ఉన్నారో వ్యక్తుల వారీగా గుర్తించి, 99% బాలకార్మికులు అనే వాళ్లు లేకుండా ఈ రోజు బడిలో చేర్పించాము. ఇంకా ఎక్కడైనా సరే ప్రభుత్వానికి తెలియకుండా బాలకార్మికులు ఉంటే అటువంటి వారిపైన చట్టపరమైనటువంటి చర్యలు తీసుకొని ఆ బాల కార్మికులకు ప్రభుత్వమే అన్ని విధాల సహకరించి పాఠశాలలో కానీ, కాలేజీలలో చేర్పించే విధానంలో కూడా పూర్తిస్థాయి దృష్టిపెడుతున్నాము. అధ్యక్షా, పాత చట్టాలన్నీ ఉన్నాయి. అందులో కార్మికులకు నష్టం వచ్చేటువంటి చట్టాలుంటే, ఇంకా వారికి మేలు చేయగల అవకాశంవున్న చట్టాలుంటే వాటిని సవరించడానికి కూడా ప్రయత్నం చేస్తున్నాము. ఈ రోజు లేబర్ వెల్‌ఫేర్ బోర్డు ఉన్నది. 1987లో ఒక చట్టం తీసుకొచ్చారు. ఆ చట్టంలో కార్మికుడు రూ.2 కడితే యాజమాన్యం రూ.5 చెల్లించాలి. రూ.7 లతో ఈరోజు లెబర్ వెల్‌ఫేర్ బోర్డుకు డబ్బు వస్తే ఆ డబ్బు ద్వారా కార్మికుల యెక్క సంక్షేమానికి ఉపయోగించే

పరిస్థితి ఉండేది. కానీ చాలా మంది మంత్రులు చాలా రకాలుగా ప్రయత్నం చేసినాసరే ఆ చట్టంలో మార్పు తీసుకురాలేకపోయారు. ఈ రోజు నేను ప్రత్యేకంగా దాని మీద దృష్టి పెట్టి రూ.2 అంటే చాలా తక్కువ రూ.7 అంటే చాలా తక్కువ. దీని ఫండ్‌ను మనము పెంచుకోని ఈ రోజు బోర్డుకు తీసుకురాగలిగితే తద్వారా ఎక్కువ సంక్షేమాన్ని కార్మికులకు అందించగలమని చెప్పి మొన్ననే ముఖ్యమంత్రిగారికి కాబినెట్‌లో చెప్పడం జరిగింది. కార్మికులు రూ.30 కడితే, ఎవరైతే యాజమాన్యం ఉన్నారో వారి ద్వారా రూ.70 తీసుకొని ఈ రూ.100 నిధిని మనము కార్మికుని దగ్గర తీసుకుంటే ఈ రోజు వెల్ఫేర్ బోర్డుకు కూడా బాగా డబ్బులు వస్తాయి. ఈ రోజు మనం ఇస్తున్నటువంటి రాయితీలు కానీ, సంక్షేమపథకాలు కానీ భారీ స్థాయిలో అమలు చేయడానికి అవకాశం ఉంటుందని ఈ కార్యక్రమము కూడా ప్రభుత్వం తీసుకుందనీ ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అదే విధంగా చట్టాలలో కూడా, చట్టాలైతే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చేసాయి. కానీ ఆ చట్టాలను అమలు చేయడంలో కానీ, ఆ చట్టాలలో ఉన్నటువంటి లోపాల వల్ల కానీ చాలా వరకు కార్మికులుకు తీరని అన్యాయం జరుగుతుంది, ఈ రోజు ఇ.ఎస్.ఐ ఉంది. కార్మికులకు సరైనటువంటి పద్ధతిలో ఇ.ఎస్.ఐ కానీ, పి.ఎఫ్ అందడం లేదని చాలా మంది సభ్యులు చెప్పారు. అది వాస్తవము . ఇ.ఎస్.ఐ , పి.ఎఫ్ కేంద్రప్రభుత్వం ఆధీనంలో ఉన్నది. అయినా కూడా ప్రత్యేకమైనటువంటి అధికారులను నియమించాము. ఎవరికైనా ఈ ఇ.ఎస్.ఐ , పి.ఎఫ్ విషయంలో ఏ కార్మికుడు అయినా సరే నాకు ఈ విషయంలో సమస్య ఉందంటే మా లేబర్ ఆఫీసర్ దగ్గర ఉండి ఆ సమస్యలన్నీ పరిష్కరించడానికి ఆ ప్రయత్నం కూడా ఒక ప్రక్కన చేస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాము. ఇ.ఎస్.ఐ ఆసుపత్రులు ఉన్నాయి. వీటిని చూస్తే ఎంత బాధ అనిపిస్తుంది. చాలా ఇబ్బందికరమైటువంటి పరిస్థితులలో ఉన్నాయి. భవనాలు లేనటువంటి పరిస్థితి, ఆసుపత్రులలో డాక్టర్లు లేనటువంటి పరిస్థితి అక్కడ ఉంది. దానికి కూడా ఈ రోజు streamline చేస్తున్నాము. గౌరవ సభ్యుల నియోజక వర్గాలలో ఎక్కడెక్కడైతే ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో వాటి వివరాలను తెలియజేయాలని ఇప్పటికే శాసనసభ్యులకు ఉత్తరాలు రాశాను. శాసనమండలి సభ్యులకు కూడా రాస్తాను. మీ మీ ప్రాంతాలలో ఎక్కడైనా కార్మికులకు ఇ.ఎస్.ఐ ఆసుపత్రులు లేకపోతే రెండు ఎకరాల స్థలాన్నీ మీరు ఇస్తే బ్రహ్మాండమైనటువంటి ఒక ఆసుపత్రిని కట్టి అక్కడున్నటువంటి కార్మికులందరికి కూడా వైద్య సదుపాయం అందించడానికి ప్రయత్నాలన్నీ కూడా జరుగుతున్నాయి. అయితే గతంలో కార్మికులు అనే వారు ఒక ఇ.ఎస్.ఐ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకునేవారు. కానీ మొన్ననే దత్తాత్రేయగారితో మాట్లాడిన తరువాత ఈ రోజు కార్మికులు ఒక ఇ.ఎస్.ఐ ఆసుపత్రిలోనే కాకుండా దగ్గరున్నటువంటి కార్పొరేట్ ఆసుపత్రులలో కూడా వైద్యం తీసుకోవచ్చని ఈ రోజు కేంద్రం కూడా వెసలుబాటును ఇచ్చింది. దాన్నీ కూడా కార్మికులు ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా సభ్యుల ద్వారా కార్మికులకు తెలియజేస్తున్నాను. మొన్ననే ఎన్నికలలో చెప్పాము. ఎవరైతే ఆటో డ్రైవర్లు ఉన్నారో, ఎవరైతే ట్రక్కు డ్రైవర్లు, లారీ డ్రైవర్లు ఉన్నారో వీళ్లందరికీ ఇన్సూరెన్స్ చేస్తామని ఎన్నికల్లో మాట ఇవ్వడం జరిగింది. వెంటనే దాని విధివిధానాలను కూడా రూపొందించి ఎవరైనా డ్రైవర్లు ప్రమాదం వలన మరణిస్తే వారి కుటుంబానికి రూ.5లక్షలు ఇవ్వాలని నిర్ణయించి స్కీమ్ అంతా మంజూరూ చేసి జి.ఓ కూడా ఇచ్చాము. అయితే ఎమ్.ఎల్.సి ఎన్నికలు ఈ రాష్ట్రంలో జరిగాయి. దాన్ని వల్ల ఈ స్కీమ్‌ను ప్రారంభించలేకపోయాము. ఈ వారము రోజులలోనే రాజమండ్రి, తిరుపతిలో ముఖ్యమంత్రితో ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నాము. అయితే సభ్యులందరూ కూడా చెప్పారు , ఎవరైతే కార్మికులు ఇండస్ట్రీస్‌లో పనిచేస్తున్నారో వారి గురించి మనకు సమస్య లేదు. కానీ ఈ రాష్ట్రంలో 90-92 శాతం మంది

అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారు. ఈ రోజు వ్యవసాయ కూలీలు ఉన్నారు. డ్వాక్రా మహిళలు ఉన్నారు. మత్స్యకారులు ఉన్నారు. ఇటువంటి వారందరూ కూడా 92 శాతం మంది అసంఘటిత రంగంలో ఉన్నారు. వారి గురించి ఇంతవరకు ఆలోచించలేదు. కానీ వారికి రిజిస్ట్రేషన్ కూడా మన దగ్గర లేదు. ఎవ్వరు అసంఘటిత కార్మికుడని మనదగ్గర ఒక రికార్డు కూడా లేదు. రాష్ట్రంలో ఎంతమంది ఉన్నారో తెలియనటువంటి పరిస్థితి ఉన్నది. అందుకే ముఖ్యమంత్రిగారితో మాట్లాడి దాన్ని కూడా ఆలోచించాము. మొన్ననే క్యాబినెట్‌లో చెప్పడం జరిగింది, ఎక్కడా దేశ చరిత్రలో లేదు, రెండు కోట్ల పదకొండు లక్షల మంది అసంఘటిత కార్మికులు ఉంటే, అందులో 1000 కుటుంబాలు అసంఘటిత కార్మిక రంగంలో ఉన్నారు. వాళ్లందరికి కూడా కోటి కుటుంబాలకు ఎవరైతే వ్యవసాయ కూలీలు ఉన్నారో, ఎవరైతే డ్వాక్రా మహిళలు ఉన్నారో ఎవరైతే మత్స్యకారులు ఉన్నారో ఎవరైతే తోపుడు బండ్ల వారు ఉన్నారో ఎవరైతే వివిధ రంగాలలో పని చేస్తున్నారో వీరందరికి కూడా రూ.5లక్షలు ఇన్సూరెన్సు కార్యక్రమాన్ని మొట్టమెదటిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రవేశపెట్టబోతున్నాము.

మ.**1.40**

క్యాబినెట్‌లో కూడా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. అయితే, ఎవరు అసంఘటిత రంగంలో ఉన్నారో, వారికి రిజిస్ట్రేషన్ కూడా లేదు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ఇంటర్‌నెట్ సెంటర్లు అన్నీ తీసుకుని, వారి ఇండ్లలో ఇంటర్‌నెట్ ఉంటే ఆ సమయంలో కానీ, దగ్గర ఉన్న లేబర్ ఆఫీసులలో అందుబాటులో ఉన్నటువంటి వారికి పది రూపాయలు కడితే, అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుడిగా గుర్తించి, ఒక ఐడెంటిఫికేషన్ ఇచ్చే కార్యక్రమాన్ని చేస్తున్నాము. ఇదంతా మొదటి ఫేజ్‌లో రెండు నెలల సమయం తీసుకుని చేయడం జరుగుతుంది. ఇది రెండు నెలలో జరిగిన తరువాత, ఈ రూ.5 లక్షల ఇన్సూరెన్సు కార్యక్రమం ద్వారా ప్రతి వ్యక్తికి అందేలా పూర్తిస్థాయిలో తగిన చర్యలు తీసుకుంటున్నామని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ఈరోజున ప్రధానమైన సమస్యలలో ఒకటి నిరుద్యోగ సమస్య. సభ్యులుగా మీరు,మంత్రులుగా మేము ఉన్నాము. ఉదయం ఆఫీసులో కూర్చుంటే మా దగ్గరకి సుమారు 100 మంది వస్తే, అందులో 99 మంది బయోడేటాలు పుచ్చుకుని ఉద్యోగాలు కావాలని వస్తున్నారు. వారందరికీ ఉద్యోగ అవకాశాలు మనం కల్పించాలి. వారందరికీ తెలివితేటలు చాలా ఉన్నాయి. కానీ, తెలివితేటలు వెలికి తీయడంలో మనం చాలా వెనుకబడి ఉన్నాము. అందుకే ప్రభుత్వం ఒక స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసింది. ఇండస్ట్రియల్ పాలసీని ఒకటి తీసుకువచ్చి, అందులో దానిని పూర్తిగా ఒక నియమం క్రింద పెట్టి, ఎవరైనా ఒక పరిశ్రమను వారి ప్రాంతంలో పెడితే, మొదటి ఫేజ్‌లో ఎంతమందికి ఉద్యోగాలు కావాలి? ఎంతమంది స్కిల్స్ ఉన్న వారు కావాలి అనేది ఎవరైతే పరిశ్రమ కట్టి, దాని పునాది వేసేటప్పుడే అటువంటి వ్యక్తులను తీసుకుని, స్కిల్సులో వారందరికీ తర్ఫీదు ఇచ్చి, స్థానికంగా ఉండేవారందరికీ ఉద్యోగాలు ఇచ్చే కార్యక్రమం తీసుకుంటున్నాము.

ఈరోజున ఇళ్ళు కట్టిన లేబర్లు, తాపీమేస్త్రీలు ఉన్నారు. గౌరవ సభ్యులు ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇసుక రేట్లు పెరిగాయని, కొంతమంది ఇళ్లు కట్టడం లేదని అన్నారు. అధ్యక్షా, నేను రాజకీయం చేయదలచుకోలేదు కానీ, గత ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ కూడా భ్రష్టుపట్టాయి. ప్రతిసారీ ఇళ్ళ గురించే మాట్లాడుతున్నారు. తొమ్మిది మాసాలలో ప్రభుత్వం ఒక్క ఇల్లైనా కట్టలేదని అంటున్నారు. మేము కట్టలేదు. అది వాస్తవం. ఎందుకంటే, పని చేస్తే చేశామని చెప్పాలి. కట్ట లేదు అంటే కట్టలేదని చెపుతున్నాము. గతంలో జరిగిన నిర్వాకం వల్లే కట్టలేకపోయాం. ఈరోజు

జియోట్యాగింగ్ పెట్టి ఇళ్ళన్నీ సర్వే చేశాము. సుమారు 43 శాతం మేర పేర్లే నపడకుండా పోయాయి. 1, 2, 3 శాతం కాదు, 10 శాతం కాదు, సుమారు 43 శాతం మేర పది సంవత్సరాలలో ఎవరి పేరు మీద ఇళ్ళు మంజూరు అయిందో, ఆ పేరే ఎక్కడా కనిపించనటువంటి పరిస్థితి ఉన్నది. ఒక పేరుతో ఇళ్లు మంజూరు చేసుకున్నారు.

అచ్చన్నాయుడుగారు నా పేరుతో ఇల్లు మంజూరయింది. కానీ, అచ్చన్నాయుడుగా ఇల్లు నాకు మంజూరు అయినట్లు తెలియదు. కానీ, నా పేరుతో డబ్బు అంతా డ్రా చేసుకున్న పరిస్థితి ఉంది. ఇప్పుడు అటువంటి వ్యక్తికి ఇల్లు మంజూరు చేస్తే, గతంలో నీకు ఇల్లు మంజూరయింది, నీ డబ్బులు అంతా డ్రా చేసుకున్నారని ఆన్‌లైన్‌లో సమాచారం వస్తోంది. నేను వాస్తవాలు చెప్పాలని సభ్యులకు చెపుతున్నాను. నేను విమర్శలు ఎప్పుడూ చేయను, జరిగిన వాస్తవాలే మాట్లాడతాను.

శ్రీ బి. చెంగల్ రాయుడు ః మీరు నిజాలే చెబుతారు సార్. ఒక్క ఇల్లు కూడా కట్టలేదని నిజం చెప్పారు. రెండు చేతులు ఎత్తి దణ్ణం పెడుతున్నాను. గవర్నరుగారి ప్రసంగంలో సుమారు 67,570 ఇళ్లు కడతామని అన్నారు...

శ్రీ కె. అచ్చన్నాయుడు ః దానికి కూడా వస్తాను. అన్ని వివరాలు చెపుతాను. నేను చెప్పిన తరువాత...

MR. CHAIRMAN: (Referring to Mr. B. Chengal Rayudu) Please take your seat....

శ్రీ కె. అచ్చన్నాయుడు ః శ్రీ బి.చెంగల్‌రాయుడు గారు నేను చెప్పిన తరువాత అప్పుడు మీరు అడగండి. అధ్యక్షా, ఈ సంవత్సరం మార్చి 31 లోపు గౌరవ సభ్యులు చెప్పినట్లుగా, లెంటల్ లెవెల్, శ్లాబ్‌లెవెల్ ఏదైతే ఉందో వాటన్నింటిని గుర్తించడం జరిగింది. వాటికి సుమారు రూ.370కోట్లు అవసరం అని చెప్పి, నిర్ణయం చేయడం జరిగింది. ఈ 2, 3 రోజులలోనే మొత్తాన్ని విడుదల చేసి, ఆ ఇళ్ళన్నీ పూర్తి చేసేందుకు నిర్ణయం చేశాము. అవన్నీ తప్పనిసరిగా నిర్మిస్తున్నాం. కానీ, గతంలో జరిగిన పొరపాట్లను సరిచేసుకోకపోతే మళ్ళీ ఆ తప్పులే జరుగుతాయనే ఉద్దే శంతోనే, ఈ కార్యక్రమాలన్నీ చేస్తున్నాము.

ఇసుకకు సంబంధించి చూసినట్లయితే, అది సహజ వనరు. అది ఎవరూ సంపాదించింది కాదు. సహజవనరులు అనేవి ప్రభుత్వానికి చెందాలి. ప్రభుత్వానికి ఆదాయం వస్తే, ఆ ఆదాయాన్ని రాష్ట్ర ప్రజలకు, అణగారిన వర్గాలకి ఖర్చుపెట్టేందుకు అవకాశం ఉంటుంది. కానీ, గత ప్రభుత్వంలో ఇసుక ద్వారా ఆదాయం తక్కువగా ఉంది. నేను విమర్శించాలని కాదు గానీ, ఒక ఉదా హరణ చెపుతున్నాను. శ్రీకాకుళం జిల్లాలో గత 10 సంవత్సరాలలో సంవత్సరానికి సుమారు రూ.4కోట్ల రూపాయలే ఇసుక ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. ఈ సంవత్సరం ఇసుకను డ్వాక్రా మహిళలకు అప్పగించడం వల్ల, ప్రభుత్వం ఈ క్రొత్త విధానం పెట్టడం వల్ల, ప్రభుత్వం ఇసుకకు సంబంధించి కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం వల్ల, కేవలం నాలుగు మాసాలలోనే సుమారు రూ.70కోట్ల వరకూ ఆదాయం వచ్చింది. రూ.4కోట్ల నుంచి, రూ.70 కోట్ల వరకు వచ్చిందంటే, గతంలో కూడా అదేవిధంగా ఉండేది. గతంలో ఇసుక రవాణా జరిగినా, ప్రక్కదారి పట్టే అవకాశం ఎక్కువగా ఉన్నది. ఈనాడు ఆ మార్గాన్ని స్ట్రీమ్‌లైన్ చేయడం జరిగింది. గౌరవ సభ్యులు చెప్పిన మాట వాస్తవం. కొన్ని ప్రాంతాలలో ఇసుక ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఒక్కొక్కచోట రూ.600, రూ.500, రూ.300లుగా ఇసుక ధరలు ఉండేవి. మరికొన్నిచోట్ల అసలు ఇసుక దొరకని పరిస్థితి ఉన్నది. ఇసుక రవాణా ఛార్జీలు కూడా లబ్ధిదారుల మీద పడే పరిస్థితి ఉన్నది కాబట్టి, అవన్నీ స్ట్రీమ్‌లైన్ చేస్తున్నాం. భవిష్యత్తులో సామాన్యులకు ఇసుకను అందుబాటులోకి

తీసుకురావడం, ఇళ్ళనన్నింటిని మంజూరు చేయడం జరుగుతుంది. గౌరవసభ్యులు చెప్పినట్లుగా ఒక ఇల్లు కట్టడం ఆగిపోతే సుమారు 5 వర్గాల వారికి ఉపాధి లేనట్లు అవుతుంది కాబట్టి, దాని మీద కూడా తప్పనిసరిగా దృష్టి పెట్టి, పూర్తిస్థాయిలో వాటన్నింటిని కూడా ముందుకు తీసుకువెడతామని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

మనకు చాలావరకు పరిశ్రమలు వస్తున్నాయి. కామ్రేడ్ శ్రీ పి.జె. చంద్రశేఖరరావు కూడా ఉన్నారు. మీరందరూ ఒక పరిశ్రమగా ఉండాలి. కార్మికులకు న్యాయం జరగాలి. ఏ రోజు అయితే పరిశ్రమలు వస్తాయో, ఆ రోజే పదిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఆరోజే మనందరికి మంచి మంచి అవకాశాలు వస్తాయి కాబట్టి, ప్రో ఇండస్ట్రీగా మనమందరం ముందరకు వెడదాం. అవసరమైతే మీ సమక్షంలో చెప్పండి, ఎక్కడ సమావేశాలు పెట్టమన్నా, ఎక్కడ కార్మిక సంఘాలతో మాట్లాడమన్నా మాట్లాడడానికి ఈ ప్రభుత్వం సన్నద్ధంగా ఉంటుందని, ఎటువంటి భేషజాలకు పోదని తమ ద్వారా మనవి చేస్తున్నాను. గతంలో జరిగినటువంటి చిన్న చిన్న లోపాలను సరిచేసు కుని, చట్టంలో ఉన్న లొసుగులను బయటకు తీసి, కార్మికులకు ముందుముందు మంచిమంచి అవకాశాలు కల్పించాలని, వారందరికీ కనీస వేతన చట్టం అమలుచేయాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ఈరోజు చాలామందిచేత గొడ్డు చాకిరీ చేయించుకుంటున్నారు. వారికి కనీస వేతనం ఇవ్వలేని పరి స్థితిగా ఉంది. ఈరోజున చాలావరకూ వాటన్నింటిని స్ట్రీమ్‌లైన్ చేయడం జరిగింది.

గతంలో లేబర్ డిపార్టుమెంటు అంటే, భయం భయంగా ఉండేవారు. ఈరోజున లేబర్ డిపార్టుమెంట్ అంటే భయం లేని పరిస్థితి ఉంది. మళ్ళీ ఆ స్థాయికి తీసుకురావాలని, భగవంతుడు ఇచ్చిన ఈ అవకాశాన్ని ఉపయోగిస్తూ, వాటి మీద దృష్టిపెట్టే ప్రయత్నం చేస్తున్నాం. నా దగ్గర ఎటువంటి రాజకీయాలు ఉండవు. నా దగ్గర పనిచేసే తత్వమే ఎక్కువ. నా దగ్గర పనిచేసే అవకాశం వచ్చిందంటే, దానిని చక్కగా సద్వినియోగం చేసుకుంటూ ముందుకు వెళ్ళాలనే ఆలోచన చేస్తూ ఉంటాను. ఎవరైనా నా దగ్గరకు వచ్చి, మంత్రిగారు ఫలానా సమస్య ఉంది అంటే, అందరం కలిసి దానిని పరిష్కరిద్దాము. మొన్ననే మా దగ్గరకి సమస్యలలో ఉన్న అరబిందో పరిశ్రమ వచ్చింది. గత 5 మాసాల నుంచి వేతనాలు లేక, వారు ఇబ్బందులు పడుతున్నారు. ఒక చిన్న ఇష్యూ మీద స్ట్రైక్ అయితే, అందరినీ కూర్చోపెట్టి, ఆ సమస్యను కూడా పరిష్కరించడం జరిగింది. 50, 60 మంది నిజమైన కార్మికులు బయట ఉన్నారు. వారి సమస్యలను కూడా పూర్తిస్థాయిలో పరిశీలించి, వారిని కూడా పరిశ్రమలలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాం.

ఈరోజు కొంతమంది గౌరవ సభ్యులు మత్స్యకారుల గురించి మాట్లాడారు. గతంలో ఎప్పుడైనా తుఫానులు వస్తే, మత్స్యకారులకు 5, 6 కేజీల బియ్యాన్ని కేవలం వేటకు వెళ్ళిన వారికి మాత్రమే ఇచ్చేవారు. హుద్‌హుద్ తుఫాను వచ్చినపుడు వేటకు వెళ్ళినా, వెళ్ళకపోయినా ఒక్కొక్క కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని ఇచ్చాము. దానితోపాటుగా, ఒక్కొక్క కుటుంబానికి రూ.10,000 నగదు ఇచ్చాము. గతంలో కొంతమంది సభ్యులు చెప్పినట్లుగా కొంతమందికి సెల వులు ప్రకటిస్తే, వారికి కూడా 5, 6 కేజీల బియ్యాన్ని ఇచ్చేవారు. అవి కూడా ఎన్ని పడవలు ఉన్నాయో, ఎంతమంది వేటకు వెడుతున్నారో వారికే ఇచ్చేవారు. ఈసారి ఆ విధానం కాకుండా, మత్స్యకారులంటే పూర్తిగా అభిమానించిన నాయకుడు శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు. గౌరవ సభ్యులు చెప్పినట్లుగానే సుదీర్ఘమైన తీర ప్రాంతం ఉంది. వారు పట్టుకున్న చేపలకు ఎక్కడా శీతలగి డ్డంగుల వ్యవస్థ కూడా లేదు. ఒకేసారి ఎక్కువ చేపలు లభించినా దళారులు వస్తే, తక్కువ రేటుకు అమ్ముకునే పరిస్థితి ఈ రోజున ఉంది. కాబట్టి, ఈ రోజు మత్స్యకారులలో కూడా నిరుద్యో గులు ఉన్నారు. వారిని ఒక సంఘంగా పెట్టి, వారితో ఆ ప్రాంతంలో శీతల గిడ్డంగులు, మొదలైన

అవకాశాలను వారికి చూపించి, వారు పట్టుకున్న సంపదకు మంచి ధర పలికే విధంగా పలు కార్యక్ర మాలను చేయాలని ఈ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని మీ అందరికీ తెలియజేస్తు న్నాను. ఈ ప్రభుత్వం తప్పనిసరిగా ప్రో కార్మికుడిగా ఉన్నటువంటి ప్రభుత్వం ఇది. అయితే, చిన్న చిన్న విషయాలను పెద్దవి చేసుకోకుండా, మనం సామరస్యంగా పరిష్కరించుకుందాము. పరిశ్రమ లను ఈ రాష్ట్రానికి తీసుకురావలసిన బాధ్యత అధికారంలో ఉన్న మా పైనేకాదు, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రజలందరిపైన ఉంది. పరిశ్రమలు వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. ఈరోజు కేంద్రప్ర భుత్వం గురించి కూడా సభ్యులు చాలామంది మాట్లాడారు. ఈరోజున కేంద్రం కూడా అన్ని విష యాలలో సహకరిస్తుందని పూర్తి విశ్వాసంతో ఉన్నాము. మేమందరం కలిసి పోటీ చేసి, కేంద్రంలోను, రాష్ట్రంలో కలిసి అధికారం కూడా చేస్తున్నాం. ఇప్పటికే, ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి సమస్యలు ఇండస్ట్రీ పాలసీ విషయంలో కానీ, మన రాష్ట్రానికి రావలసిన అవసరాల విషయంలో కానీ, మన రాష్ట్రం విడిపోయేటప్పుడు చట్టంలో పెట్టిన అన్ని అంశాలు సాధించే విషయంలో మన ముఖ్యమంత్రిగారితో కలిసి కృషి చేస్తున్నాం. అయితే, ఆరోజు ఏ ఉద్దేశంతో, ఏ కారణంతో ఈ రాష్ట్రాన్ని విడదీశారో కానీ, హేతుబద్ధత లేకుండా, ఒక విధానం లేకుండా విడదీసి, ఈ ఆంధ్రరాష్ట్రా నికి తీరని నష్టాన్ని తెచ్చారు. ఆ నష్టాన్ని పూరించడానికి శ్రీ ఎన్. చంద్రబాబునాయుడిగారి నాయక త్వంలో అన్ని రకాలుగా ప్రయత్నం చేస్తున్నామని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తు న్నాను. చట్టాలను గౌరవించి, కార్మికులకోసం పెట్టిన ప్రతి అంశాన్ని కూలంకషంగా పరిశీలన చేసి, వారికి న్యాయం చేయడమే కాకుండా, అసంఘటిత కార్మికులుగా ఉన్న సుమారు రెండుకోట్ల, 11 లక్షల మందికి అన్నిరకాలుగా న్యాయం చేసేందుకు ఈ ప్రభుత్వం ముందుకు వెడుతుందని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

గౌరవ సభ్యులు చాలా మంచి మంచి విషయాలు ప్రభుత్వం దృష్టిలో పెట్టారు. దానిని కూడా పరిగణనలోకి తీసుకుని, మంచి పరిపాలనను ఇచ్చి, కార్మికులకు న్యాయం చేయడానికి పూర్తిగా కృషి చేస్తామని ఈ సందర్భంగా తమ ద్వారా గౌరవ సభ్యులకు మనవిచేస్తున్నాను.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : అధ్యక్షా, మంత్రిగారు ఇప్పుడే కాదు, గతంలో కూడా చర్చలు జరిగినప్పుడు చాలా చక్కని జవాబులు చెప్పారు. చాలా ఆశావహకమైన దృశ్యాన్ని ఆవిష్క రించారు. ఇప్పుడు కూడా చాలా హంబుల్‌గా, పద్ధతిగా ఆయన చెప్పిన దానికి మేము సంతోషప డుతున్నాము. మీ ద్వారా గౌరవ మంత్రిగారి దృష్టికి రెండు, మూడు అంశాలను తీసుకువస్తు న్నాము. మీ అందరికీ తెలిసిన విషయం ఏమిటంటే, నిన్న ఉపాధ్యాయ ఎం.ఎల్.సి. ఎన్నికలు జరి గాయి. ఈ ఎన్నికలలో ఓటుకి ప్రైవేటు పాఠశాలల్లో మూడు సంవత్సరాల పాటు ప్రావిడెంటు ఫండు కట్టి ఉన్నట్లయితే, వారికి అర్హత ఉందని ఎలెక్షన్ కమీషన్ ప్రకటించింది.

మ. **01.50**

ఈ ఎమ్మెల్సీల ఎన్నికల్లో ఓట్లు వేయాలంటే, ప్రయివేటు పాఠశాలల్లో మూడేళ్ల పాటు ప్రావిడెంట్ ఫండ్ కట్టి ఉంటేనే వాళ్లకి అర్హత ఉంటుందని ఎలక్షన్ కమీషన్ ప్రకటించింది. దానివల్ల 99 శాతం మంది ఉపాధ్యాయులకు ఆ హక్కు పోయింది. అంటే, ఒక్క పాఠశాల గాని, ఒక్క కళాశాల గానీ పి.ఎఫ్. కట్టడం లేదు. మేమంతా టీచర్లం. రాష్ట్రవ్యాప్తంగా 1,80,000 మంది ఉన్నాము. కొంచెం అటూ, ఇటుగా కాలేజీలను కలుపుకుంటే, వాళ్లు కూడా 2 లక్షల మంది వరకు ఉన్నారు. ఈ రెండు లక్షల మందిలో అంత విద్యావంతులయ్యి కూడా.. మీరందరూ కార్పోరేట్ విద్య, కార్పోరేట్ విద్య అని మాటిమాటికి అంటుంటారు. అదేదో గొప్పదైనట్టు. ఆ కార్పోరేట్ విద్యనందిస్తున్న

టీచర్లకు,లెక్చరర్లకు ఒక్కరికీ కూడా ఇపిఫ్ లేదంటే పరిస్థితి ఎంత బాధకరంగా ఉందో గమనించమని కోరుతున్నాను.

రెండవదేమంటే, విద్యా, ఆరోగ్య రంగాల్లో ఈ కేంద్ర ప్రభుత్వ పథకాలు చూస్తే, అనేక రకాల పథకాలు వస్తున్నాయి. ఈ పథకాల్లో లబ్ధిదారులైనటువంటి వాళ్లకి సంబంధించి ఏం మాట్లాడినా, కేంద్రం అంతే ఇస్తున్నదండీ, మనం మాత్రం ఏం చేయగలుగుతాము అని ఆయా శాఖలు చెబుతున్నాయి. ఉదాహరణకు, ఒక్క సర్వశిక్షా అభియాన్‌లోనే 26,000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వాళ్లని ఎప్పుడు తీసేస్తారు, ఎప్పటి వరకు ఉంచుతారనేది ఏమీ తెలియదు. వాళ్లు చేసే పనులు చూస్తే, సాధారణ ఉపాధ్యాయుల కంటే, పెద్ద, పెద్ద పనులు వాళ్ల చేత చేయిస్తున్నారు.

హెల్త్ రంగంలో చూసినట్లయితే కనీసం లక్ష మంది ఇలాంటి వాళ్లుంటారు. రకరకాల పథకాల క్రింద కొనసాగుతుంటారు. యూరోపియన్ ఏఎన్‌ఎంలు అని ఒక జాతి ఉంది. అది వినడానికి మనకే అదోలా ఉంది. అంత పెద్ద పేరుతో ఉంటుంది. యూరోపియన్ ఏఎన్‌ఎంలు ఎవరంటే – యూరోప్ నుండి వచ్చిన ఒక పెద్ద ప్రాజెక్టులో భాగంగా ఉద్యోగాల్లో చేరినవాళ్లు. ఆ ఏఎన్‌ఎంలు వాస్తవానికి ఎవరంటే కాన్పులు చేసే వాళ్లు. కానీ, వాళ్లకు మెటర్నిటీ లీవు ఉండదు. అందరికీ కాన్పులు చేసే వీళ్లు, ప్రసూతి సెలవులో వెళితే, వాళ్లు తిరిగొచ్చేటప్పటికి ఆ ఉద్యోగం ఉంటుందో, ఊడుతుందో కూడా తెలియనటువంటి పరిస్థితి.

అలాగే, కేంద్ర ప్రభుత్వం ట్రైబల్స్‌కు సంబంధించి ఐటీడీఏ ప్రాజెక్టు పరిధిలో ఆశ్రమ పాఠశాలల పేరుతో కొన్ని పాఠశాలల్ని నిర్వహిస్తున్నది. అక్కడ పనిచేసే సెకండరీ గ్రేడ్ టీచర్‌కు రూ.4,500 జీతం, స్కూల్ అసిస్టెంట్‌కు రూ.5,500. గత ఎనిమిదేళ్లుగా వాళ్లు అదే జీతాలతో, అలాగే పనిచేస్తున్నారు. అట్లా, ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయులు కేవలం రూ.4500/-తో పనిచేస్తుంటే, ఇంక అక్కడేముంటుందో మీరే చెప్పండి? ఇక్కడ మనం ప్రైవేటు రంగంలో ఉన్న వాళ్ల గురించి చాలా మాట్లాడుతున్నాము. ప్రభుత్వరంగంలో ఉంటూ, ప్రభుత్వం పని చేయించుకుంటున్న వాళ్ల పరిస్థితి మాత్రం అత్యంత దయనీయంగా ఉంది. ఇదొక్కటి గమనించండి.

మూడవదేమంటే, మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చాలా మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడానికి పూనుకుంటున్నామని చెబుతూ, మంత్రివర్గ ఉపసంఘాన్ని ఒకటి వేయడం జరిగింది. ఆ మంత్రి వర్గ ఉప సంఘం ఏం చేస్తోందో, ఎప్పటికి నిర్ణయం చేస్తుందో తెలియదు. మాటిమాటికి పేపర్లలో ప్రకటనలు వస్తుంటాయి. మంత్రులు గానీ, మరొకరు గానీ మాట్లాడితే చాలు, మేము సుప్రీంకోర్టు నిర్ణయాలకు లోబడి వీళ్లని రెగ్యులరైజ్ చేస్తామనే ముక్తాయింపు ఇస్తున్నారు. అసలు నిజానికి వాళ్లను రెగ్యులరైజ్ చేస్తారా, చేయరా, ఏ నిబంధనలు పెట్టుకుంటారు, ఎవరికి చేస్తారనేది చూస్తే, ఆ మంత్రి వర్గ ఉపసంఘమనేది నిజానికి ఒక పెద్ద బ్రహ్మ పదార్థం అయిపోయింది. వేలాది మంది, లక్షలాది మంది ఆ కమిటీ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. ఆఖరికి వాళ్లకు మీరు భయంకరమైన శాపాన్నే మిగులుస్తారో, లేకపోతే ఏదన్నా వరాన్నే మిగులుస్తారో తెలియదు గానీ, దాని సంగతేమిటో త్వరగా తేల్చండి సార్. అలా నాన్చకండి.

చివరిగా నేను చెప్పేదేమంటే, కేవలం మీరు కొన్ని కార్మిక చట్టాలను అమలు చేసినంత మాత్రాన కార్మిక శ్రేయస్సంతా దానితో ఒరిగిపోదు. నేను హైదరాబాదులో ఉన్న ఆటో కార్మికులకు

సంబంధించి ఒక చిన్న సర్వే చేశాను, అదే అంత పెద్దది కాదు. నేను ఆటోల్లో ఎక్కినప్పుడు చేసిన సర్వే అది. వాళ్ల జీతంలో 80, 90 శాతం మొత్తాన్ని వాళ్ల పిల్లల చదువు కొరకే ఖర్చుపెడుతున్నారు. నిజంగా ప్రభుత్వ పాఠశాలలు బాగుండి ఉంటే, తమిళనాడు, కేరళ లాగా ఉండి ఉంటే, కార్మికులకు వాళ్ల జీతాల్లో 80, 90 శాతం మిగిలి ఉండేది. ఆ రకమైన విద్యా వ్యవస్థ హైదరాబాదులో లేనందువల్ల అది మీకు సంబంధించినది కాకపోవచ్చు. కానీ, వెల్ఫేర్ నెట్‌వర్క్ అనేది లేకపోతే, కార్మికుల మీద ఆ ప్రభావం పడుతుంది.

అలాగే, హెల్త్ రంగం కూడా. ఏ గవర్నమెంట్ ఆసుపత్రికి పోయినా, ఒక పేదవాడి వైద్యానికి నమ్మకం లేదు. ఒకసారి ఒక చిన్న సమస్య గానీ వచ్చినట్లయితే, ఇక ఆ కార్మికుడి జీవితం అయిపోయినట్లే లెక్క. కాబట్టి, దీన్ని కాంప్రెహెన్సివ్‌గా చూడాల్సిందే తప్ప, ఏదో కొన్ని చట్టాలని అమలు చేసినంత మాత్రాన, కొన్ని చిన్న చిన్న చిట్కాలను అమలు చేసినంత మాత్రాన ఈ సమస్య పరిష్కారం కాదు. కార్మికులు లేకుండా మనమెవ్వరం లేమనే విషయాన్ని ఇక్కడ మనమందరం మాట్లాడుకుంటున్నాము. ఈ సభలో ఉన్న వస్తువుల్లో ఏ ఒక్క వస్తువైనా మనం తయారు చేశామా? బెంచీలు చేశామా, బిల్డింగులు కట్టామా? ఏం చేశాము! ఫలానాది చేశామని చెప్పండి. కాబట్టి, కార్మిక వర్గ అనుకూల దృక్పథాన్ని మీ ప్రభుత్వం అలవర్చుకుని, వాళ్లు స్థిమితంగా ఉండే విధంగా మీరు నిర్ణయాలు తీసుకుని, మిగతా సామాజిక భద్రతా సౌకర్యాలను కూడా వాళ్లకు కల్పించే విధంగా ఒక కాంప్రెహెన్సివ్ విధానం ఉండాలే తప్ప, పైపైనే ఈ సమస్య పరిష్కారం కాదు. అందువల్ల, నేను చెప్పదల్చుకున్నదేమంటే – ఈ విషయాలపై ఎంతసేపు మాట్లాడుకున్నా మాకూ అసంతృప్తిగా ఉంటుంది. అలాగే, రెండు, మూడు సార్లు మాట్లాడుకున్న తరువాత మీక్కూడా విసుగొస్తుందని భయమేస్తోంది సార్. నాకీ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు.

శ్రీ బి. చెంగల్ రాయుడుః అధ్యక్షా, కోడూరు చుట్టుప్రక్కల ఉన్నటువంటి బెరైటీస్ మిల్స్ అన్నీ తేదీ.08.12.2014 నుండి క్లోజ్ చేయబడ్డాయి. డబ్బు కట్టించుకుని ప్రభుత్వం దగ్గర ఉన్నటువంటి మినరల్స్ సప్లై చేయనందువల్ల, 30,000 మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఇదే విషయాన్ని నేను ఈ హౌస్‌లో పదిసార్లు చెప్పడం జరిగింది. కాబట్టి, కార్మిక మంత్రి గారు చొరవ తీసుకుని, 30,000 మంది కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించే విధంగా, గవర్నమెంట్ ఇవ్వాల్సినటువంటి మినరల్స్‌ని సప్లై చేసేస్తే, వాళ్లు ఒడ్డున పడిపోతారు.

అదేవిధంగా విశాఖపట్నంలో బాక్సైట్ ఇండస్ట్రీ కట్టారు. బాక్సైట్ సప్లై చేయని కారణంగా, industry is not functioning. కొన్ని ఇండస్ట్రీలను పిలిపించే ప్రయత్నం చేస్తున్నందుకు మీకు అభినందనలు. రెండవదిగా, ఒక నిజాన్ని మీరు ఒప్పుకున్నారు. ఇంత వరకు మేము ఒక్క ఇంటిని కూడా శాంక్షన్ చేయలేదన్నారు. దానికి కూడా మీకు అభినందనలు. ఇకపోతే, మీరు ఇళ్లని పూర్తి చేస్తామంటున్నారు. దానికి కూడా అభినందనలు. కానీ, ఎప్పటిలోపు, ఆ ఇళ్లని పూర్తి చేస్తారనే మాట కూడా చెప్పాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీ ఎం. సుధాకర్ బాబుః అధ్యక్షా, ఇక్కడున్న వారందరూ, అనేకరకాల కార్మికుల విషయాలు మాట్లాడారు. కానీ, అత్యంత బాధాకరమైన కార్మికులు బీడీ కార్మికులు. వారి విషయాన్ని మాత్రం ఎవ్వరూ మాట్లాడలేదు. కర్నూలు జిల్లాలో బీడీ కార్మికులు చాలా దయనీయమైన స్థితిలో ఉన్నారు. వారికెలాంటి సౌకర్యాలూ లేవు. ఇఎస్‌ఐ ఆసుపత్రి కూడా కర్నూలులో ఉంది. కానీ, అదొక బాడుగ ఇంట్లో ఉంది. ప్రస్తుతం కొన్ని వేల మంది బీడీ కార్మికులు కర్నూలులో ఉన్నారు. ఈ రోజే పేపర్లో కూడా చదివాను. ఒక బీడీ కార్మికుడు మంచి గాయకుడై ఉండి కూడా, గత ఆరు నెలల్లో క్షయ

రోగానికి గురై చిక్కి శల్యమయ్యాడని ఈ రోజే పేపర్లో కూడా వార్త వేయడం జరిగింది. దయచేసి, అటువంటి వారికోసమైనా ఒక మంచి కార్యక్రమాన్ని ప్రభుత్వం ద్వారా చేపట్టాలని కోరుతున్నాను. ఎందుకంటే, వాళ్లకు వేరే ఉపాధి లేదు. బీడీలు చేసే బ్రతకాలి, లేకుంటే చావాలి. దయచేసి, వాళ్లకు ఏదన్నా ఉపాధిని ప్రభుత్వం ద్వారా కల్పిస్తారా అని మీ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను.

శ్రీ పి.జె.చంద్రశేఖర రావుః అధ్యక్షా, ఆరు నెలల క్రితం జరిగిన సమావేశంలో గౌరవ మంత్రి గారు ఇప్పుడు చెప్పినది, అప్పుడు చెప్పినది చూస్తే, 99 శాతం అప్పుడు చెప్పినది, ఇప్పుడు చెప్పినది ఒకటే ఉంది. అయితే, నేను వారి దృష్టికి తీసుకురాదల్చుకున్న విషయమేమంటే – ఇప్పుడు మాట్లాడినటువంటి వాళ్లు, వాళ్లకి సంబంధించి రెయిజ్ చేసినటువంటి పర్టిక్యులర్ పాయింట్స్ దేనికీ మంత్రి గారు సమాధానం చెప్పలేదు. కాబట్టి, నాకు రెండు నిమిషాలు సమయమివ్వమని మిమ్మల్ని కోరుతున్నాను.

ఏజెన్సీల ద్వారా మోసపోయి విదేశాల్లో హౌస్ మెయిడ్స్‌గా ఉండి, జైళ్లలో కూడా ఉన్న మన దేశ మహిళల్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు గాను, అసలు ఎంత మంది మహిళలు ఉన్నారు, వారిని తీసుకురావడానికి మీరేం చేస్తారు అని మంత్రి గారిని అడిగాను. నాతోబాటు సభ్యురాలు శ్రీమతి పి.శమంతకమణి గారు కూడా అడిగారు. కానీ, దానికేం రెస్పాన్స్ కాలేదు. అసలు మిగతా రాష్ట్ర ప్రభుత్వాలు అంటే కేరళ గానీ, తెలంగాణా గానీ, కర్నాటక గానీ సెపరేట్‌గా డిపార్టుమెంటులో ఒక మినిస్ట్రీనే పెట్టి, దాన్ని కేంద్రంలో ఉన్నటువంటి మినిస్ట్రీతో అనుసంధానం చేసి, వాళ్లు టీమ్స్‌గా అక్కడకు వెళ్లి వెరిఫై చేసి, వాళ్లని రిలీవ్ చేసుకుంటూ వచ్చే పద్ధతి ఉన్నది. ఆవైపుగా ప్రభుత్వమేమన్నా ఆలోచిస్తున్నదా? అని అడుగుతున్నాను.

రెండదేమంటే – అనేక ట్రైపార్టీ కమిటీలు సాంప్రదాయబద్ధంగా లేబర్ డిపార్టుమెంటులో వేస్తే బాగుంటుందని నేను ఇంతకుముందే రిఫర్ చేశాను. వాటి ఏర్పాటేమన్నా ఒక నెల రోజుల్లోపు పూర్తి చేస్తారా? గత సమావేశంలో కూడా నేను ఈ విషయాన్ని ప్రస్తావించాను. అలాగే, ఇంతకుముందే సభ్యులు శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం గారు అన్నారు. స్కీం వర్కర్స్‌గా ఉన్న వాళ్లకి లేబర్ రైట్స్ కల్పించడం లేదా వాళ్లని వర్కర్‌గా డిజిగ్నేట్ చేసి, వర్కర్‌కుండే రైట్స్‌నిచ్చే విధంగా ఆ రకమైన పద్ధతుల్లో మన ఆంధ్రప్రదేశ్‌లో ఏమన్నా ప్రయత్నం చేయగలుగుతారా, లేదా?

మ.**2.00**

అధ్యక్షా, అలాగే, పరిశ్రమలు, ట్రేడ్ యూనియన్లు అనగానే ఈ ప్రభుత్వానికి ఒక దురభిప్రాయం ఏర్పడింది. అదేమిటంటే.. పరిశ్రమాధిపతులను సంతృప్తిపరచాలంటే ట్రేడ్ యూనియన్ల యొక్క ఒత్తిడి వారి మీద లేకుండా ఉండాలని, వాళ్లు లేకపోతే ఇక్కడ ఉద్యోగాలు రావని ఈ రకమైన దురభిప్రాయంలో ప్రభుత్వం ఉండడమనేది ఆశ్చర్యకరం. యాజమాన్యాలకు లాభాలు వస్తాయనుకుంటే శ్మశానానికైనా పెట్టుబడులు పెడతారు. కాబట్టి కార్మికులనగానే సంఘాలు పెడతారు, సమ్మెలు చేస్తారు, కంపెనీలను మూసి వేస్తారనే అభిప్రాయం కరెక్ట్ కాదు. రిజర్వ్ బ్యాంకు లెక్కల ప్రకారంగా మొత్తం భారత దేశంలో మూత పడిన పరిశ్రమలన్నింటిని సర్వే చేసి కార్మికుల యొక్క అశాంతి కారణంగా మూతపడినవి కేవలం మూడు శాతం మాత్రమే. 97 శాతం మార్కెట్ సమస్యల వల్ల, మేనేజ్‌మెంట్ సమస్యల వల్ల, భాగస్వాముల సమస్యల వల్ల, పెట్టుబడి సమస్యల వల్ల మూతపడినటువంటివి ఉన్నాయి. కాబట్టి కార్మికుల యొక్క ట్రేడ్ యూనియన్ల వల్ల పరిశ్రమలు రావు అనేటటువంటి ఒక అభిప్రాయం ఏదైతే ఉందో దానిని ప్రభుత్వం మార్చుకోవాల్సిన అవసరముంది. ఎక్కడైతే పరిశ్రమలలో యూనియన్లు లేవో ప్రభుత్వం

ప్రోత్సహించి యూనియన్ల రిజిస్టర్ చేసేటట్లు చేసి ప్రభుత్వం కార్మికుల పక్షాన నిలబడాలని కోరుతున్నాను.

శ్రీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి : అధ్యక్షా, గౌరవనీయులైన కార్మిక శాఖ మంత్రి గారు చాలా ఫ్యాక్టరీలలో ఉన్నటువంటి లాకౌట్లను ఎత్తివేసి అక్కడ పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేయడం జరిగిందని మంత్రి గారి సమాధానంలో తెలియజేశారు. ఆ విధంగా చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అలాగే, చిత్తూరు జిల్లాలోని పుంగనూరులో ఉన్న శ్రీనివాస షుగర్ ఫ్యాక్టరీ దాదాపు సంవత్సర కాలంగా మూతవేయబడి వేలాది కార్మికులు రోడ్డున పడ్డారు. అదే విధంగా, చిత్తూరులో ఉన్న కోపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ అత్యంత చారిత్రాత్మకమైంది. అనేక సంవత్సరాలు లాభసాటిగా నడపబడ్డ షుగర్ ఫ్యాక్టరీ. అలాగే, రేణిగుంటలో ఉన్నటువంటి యస్.వి. షుగర్ ఫ్యాక్టరీ వంటి వాటన్నింటిని అనవసరంగా లాకౌట్లు ప్రకటిస్తూ, చెరుకు ఉత్పత్తి అయ్యే సందర్భంగా అనేక నష్టాలకు గురిచేస్తున్నారు. ఏదైనా షుగర్ కొనుగోలులో అటువంటి కోపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలకు అవకాశం ఇవ్వకుండా ప్రైవేటు వాటిని అవకాశం ఇస్తున్నారు. అదే విధంగా, అంగన్‌వాడీ ఉద్యోగులకు గతంలో రూ.౮౦౦ల వేతనాల పెంపుదలకు, గ్రాట్యూటీకి అవకాశం ఇచ్చారు. వారి న్యాయమైన కోర్కెల సాధన కోసం ఆందోళనలు చేస్తున్న సందర్భంలో వారి మీద జరిగిన దమనకాండ న్యాయమైనది కాదు. కార్మిక శాఖ మంత్రి గారు దీనిని చూడాలి. అదే విధంగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మిడ్ డే మీల్స్ కార్యక్రమాన్ని నిర్వర్తిస్తున్న కార్మికులకు కుకింగ్ ఛార్జెస్ ఇవ్వకుండా, వారికి భద్రత కల్పించకుండా ఉండడంతో వారు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. వారికి ఈఎస్ఐ వంటి సౌకర్యాలను కల్పించవలసిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

డా. ఎం. గేయానంద్ : అధ్యక్షా, ఇటీవల కాలంలో నేను హిందుపూర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రికి వెళ్లి వచ్చాను. అక్కడ ఒక లేడీ డాక్టర్‌ను ప్రత్యేకంగా ఒక రూంలో కూర్చొని వైద్యం చేయమని అక్కడ కార్మికులు అడుగుతున్నారు. ఆ సమస్య పరిష్కారం కాకపోవడంతో పెద్ద ప్రొటెస్ట్ అయింది. వాస్తవంగా అక్కడ డాక్టర్లు కాని, ఇతరత్రా సదుపాయాలను కాని ప్రాపర్‌గా మెయిన్‌టెయిన్ చేయడానికి ప్రభుత్వం ఏదైనా ఒక నోడల్ అధికారిని ఎవరినైనా ఒకరిని నియమించి, వాటన్నింటిని సర్వే చేయించి, అక్కడ ఏమి చేయాలి? మైనర్ గ్యాప్స్ ఏమున్నాయి? వాటిని ఎలా ఫిలప్ చేయాలి అనే దాని మీద ఒక యాక్షన్ ప్లాన్‌ను తయారుచేస్తే కార్మికులకు చాలా ఉపయోగముంటుంది. నూటికి డెభై, ఎనభై కేసులు ఎంబిబిఎస్ డాక్టర్లు ట్రీట్ చేయరు. కాబట్టి ఈఎస్ఐ ఆసుపత్రులను బలోపేతం చేయడానికి ఏమి చేస్తారో చెప్పండి. కార్పోరేట్ ఆసుపత్రుల గురించి తరువాత చెప్పండి. మేజర్ ప్రాబ్లమ్స్ వస్తే అప్పుడు చూడవచ్చు.

మిస్టర్ ఛైర్మన్ : మంత్రి గారూ.. సభ్యులేమో చాలా ముఖ్యమైన విషయాలే చెబుతారు. సమయం తక్కువ ఉంటుంది. మీరేమో స్టార్ట్ చేసినప్పుడు రిప్లైలో మీడియా గురించి ఒక మాట అన్నారు. ఇక్కడ బాగా చర్చ జరుగుతుంది, మేము సమాధానం చెబుతాం కాని పేపర్లో వచ్చేది ఏమీ ఉండదని చెప్పారు. ఇప్పుడు రెండు గంటలు కావస్తున్నా, గ్యాలరీలో ఎంతమంది విలేకర్లు ఉన్నారో చూడండి. గ్యాలరీ ఫుల్, కలెక్షన్ మాత్రం నిల్. శాసన పరిషత్తు బిజినెస్ గురించి న్యూస్ రావడం లేదు. ఒకసారి మీరు సంబంధిత శాఖ మంత్రి సమాచార శాఖ మంత్రి గారు చెప్పారు. మీరు కూడా సంబంధిత మంత్రి గారే. ఆ యాజమాన్యాలను ఒకసారి పిలిపించి మాట్లాడండి. నేను రెండుసార్లు మీడియా వాళ్లతో మాట్లాడాను. వారు ఏమన్నారంటే.. సార్, మేము వ్రాసి పంపిస్తున్నాం. మేము సమావేశం పూర్తి అయ్యేంతవరకు ఇక్కడనే ఉంటున్నాం. ఈసారి కూడా

లెజిస్లేటివ్ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా ప్రత్యేకించి ప్రెస్ గ్యాలరీ ఇచ్చాం. అందువల్ల అందరూ కూర్చుంటున్నారు. ఎక్కడ మిస్ అవుతుందో తెలియదు. అందరూ శ్రీవైష్ణవులే కాని... ఒకసారి మీరు ఆ యాజమాన్యాలతో కూడా మాట్లాడండి.

శ్రీ కింజరపు అచ్చన్నాయుడు : అధ్యక్షా, తప్పనిసరిగా మేనేజ్‌మెంట్లతో మాట్లాడతాను. శాసన పరిషత్తు ప్రొసీడింగ్స్‌ను కవర్ చేయడం కూడా అవసరం కూడా.

మిస్టర్ ఛైర్మన్ : హుద్‌హుద్ తుఫాను తరువాత నేను, డెప్యూటీ ఛైర్మన్ గారు, శ్రీనివాసులు నాయుడుగారు, స్థానికంగా ఉన్నటువంటి ఎం.వి.యస్. శర్మ గారు విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలకు వచ్చాము. అప్పుడు అక్కడున్న మత్స్యకారులు మా దగ్గరున్న నిల్వ ఉన్న చేపలు, బోట్స్, నెట్స్ కూడా దెబ్బతిన్నాయి. చాలా నష్టం జరిగిందని చెప్పారు. వాటికి సంబంధించి ఏదో కొద్దిగా ఆలోచన చేసి నష్టపరిహారం చెల్లించడానికి ప్రయత్నం చేస్తామని చెప్పారు. ఇది చాలా ముఖ్యమైంది కాబట్టి గుర్తు చేశాను.

శ్రీ కింజరపు అచ్చన్నాయుడు : అధ్యక్షా, గతంలో చాలా తుఫాన్లు వచ్చాయి. ఎప్పుడూ ఇంత త్వరగా పరిహారం చెల్లించలేదు. హుద్‌హుద్ తుఫాను వచ్చినప్పుడు దాదాపు 40 రోజుల్లోనే అన్ని వర్గాల వారికి న్యాయం చేయడం జరిగింది. ఇది చరిత్ర. ఇంత స్వల్ప కాలంలో అందరికి న్యాయం చేయడమనేది ఇదే మొదటిసారి. మత్స్యకారులకు కాని, వ్యవసాయదారులకు కాని హుద్‌హుద్ తుఫాను వల్ల నష్టపోయిన వారందరికి న్యాయం చేశాం. ఇంకా అక్కడక్కడా ఎవరైనా మిగిలిపోతే ప్రభుత్వ దృష్టికి వస్తుంది. వారికి కూడా న్యాయం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

ముఖ్యంగా, ఇపిఎఫ్ గురించి సభ్యులు చెప్పారు. ఇది ప్రధానమైన సమస్య. తప్పనిసరిగా ఒక వింగ్‌ను ఏర్పాటు చేసి అన్ని డిపార్ట్‌మెంట్లలో ఇపిఎఫ్ అనేది కరెక్ట్‌గా కడుతున్నారా? లేదా తెలుసుకొని, ఒక వేళ కట్టకపోతే తప్పనిసరిగా కట్టకపోతే కట్టే విధంగా తగిన చర్యలు తీసుకుంటాం.

రెండవది, ఎవరైతే కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులున్నారో వారందరి క్రమబద్ధీకరణ విషయంలో ఇప్పటికే రెండు, మూడు సమావేశాలు నిర్వహించాం. వీలైనంత త్వరగా దీని మీద చర్య తీసుకుంటాం. కాంట్రాక్టు వ్యవస్థ అనేది రెండు రకాలుగా ఉంది. ఒకటి, డైరెక్ట్‌గా ప్రభుత్వమే కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలు ఇవ్వడం, రెండవది అవుట్‌సోర్సింగ్. అవుట్‌సోర్సింగ్ విధానంలో ఒక నియమ,నిబంధనలు లేకుండా, విద్యార్హతలు లేకుండా, రూల్ ఆఫ్ రిజర్వేషన్లు లేకుండా వారి ఇష్టానుసారంగా ఇచ్చారు. అయితే, అవుట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న వారెవరికి సరైన అర్హతలు లేవు, విద్యార్హతలు లేవు, రిజర్వేషన్లను కూడా పాటించలేదు కాబట్టి వారిని మాత్రం క్రమబద్ధీకరించడానికి వీలు లేదని సుప్రీంకోర్టు చెప్పింది. అది సపరేట్ ఇష్యూ. ఎవరైతే ప్రభుత్వంలో కాంట్రాక్ట్ పద్ధతిలో గత 15, 20 సంవత్సరాల నుండి పని చేస్తున్నారో వారికి సాధ్యమైనంత వరకు, వీలైనంత త్వరగా సమావేశం పెట్టి క్లియర్ చేస్తామని తెలియజేస్తున్నాను.

మూడవది, గౌరవ సభ్యులు శ్రీ బి. చెంగల్ రాయుడు గారు చెప్పినట్లుగా, బెరైటీస్ సమస్య త్వరలోనే క్లియర్ అవుతుంది. రెండు, మూడు రోజుల క్రితమే టెండర్లను కూడా పిలవడం జరిగింది. ఎవరూ ముందుకు రాలేదు. అయితే, గతంలో డిడిల రూపంలో ప్రభుత్వానికి డబ్బులు కట్టి ఉన్నారు. అవన్నీ ప్రభుత్వం వద్ద ఉన్నాయి. దాని మీద కూడా దృష్టి పెట్టి వీలైనంత తొందరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలియజేస్తున్నాను.

నాల్గవది, బీడీ కార్మికుల గురించి సభ్యులు సుధాకర బాబు గారు చెప్పిన విధంగా మన రాష్ట్రంలో బీడీ కార్మికులు చాలా తక్కువగా ఉన్నారు. రాష్ట్రం విడిపోయిన తరువాత కర్నూలు వంటి రెండు, మూడు జిల్లాలలో దాదాపు 4,500 మంది మాత్రమే బీడీ కార్మికులున్నారు. మిగతా వాళ్లంతా తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారున్నారు. వీరి గురించి ఏమి చేయాలనే దాని గురించి మొన్ననే ఒక డిస్కషన్‌లో వచ్చింది. ఏమైనా పెన్షన్ ఇవ్వాలా లేక ఇంకా ఏమైనా చేయాలనేది ఇవ్వాలనేది కూడా ఆలోచిస్తున్నామని తెలియజేస్తున్నాను.

అదే విధంగా, చంద్రశేఖర రావు గారు చెప్పినట్లుగా విదేశాలకు వెళుతున్న కార్మికుల స్థితిగురించి పొట్ట కూటి కోసం దేనికైనా తెగిస్తున్నారు. మన ప్రాంతాలలో చాలా మంది మధ్యవర్తులుగా ఉండి దుబాయి, అరబ్ దేశాలకు తీసుకెళ్లి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి వారి దగ్గర డబ్బులు తీసుకొని అక్రమంగా విదేశాలకు తీసుకెళ్లి అక్కడ విడిచిపెడుతున్నారు. అక్కడ ఉండే వారిలో చాలా మంది దగ్గర నుండి ఇప్పటికి కూడా ఫోన్లు వస్తున్నాయి. మాకు కనీసం రెండు పూట్ల కూడా తిండి పెట్టడం లేదు. మేమెవరికైనా మా బాధలు చెప్పుకుందామంటే మమ్ములను రూంలో పెట్టి తాళాలు వేసి చాలా ఇబ్బందులు పెడుతున్నారంటే కేంద్ర ప్రభుత్వంతో కూడా మాట్లాడుతున్నాం. ఇప్పటికే ఇక్కడ ప్రత్యేకంగా ఒక వింగ్ పెట్టి మా దృష్టికి వచ్చిన వాటన్నింటి గురించి మాట్లాడుతున్నాం. ఇకనుండి ఎవరినైనా విదేశాలకు పంపించాలంటే.. ఒక సిస్టం ద్వారా వెళ్ళే విధంగా ఒక సిస్టంను అడాప్ట్ చేస్తున్నాం. ఆ సిస్టం గురించి సభ్యుల దృష్టిలో కూడా పెడతాం. తప్పనిసరిగా ఇకముందు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుకు తీసుకెళతామని తెలియచేస్తున్నాను.

లేబర్ డిపార్ట్‌మెంట్‌లోని కమిటీలను కూడా ఒక నెల లోపు వేస్తాం. ఇప్పటికే మూడు, నాలుగు కమిటీల ఏర్పాటు గురించి ఫైల్స్ సర్క్యులేషన్‌లో ఉన్నాయి. ముఖ్యమంత్రి గారి ఆమోదం పొందిన వెంటనే ఫైనలైజ్ చేస్తాం. ఇంకా రెండు, మూడు కమిటీలు వేయవలసిన అవసరం ఉంది. ఒక నెల లోపు అన్ని కమిటీలను ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

షుగర్ ఫ్యాక్టరీలు చాలా నష్టాలలో ఉన్నాయి. చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రి అయిన తరువాత ఏవైతే సహకార రంగంలో షుగర్ ఫ్యాక్టరీలున్నాయో ఆ ఫ్యాక్టరీలన్నింటికి గతంలో ఉన్న బకాయిలన్నింటిని ఫ్యాక్టరీకి రూ.4 కోట్లు, రూ.5 కోట్ల చొప్పున ఉంటే పాత బకాయిలన్నింటిని చెల్లించే విధంగా మొన్ననే ఒక జీ.ఓ కూడా జారీ చేశాం. వాటన్నింటిని మరల ఒక లైన్‌లోకి తీసుకు వచ్చి అవన్నీ పని చేసే విధంగా కార్యక్రమాన్ని తీసుకుంటున్నామని చెప్పి ఈ సందర్భంగా సభ్యులందరికి తెలియజేస్తున్నాను.

మ.**2.10**

సమావేశాలు జరుగుతాయి కాబట్టి, ఇక్కడే సమస్యలన్నీ చెప్పడం మేము సమాధానం ఇవ్వడం అని కాకుండా నిరంతరం మీకు అందుబాటులో ఉంటామని గౌరవ సభ్యులకు మనవిచేస్తున్నాను. ఎవరైనా సమస్యలపై ఒక లేఖ వ్రాస్తే, దానిపై నేను ఏం చర్యలు తీసుకున్నాననేది తిరిగి లేఖ వ్రాసే ఒక సిస్టమ్ నా దగ్గర ఉన్నది కాబట్టి ఎప్పటికప్పుడు సభ్యుల దృష్టిలోకి వచ్చిన సమస్యలను వ్రాస్తే, తప్పకుండా నేను సమాధానమిస్తానని చెబుతున్నాను. ఇంకా ఏవైనా సమస్యలుంటే, వాటిని కార్మిక సంఘాలతో కూర్చుని ఈ సమస్య పరిష్కారం అవుతుంది, ఇంతమంది లేబర్‌కు న్యాయం జరుగుతుందని అనుకుంటే ఎటువంటి భేషజాలకు పోకుండా ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తానని గౌరవ సభ్యులకు తెలియచేస్తున్నాను. మనందరం కలిసి pro

industry గా ఉండాలని, కార్మికునికి న్యాయం జరిగే విధంగా సహకరించాలని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందరం కలిసి ముందుకు వెళ్లాలని సభ్యులందరికీ ఈ సందర్భంగా మనవిచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

MR. CHAIRMAN: Now, the House is adjourned to meet again tomorrow at 10.00 a.m.

(Then, the House adjourned at 2.12 p.m. to meet again on Tuesday i.e. 24.03.2015 at 10.00 am.)

* * *